సాహిత్య
# ప్రస్థానం
జనవరి 2009

వెల రూ. 10



సాహితీ స్రవంతి

సాహిత్య
ప్రస్థానం
జనవరి, 2009
సంపుటి : 7 సంచిక : 38

# ప్రణాళికలు, ప్రహేళికలు

కొత్త సంవత్సరం. దానికన్నా ముందే కొత్త సవాళ్లు. గత ప్రత్యేక సంచికలో వాటిని ప్రస్తావించుకున్నాం. ముంబాయి ఉగ్రవాద దాడులు, ప్రపంచాన్ని కుదిపేస్తున్న ఆర్థిక సంక్షోభం, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ అన్ని చోట్లా ప్రజల పరిణత తీర్పుల మధ్య మతతత్వ రాజకీయాల వికృత విన్యాసాలు పెద్దగా ఫలించకపోవడం ఒకింత వూరట కలిగించే విషయం. ఏకధృవ ప్రపంచమని విర్రవీగిన అమెరికా అధ్యక్షునిపై ఆక్రమిత దేశంలోనే చెప్పుల వాన కురుస్తున్నదంటే ప్రపంచం ఎంత క్రోధితమై వుందో స్పష్టం. అయినా సామ్రాజ్యవాద ప్రతీఘాత దాడిని గాని, మతతత్వ శక్తుల మహోపద్రవాన్ని గాని తక్కువ అంచనా వేయడానికి లేదు.

రాష్ట్రంలో రాజకీయ అవినీతి హద్దులు మీరి ఎలుగుబంట్లు విలయవిహారం చేస్తుంటే ఏలికలు బేఖాతరుగా చెలరేగిపోతున్నారు. గత ఏడాది భూ పోరాటాలతో సెలవు తీసుకుంటే ఈ ఏడాది భీమ్‌రావ్ భాడ బాధితుల ఆక్రందనలతో ముగుస్తున్నది. సెజ్‌లు విష నాల్కలు చాస్తున్నాయి. ఇందుకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలూ, రాజకీయ సమీకరణలూ వూపందుకుంటున్నాయి. సాంస్కృతికంగానూ అమ్మాయిలపై యాసిడ్ దాడులు, నిందితులైన యువకుల బూటకపు ఎన్‌కౌంటర్లు మనం ఎంత భయానక నేపథ్యంలో జీవిస్తున్నామో చెబుతున్నాయి. రచయితలైన వారు వీటన్నిటినీ జాగ్రత్తగా అధ్యయనం చేస్తూ తమ గమనాన్ని నిర్దేశించుకోవాలి. ప్రజాస్వామిక హక్కులను ప్రజల ప్రయోజనాలను రక్షించుకోవాలి. లౌకిక తత్వాన్ని నిలబెట్టుకోవాలి.

........

ప్రగతి శీల సాహిత్య లోకంలో ప్రేరణగా నిల్చిన జ్వాలాముఖి కన్నుమూత ఒక పెద్ద లోటు. ఆయన అధ్యయనశీలత, వాస్తవికత,నమ్రత అందరూ అలవర్చుకోవలసిన విషయాలు. అలాగే కవి, కథారచయిత స్మైల్ కూడా ఇటీవల కన్నుముశారు. అంతర్జాతీయంగా హెరాల్డ్ పింటర్ ఈ నెలలోనే అస్తమించారు. ఈ యోధులకు సాహిత్య ప్రస్థానం జోహారులర్పిస్తున్నది.

........

గత 0ప్రత్యేక సంచికకు అనేక అభినందనలు అందాయి. వారందరికీ కృతజ్ఞతలు. భవిష్యత్తులోనూ ఆ ప్రత్యేకత కొనసాగించడానికి కృషి చేయగలమని తెలుపుకుంటున్నాం.

**కథల బొమ్మలు : శివాజి, వెంకటేష్**

## ఈ సంచికలో...


| | |
|---|---|
| అగ్ని తుఫాను (కథ) | 2 |
| కవిత | 6 |
| మహావక్తగా వికసించిన కవి 'జ్వాల' | 7 |
| విప్లవం పేరిట ఆత్మాశ్రయం అవాంఛనీయం - జ్వాలాముఖి | 9 |
| తమిళనాడు అభ్యుదయ రచయితల సంఘం 11వ మహాసభలు | 13 |
| నాలుగు రెక్కలతో నలుదిక్కులకూ... ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురణలు | 15 |
| కవిత | 17 |
| తులనాత్మక అధ్యయనం- ఒక ప్రస్తావన | 18 |
| వర్గస్పృహకు నిలువెత్తు సాక్ష్యం రావిశాస్త్రి సాహిత్యం | 22 |
| కొన్ని వేళలలో కొందరు గాయత్రీలు(కథ) | 24 |
| వీడ్కోలు తీసుకున్న ధిక్కారస్వరం హరోల్డ్ పింటర్ | 28 |
| కళ, సత్యం, రాజకీయాలు | 30 |
| స్నేహైక జీవనం (కథ) | 35 |
| ప్రసార మాధ్యమం ఆత్మపరిశీలన ఆవశ్యం | 41 |
| బుష్‌పై బూట్లు భేష్ భేష్ చప్పట్లు | 43 |
| సమయోచిత సమాలోచన | 45 |
| కొత్త పుస్తకాలు | 47 |


సంపాదకవర్గం

తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
ఎ.సత్యభాస్కర్
వీరప్రసాద్
ఎం.నరహరి

కె. లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
1-1-187/1/2,
వివేక్‌నగర్, చిక్కడపల్లి, హైదరాబాద్-500 020
ఫోన్లు : 27660013, 27635136,
ఇ.మెయిల్ : Prasthanam_ss@yahoo.co.in

# అగ్ని తుఫాను

కథ

**జాతశ్రీ**



లెగవేటీ... ఏటకెళ్లవేటీ...? "తాటికమ్మల పూరింటిలో పడుకొన్న భర్త – ఊరగల్లును కదుపుతూ అంది నల్లమ్మ. ఊరగల్లు కునుకేం తీయడం లేదు గాని, కళ్లు తెరవకుండా, కదిపే నల్లమ్మ చేతిని నెట్టేస్తూ, "ఎలతగానీ, కూసింత కునుకెయ్యనీయ రాదేటీ... ఒళ్ళంత సేపముల్లు దిగినట్లు ఒహటే సులుకూ, పోటూ..." అన్నాడు.

"ఉండదేటీ... సంద్రంల పడ్డ కస్టవంత సరివి సెట్లల్ల గంగానమ్మ 'గుడంబా'కి తగలేత్తే గట్నే ఉండదేటీ?" బాధగా కాదు, వ్యంగ్యం పులుముకొన్న నవ్వుతో అని, వాకిలి ఊడ్చేందుకు మూలనున్న చీపురు అందుకొంది నల్లమ్మ. ఆమె వయస్సు చిన్నదే కాని, బాధల్నే బతుకనుకునేంత 'ఓపిక' ను సొంతం చేసుకొన్న జీవితానుభవం గలది. కష్టాలను, కన్నీళ్ళను, కప్పెట్టుకోగల గుప్పిట మనిషి!

నల్లమ్మ బయటికెళ్ళడం గమనించి, దిగ్గున లేచాడు ఊరగల్లు. ఓ నిముషం– పక్కనే బొంతలో ముడుచుక పడుకొన్న కొడుకులిద్దరినీ మురిపెంగా చూసుకొన్నాడు. ఇద్దరు పిల్లలూ పక్క ఊరిలో గల ఎ.జి.యం వారి ఆశ్రమ పాఠశాలలో చదువుకొంటున్నారు. సెలవులివ్వగా మూడురోజుల క్రితమే ఇంటికొచ్చారు. వారికోసం తను చేసిందేదీ లేకున్నా, వారికి తనపై గల ప్రేమకు ప్రతిగా అవసరమైతే నిర్మోహంగా కన్నీళ్ళు కార్చగలడు. భార్యపై కూడా అతనికి అపరిమితమైన ప్రేమ! అయితే ఆ ప్రేమల్ని మింగేయగల 'బలహీనత'కు అతను బానిస!

"రే... తెల్లారిందేమిటీ?... అనుకుంటూ, బయటికొచ్చి తూరుపు దిక్కు నున్న సముద్రం కేసి తిరిగి, "తల్లా... గంగమ్మ తల్లా... నా యిద్దరు బిచ్చాల్ని సల్లంగ సూడు తల్లా..." అంటూ చేతులెత్తి నమస్కరించాడు.

భూమ్యాకాశాలపై పరుచుకొంటున్న కిరణాల తాకిడికి చీకటి చాటుమాటుల్లోకి జారుకొంటుంది. సముద్రపు అలల అనురాగానికి పులకిస్తున్న గాలి తెమ్మర – ఆహ్లాదంగా కదులుతూ, తరంగాల హోరుతో సంగమిస్తూ... అన్ని రాగాల్నీ తనలో లీనం చేసుకొన్న ఓ భీభత్స భావోద్రేక భరిత పురా జానపద వాయిద్యంలా ధ్వనిస్తూంది.

తీరాన్ని చుంబించేందుకు ఉవ్వెత్తున ఎగసి, విరిగి పడుతున్న కెరటాలు – విడిచిన నురగను ముద్దాడుతున్న యిసుక దిబ్బలు – ఆ దిబ్బలపై చిందర వందరగా పడి ఉన్న పోనండి కర్రలు – ఎంతోకాలంగా అలల తాకిడికి అలసిపోయినట్టుగా ఉన్నాయి. కొంచెం దూరంలో సరవి చెట్టకు ఈవల– గత సునామి కి సముద్రం లోంచి విసిరివేయబడి, ముక్కలు చెక్కలై పనికిరాకుండా పడి ఉన్న చిన్న ఫైబర్ బోట్లు, ఆవల–యింకా రాని గుడంబా గంగానమ్మ కోసం ఎదురుచూస్తూ గుడంబా ప్రియులు–ఐదారుగురు, వారికి దూరంగా, సముద్రపు అంచున, యిసుక దిబ్బలపై అప్పటికే జతయిన ఆటవయసుల కేరింతల కేళి !

ఎంత కేరింతలయినా ఆ లేతమొగ్గల చూపులన్నీ సముద్రం మీదే ఉంటాయి. వేటకెళ్ళిన తమ తండ్రులూ, అన్నయ్యలూ యింకా రానందుకు వారి మొహాల్లో తగు మోతాదులో నిర్వేదం కూడా తొంగి చూస్తుంది. వారికే కాదు, సముద్ర తీరంలో



Pages_Jan 2009.pmd 2 4/19/2011, 4:53 PM

నిల్చొని, ఎదురుచూస్తున్న అందరికీ అలానే ఉంటుంది. అయితే కర్రల తెప్ప తీరానికి రాగానే వారి మొహాల్లోని నిర్వేదం మటుమాయమై తీయని ఊర్పుల సందడితో ఆ వాతావరణం పులకింతలకు లోనవుతుంది.

సముద్రంలో చేపల వేట జీవితంగా, ఆ చావుబతుకుల కూటికోసం తీరాన్ని వదిలి, రెండొందల మైళ్ళ దాకా సముద్రంలోకి వెళ్లి సాగే జీవితం- కళాసీలది[1]!



ఓ నాడో, ఓ సారో కాదు. ఎప్పుడూ అంతే! వరుసగా నాలుగయిదు రోజులు నీటిమీదే జీవితం! బోటే ప్రపంచం! ఆ ప్రపంచంపై నుండి సముద్రంలోకి రకరకాల వలలు విసురుతూ, వేటాడిన చేపను మంచుముక్కల్లో కూర్చి, తీరానికి చేర్చేదాకా ఏ కళాసీ మనసునా నెమ్మది ఉండదు. మొహాన చిరునవ్వూ అంతంత మాత్రమే! ఏ క్షణాన, ఏ రీతిన, ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలీదు గనుక, అభద్రతా భావం అణువణువునా ఆక్రమించి ఉంటుంది. నిశ్చింతగల నిద్రా ఉండదు.

వారందరి జీవితాలను ప్రభావితం చేసేది, శాసించేది - సముద్రమే!

సముద్రంలో కళాసీలు ప్రాణాలను ఫణంగా పెట్టి, చావుబతుకుల మధ్య ఎంత కష్టపడినా, వారి కష్టానికి ఏ ప్రాధాన్యతా ఉండదు. వేటకు బోటుతో పాటు కావలసిన వలలు మొదలు ప్రతిదీ- కళాసీల దినవెచ్చాలతో సహా బోట్ ఓనర్ సమకూరుస్తాడు కాబట్టి, తీరానికి సరుకు[2] చేరాక, అతని మాటే చెల్లుతుంది. పైగా సరుకులో సింహభాగం అతనికే దక్కుతుంది.

వేటాడి తెచ్చిన సరుకును ఓ రాశిగా పోసి, చేప సైజును బట్టి, రకాలుగా విడగొట్టి, కంపినీ[3] వాళ్ళ సమక్షంలో బోట్ ఓనర్ వేలంపాట పెడతాడు. పాట ద్వారా సరుకును సొంతం చేసుకొన్న కంపినీ వాళ్ళు బరువులు[4] మోసే స్త్రీల ద్వారా కంపినీ కార్యాలయం దగ్గరకు చేర్పిస్తారు. పగలంతా తీరంలో పడిగాపులు పడుతూ, సరుకు రాగానే బరువుల కోసం ఆరాటపడుతూ, నోరు పారేసుకొంటూ, తగువులాడుతూ... ఇంకా అనేక రకాల అవమానుభవాల మధ్య సముద్ర తీరప్రాంత పేద స్త్రీలు- అభాగ్యతుల్లా జీవిస్తుంటారు.

అందుకే - సముద్రం బలి తీసుకొన్నవారి, తాగుబోతులైన వారి, ఏ ఆసరా లేనివారి- బంధువులో, భార్యలో తప్ప, ఇతరత్రా కాస్త ఆసరా ఉన్నవారెవరూ ఆ బరువులు మోసే కూలిపనిని ఇష్టపడరు.

నల్లమ్మ బరువులు మోయక తప్పదు. భర్త ఉన్నా, అతని 'బలహీనతను బట్టి, అతను కళాసీగా కష్టపడుతున్నా- బరువులు మోస్తే తప్ప ఆమెకు భుక్తి గడవదు. బంగారం లాటి యిద్దరు కొడుకులుండే, కష్టపడే భర్త ఉండే, తనకే నచ్చని యీ బరువుల బతుకేమిటా' ని ఆమె తనలో తనే నవ్వుకుంటూంది.

ఏడుస్తూనే నవ్వగల గుండె దిటవుగల మనిషి - నల్లమ్మ.

◆ ◆ ◆

వేటకు వేళయిందంటూ బోట్ ఓనర్- హన్మంతు తొందరపడుతూ... పెడుతున్నా, కళాసీ లెవరూ ఉలుకూ-పలుకూ లేకుండా, నాలుగయిదు రోజుల దాకా కనిపించని తమ వాళ్ళకు చేయాల్సిన పనులో, జాగ్రత్తలో చెపుతూ కొందరు, వేటకు అవసరమైన వాటిని తెప్పపై చేరుస్తూ కొందరు, సొంతానికి అవసరమైన వాటికోసం పరెగెత్తుతూ కొందరు... నిర్వేదంతో కూడిన హడావుడితో ఆ వాతావరణం గంభీరంగా ఉంది.

హన్మంతు వారి నిర్వేదాన్ని ఏ కోణంలోనూ పరిగణన లోకి తీసుకోడు. అతని మనసెప్పుడూ బెంగుళూరు, హైదరాబాద్ చేపల మార్కెట్‌లపై ఉంటుంది. కళాసీలను తొందర చేసన్తానే, అతను రెండురోజుల క్రితం బెంగుళూరు పంపిన సరుకు గురించి సెల్‌లో ఆరా తీస్తున్నాడు.

దూరాన్నుంచి ఊరగల్లు ఉరికి రావడం గమనించి, సెల్ మాటలాపి, దాపుగా వచ్చిన అతనితో, "ఏం, దొరా... తెల్లారిందేటీ?" అన్నాడు వ్యంగ్యంగా.

"ఆలిసెవయింది సేటూ..." పేద మొహంతో చూస్తూ, తల గోక్కుంటూ దీనంగా అని, మరోమాటకు అవకాశం యివ్వకుండా మంచుముక్కల్ని థర్మాకోల పెట్టెల్లో సర్దుతున్న కళాసీలతో చేరిపోయాడు ఊరగల్లు.

డీజిల్ డబ్బాను తెప్పపైకి అందుకొని, "సప్పనీళ్ళ 'క్యానేది' తేలేదేటీ? అన్నాడు సరంగు.

"తెచ్చినం గాదేటీ?..." అంటూ మంచినీళ్ళ 'క్యాన్' ని సరంగు కందించాడో కళాసి. చుక్కాని దగ్గర కూచొని, మనసులోనే గంగమ్మ తల్లిని తల్చుకొని, దండం పెడుతూ, తెప్పను సముద్రంలోకి నెట్టమని కేకేశాడు సరంగు.

"జై గంగమ్మ తల్లా... జై,జై... తల్లా..." అంటూ కళాసీలు తెప్పను ఒక్క బిగువున సముద్రంలోకి నెట్టి, ఎగిరి, దానిపై చేరారు.

సముద్రపు పోటు మరీ ఎక్కువగా ఉంది. తెప్ప పల్టీ కొడుతుందనిపించేంత ఎత్తులో కెరటాలు ఎగసి పడుతున్నాయి. కెరాటాల తాకిడికి తెప్ప ముందుకు కదిలేలా లేదు. అయినా సరంగు బెదరక, తెప్ప తన ఆధీనంలో ఉండేలా చుక్కాని ని గట్టిగా పట్టుకున్నాడు. కళాసీలకు అనుభవమే... జారి సముద్రంలో పడకుండా ఒకర్నొకరు పట్టుకొని, నిలుచున్నారు. తీరం నుంచి ఓ యాభై గజాలు సాగేదాకా అలల ఉధృతి అధికంగా ఉంటుంది. తెప్ప సాఫీగా ముందుకు సాగదు. ఆపై సముద్ర పయనమంత హాయి మరొకటుండదు. అలల ఉధృతి తగ్గాక, తెరచాప ఎత్తమని కళాసీలకు చెప్పి, తాను - దూరాన లంగరేసి ఉన్న పెద్ద బోట్ కేసి చుక్కానిని తిప్పి, బీడీ ముట్టించాడు సరంగు.

పెద్ద బోట్‌పై చేరాక, కళాసీలు రకరకాల పనులు చేపడతారు. వలలు బాగు చేస్తూ కొందరు, వంటా వార్పులు చూస్తూ కొందరు... చేప సమృద్ధిగా దొరికే ప్రాంతానికి వెళ్ళేదాకా- అనగా నూటాయాభై, రెండొందల మైళ్ళు లోనికి వెళ్లనిదే చేప దొరకదు. కొన్ని సార్లు హద్దులు తెలీక, పొరుగు దేశపు జలాల్లోకీ వెళ్లడం కూడా జరుగుతుంది.

చీకటి రోజుల్లో చేప సమృద్ధిగా దొరుకుతుంది కాబట్టి,



Pages_Jan 2009.pmd 3 4/19/2011, 4:53 PM

అమావాస్య రోజుల్లోనే కళాసీలు వేటకు ప్రాధాన్యత యిస్తారు. బోట్ ఓనర్లు కూడా తమ దగ్గర పనిజేసే కళాసీలు, ఆ రోజుల్లో వేటకు 'నాగా' పెట్టకుండా, మరో ఓనర్ దగ్గరకు పోకుండా ఉండేందుకు ముందుముందుగా పెట్టుబడి పెట్టి, దాన్ని అధిక వడ్డీతో నరుకు రూపేణా రాబట్టుకోవడం రివాజు!



ఆ విధంగా హన్మంతు దగ్గర అధికమొత్తంలో డబ్బు తీసుకున్న వాళ్ళలో ముందుగా చెప్పుకోవలసిన కళాసీ- ఊరగల్లు!

సాధారణంగా వేటకు వెళ్ళే కళాసీలు 'గుడంబా' తాగకుండా ఉండలేరు. చుట్టూ కనుచూపుమేర కనిపించే నీటికి, గుండె చెదరకుండా ఉండేందుకు ఓ మోతాదులో గుడంబా పుచ్చుకుంటారు. అది బలహీనతగా కాకుండా బలంగా భావిస్తారు. అయితే తనువునే మరిచేంత మత్తుకు లోనయ్యేలా తాగే ఊరగల్లును చూస్తూ కొందరు నవ్వుకుంటారు గాని, ఎక్కువ మంది కళాసీలకు అతనంటే జాలి!

అతని బలహీనత ఏదైనా- వాస్తవానికి ఊరగల్లుది - ఉప్పుగల్లు లాంటి మనస్తత్వం. తన 'మాదు' పగులుతున్నా బాధపడక, తియ్యని నీళ్ళిచ్చే కొబ్బరికాయలాటి గుండె గలవాడు. ఆ పూరిళ్ళగూడెంలో ఎవరికే ఆపద కలిగినా, అవసరం పడినా... ఊరగల్లు తర్వాతనే ఎవరైనా. అయితే అదంతా గత చరిత్ర! తన తండ్రి బతికున్న రోజుల్లోని తీయని జ్ఞాపకాలు!

గత సునామి కి ఓ సంవత్సరం ముందు- తన తండ్రి ఉప్పలయ్య కాలం చేసేనాటికి ఊరగల్లు 'కళాసీ' గా కాకుండా 'కులాసా' గా బతికినవాడు. వేటకు వెళ్ళిన అతని తండ్రి సముద్రంలోనే సమాధికావడం- గుండెల్ని పిండేసే సంఘటన... బోట్ మీద వంట చేస్తున్న ఉప్పలయ్య అదే బోట్ కింద సేద దీరిన 'పెద్ద- సొరచేప' ను పసిగట్టలేదు. వెలుగు కనబడితే సొరచేపలకు వెర్రి ఆవేశం వస్తుంది. స్టౌ వేడీ, వెలుగుకూ కోపంతో సొరచేప తన తోకను బలంగా ఝాడించే సరికి, అంత పెద్ద బోట్ రెండు పల్టీలు కొట్టింది. బోట్‌లో ఉన్న కళాసీలు సముద్రంలో పడి చెల్లా చెదురయ్యారు. దాపులో నున్న మరో బోట్ వాళ్ళు చాలా మందిని రక్షించగలిగారు కాని, ఉప్పలయ్యనూ, బోటు సరంగునూ సముద్రం బలి తీసుకుంది. కనీసం శవాలయినా దొరకలేదు.

ఆనాటి వరకూ జీవితాన్ని కులాసాగా భావించిన ఊరగల్లు, తండ్రి స్థానాన్ని ఆక్రమించి కుటుంబ భారాన్ని తలకెత్తుకొనేందుకు కళాసీగా రూపెత్తక తప్పలేదు. అయితే ఆ సంవత్సరమైనా గడవక ముందే- అంటే తన తండ్రి సంవత్సరీకమైనా జరపక ముందే వచ్చిన సునామీ- తన గుడిసెనే కాదు, తన తల్లినీ, చెల్లినీ, తమ్ముడ్నీ గంగమ్మ తల్లి తనలో లీనం చేసుకుంది. ఊరగల్లు అందర్నీ పోగొట్టుకున్న అనాధగా మిగిలిపోయాడు.

తీరాన్ని గాలించి, ట్రక్కుల్లో తెచ్చి వేలాది శవాల్ని ప్రొక్లెయినర్ తో తీసిన పెద్ద గోతిలో సామూహిక సమాధి చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ అతను చాలా రోజులు కుమిలిపోయాడు.

ఆ సమయంలో- ఆ భావోద్వేగాల నుండి విముక్తి పేరుతో అతని స్నేహితులు కొందరతన్ని మత్తుపానీయాలకేసి నడిపించారు. జీవితంలో అన్నీ కోల్పోయానన్న తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనైన ఊరగల్లుకు ఆ మత్తులో ఏ మజా దొరికిందో గాని, అసలు మద్యపానమంటే పరిచయంలేని అతను- తాగి, వీధుల్లో వీరాంగాలు వేసేంతగా, తనను తానే మర్చిపోయేంతగా, తాగుడుకు అలవాటుపడ్డాడు.

ఊరగల్లు పరిస్థితిని గమనించిన గ్రామపెద్దలు అతన్నీ ఓ యింటివాన్ని చేస్తే నైనా మామూలు మనిషవుతాడనే నమ్మకంతో నల్లమ్మను కట్టబెట్టడం జరిగింది.

నల్లమ్మ కూడా ఓ సునామీ బాధిత!

తన వాళ్ళందర్నీ పోగొట్టుకొని, అరబిందో సంస్థ వారు నిర్వహించిన సహాయ శిబిరంలో శరణార్థిగా ఉన్న ఆమె, తన యిష్ట పూర్తిగా ఊరగల్లును పెళ్లాడింది.

నల్లమ్మ తన మంచితనంతో, చిరునవ్వు ధోరణితో, ఊరగల్లును పూర్తిగా లోబరుచుకోగలిగింది. తనూ, తన కుటుంబం తప్ప, తాగుడుతో సహా యితర వ్యాపకాలన్నీ వదిలేసేలా అతనిలో ఎవరూ ఊహించని మార్పు తేగలిగింది.

కొన్ని సంవత్సరాలు గడిచాయి.

ఊరగల్లు - ఇద్దరు బిడ్డల తండ్రిగా నిలబడ్డాడు.

నల్లమ్మ- పూరిళ్ళగూడెపు ఆడబడుచుగా అందరి అభిమానాల్ని పొందగలిగింది. రోజులు ఆనందంగా గడుస్తున్నాయి!

అదే సమయంలో - పిల్లలిద్దరూ వాంతులు, విరేచనాల బారిన పడడంతో, గంగమ్మ తల్లి ఆగ్రహించిందని, శాంతి చేస్తే కీడు తొలగుతుందని ఒహరిద్దరు అనడంతో, ఊరి పూజారి సలహా సంప్రదింపులతో, మూడు దినాలు వరుసగా- మూడు పూటలా- పదిన్నొక్క కొబ్బరికాయల చొప్పున ఆ తల్లికి కొట్టి, ఆ కొబ్బరి నీళ్ళు మంత్రించి తాపించడం, చివరి దినాన తల్లికి పూజచేసి, పూజారితో సహా మరో ముగ్గురికి తాపించి, తినిపించడం... వారితో పాటు తనూ తాగి, తిని, ఊగాడు.

పిల్లలయితే బాగయ్యారు కాని, ఆ రోజు నుంచి ఊరగల్లు- మళ్లీ తాగడం మొదలెసి, తన మీద తనకు అదుపు లేదని రుజువు చేసుకొన్నాడు.

ఊరగల్లు- తన బలహీనత గుర్తించినా, దానిని జయించలేని బలహీనుడని నల్లమ్మకు తెలుసు. తాగొద్దని తనో మాట చెపితే తాగడనీ తెలుసు! అయినా నల్లమ్మ నోరు విప్పదు. ఆ మాట చెప్పదు. తన మాటకూ- అతని బలహీనతకూ మధ్యన నలిగి ఏ అఘాయిత్యానికి పాల్పడతాడోనని ఆమె భయం! అందర్నీ పోగొట్టుకొని బతికే తను- భర్తను కూడా పోగొట్టుకుంటాననే భావనతో- భర్త నేమీ అనలేక, లోలోన కుమిలిపోతూ... ఎదురౌతున్న చీకటినీ, చికాకుల్నీ, బతుకనుకుంటూ... రాజీపడి బతుకుతుందామె!

◆ ◆ ◆

నాలుగు రోజులు 'ఆకులేని అడవి' లాటి సముద్రంలో వేటాడి, పెద్ద బోట్ నుంచి, కర్ర తెప్పలపై తీరాన్ని చేరే సరికి బోట్ ఓనర్ - హన్మంతుతో పాటు బరువులు మోసే స్త్రీలూ, కళాసీల పిల్లలూ, తల్లులూ- తీరాన నిలబడి తృప్తిగా చూస్తుండి



Pages_Jan 2009.pmd 4 4/19/2011, 4:53 PM

పోయారు. వారితోపాటు చంకలో బేసిన్ ఉంచుకొని, నల్లమ్మ, ఆమె కొంగు పట్టుకుని పిల్లలిద్దరూ నిలుచున్నారు.

"ముందగాల, సరుకు, సరుకు..." తెప్పపై నుండి ఒడ్డుకు దూకే కళాసీలను చూస్తూ అన్నాడు హన్మంతు. అతని చూపు కళాసీల మీద ఉండదు. వారి యోగక్షేమాల మీదా ఉండదు. పెట్టెల్లో మంచు ముక్కల్లో కూర్చిన చేపల మీద ఉంటుంది. వలల్లో మూటగట్టిన పెద్ద పెద్ద చేపలపై ఉంటుంది.



"సరుకు దించరేటి?" అరిచినట్టుగా అన్నాడు హన్మంతు

నడుముల దగ్గర వొూచేతుల బిగువుతో బేసిన్లు ఉంచుకొని, ఒక్క బరువైనా దొరకాలని నిలుచున్న స్త్రీలతో పాటు కంపినీల వాళ్ళు– కళాసీలు రాశి పోసిన చేపల చుట్టూ చేరారు.

చుట్టూ ఎందరున్నా బోట్ ఓనర్ చెప్పిన వాళ్ళే సరుకు మీద చేయి వేయాలి. రాశి నుంచి ఒక్కో రకాన్ని విడగొట్టాక, వేలంపాట నిర్వహిస్తారు. ఆ విడగొట్టే పని నల్లమ్మతో సహా మరో నలుగురిని అప్పజెప్పాడు హన్మంతు.

ముందుగా– తెట్టు, కాకరగ, పొరవ, కిలుం, కణకర్త మొదలగు చిన్న చేపల రాసుల పాట నిర్వహించాక, వాటిని బేసిన్ల కెత్తించి, పెద్ద చేపల కేసి నడిచాడు హన్మంతు.

నాలుగయిదడుగుల పొడవుతో పాతిక కిలోల బరువు మొదలు రెండు మూడు కిలోల బరువున్న – వంజరం, సందువ, కూనం, తెలిబార, టేకి వగైరా రకరకాల చేపలు!

ఒక్కో చేపను విడివిడిగా, దూరదూరంగా ఉంచి, పాటందుకున్నాడు హన్మంతు. వేలల్లోకి దూకింది పాట!

ఒక్కో కళాసీకి, సరంగుతో సహా, నాలుగు రోజుల ఖర్చులు పోను, ఆరొందల చిల్లర రాబడి వచ్చినట్లు హన్మంతు లెక్కేసి చెప్పాడు.

కళాసీల మొహాలు వికసించాయి.

ఒక్క ఊరగల్లు మొహంలోనే ఏ విధమైన కళ లేదు. సంతోషానికీ, బాధకూ అతీతంగా అటు హన్మంతునూ, ఇటు తన యిద్దరు పిల్లల్నీ మార్చి మార్చి చూస్తున్నాడు. నల్లమ్మ కేసీ చూస్తున్నాడు గాని, ఆమె తన పనిలో తానుండిపోయింది. అతని కళ్ళలో చిన్న సముద్రాలు కదులుతున్నాయి.

బరువులు మోసే స్త్రీలను గమనిస్తూ పక్కనున్న కంపినీ వారితో గతరాత్రి నుంచి జరుగుతున్న లారీల సమ్మె వివరాలను విచారిస్తున్నాడు హన్మంతు.

దాపునున్న యిద్దరు పిల్లలు తనకేసి చూసే బేల చూపులకు ఊరగల్లు విలవిల లాడేడు. రేపోమాపో బడికెళ్ళే ఆ బిడ్డలిద్దరికీ ఏమీ యివ్వలేకపోతున్న తన అసమర్థతకు ఆ తండ్రి కడుపులో తెమిలినట్లయింది.

"న్నీ... యవ్వ, సావు బతుకుల మజ్జిన నాల్దినాలు ఏటాడి వస్తి. నా పిలగాల్లకి 'సందువ' నన్న కాల్సి పెడత. "అంటూ వంగి, ఓ రెండు కిలోల చేపను అందుకున్నాడు ఊరగల్లు!

అంతే!

ఊరగల్లు చెంప 'చెళ్' మంది.

దిమ్మ దిరిగి పోయేంత దెబ్బ!

"నీ యిస్టమేనేటి... సరుకెవురి దేటీ... నన్నడగొద్దేటీ?" అంటూ హన్మంతు – ఊరగల్లును కాల్చేసేలా చూస్తూ అన్నాడు.

ఊరగల్లు నోట మాట రావడం లేదు. తెల్లబోయి, దేబిరి మొహంతో చూస్తుండిపోయాడు.

చుట్టూ ఉన్న జనం దిగ్భ్రమకు లోనయ్యారు. హన్మంతలా చేయడం నచ్చని కొందరు లోలోనే గొణుక్కోసాగారు.

ఊరగల్లు జనం కేసి కన్నెత్తలేకపోయాడు. చేతిలోని 'సందువ' ను కిందపడేసి, మండుతున్న చెంపను రుద్దుకుంటూ కూలబడిపోయాడు. ప్లిలలిద్దరూ ఏడుపు మొహంతో తండ్రిని చూస్తూ తల్లి దగ్గరగా చేరారు.

జరిగిన సంఘటనకు నల్లమ్మ మ్రాన్పడిపోయింది. తేరుకోలేక పోతుంది. పిల్లలిద్దరూ దాపుకొచ్చి ఏడ్పందుకునే సరికి ఆమె ఉలిక్కిపడింది. తన గుండెలమీద 'చెళ్' మన్నట్టుగా ఉందామె పరిస్థితి. హన్మంతు కేసి కోపంగా కాదు, కాదు... అసహ్యంగా చూసీ, గుండెల్లో పొంగుకొస్తున్న ఆవేశంతో తలొంచుక, ముంగాళ్ళపై కూచున్న ఊరగల్లు జుట్టు పిలికిడ బట్టి, "సూద్రాదేటీ... బిక్క మొహాలతో ఏడుత్తున్న బిడ్డల్ని సూసి, ఏం సెపుతవో సెప్పు...." అంటూ ఊపేసింది.

అయినా ఊరగల్లు తలెత్తలేదు. తలలేనోడిలా తలొంచుక కూచున్నాడు.

ఊరగల్లు ఎన్ని రీతుల కుటుంబాన్నీ, తననూ చిరాకు పర్చినా, నల్లమ్మ ఏనాడూ అతన్నో మాటయినా అన్నది కాదు. ప్రేమాభిమానాలతో అతన్ని ఓ మంచి తండ్రిగా, భర్తగా నిలపాలనుకుంది. తన ఆశలు తలక్రిందులై, పట్టుదల పరిహాసాల పాలైపోగా తట్టుకోలేకపోతూ... ప్రేమాభిమానాలకూ ఆవేశమొస్తుందని అనుభవాలకూ ఆగ్రహమొస్తుందని– ఊరగల్లుకు తొలిసారిగా తెలిసేలా... అతని గుండెల్ని కుదిపే స్వరంతో, "నీకేగాని సీవూఁ నెత్తురంటే... ఉందనుకుంటే... ఆ గంగమ్మ తల్లికీ, ఈ సుట్టున్న జనాలకీ దండంపెట్టి సత్తె పెమానంగా యిగ గుడంబా జోలికెల్లనని నీ బిడ్డల మీద ఒట్టేసి సెప్పరాదేటీ? నీ కష్టాన్ని నీగ్గాకుండా, మనందరి బతుకుల్ని బుగ్గిపాలు జేసేది ఆ 'గుడంబా' కాదేటీ? నీకేగాని, సిగ్గూ, సెరవూఁ ఉంటే ఆ వంకల్లకి ఎలబాక... ఎల్తివా... నేనూ మయ్య, మమ్మ, కల్సినట్టు ఆ గంగల కలుత్త. నా బిడ్డల్నీ కలిపేత్త. జెనం మీద ఒట్టేసి సెపుతున్న" అంటూ అపరిమిత ఆవేశంలో అంది నల్లమ్మ.

ఆ చివరి మాటలకు ఊరగల్లు ఉలిక్కి పడ్డాడు. ఆమె కళ్ళలో కళ్ళు పెట్టి ఏదో చెప్పాలనుకొని, ఆ కళ్ళకేసీ చూస్తూ భయంతో వణికిపోయాడు.

ఆమె కళ్ళు– కళ్ళలా లేవు– నిప్పు కణికల్లా ఉన్నాయి. ఆ కన్నుల్లో రక్త సముద్రాలు పొటెత్తుతున్నట్టుగా ఉన్నాయి. తన బలహీనతను కాల్చేస్తున్నట్టుగా ఉన్నాయి ◆

**(ఈ ఇతివృత్తాన్ని – నాదిగా చేసుకున్న పరిణామక్రమంలో... నాతోపాటు– 'ఓడరేవు' ఇసుక తిన్నెలపై నడిచి, సహకరించిన మిత్రులు, కవి – శ్రీ పి. శ్రీనివాస్ గౌడ్, చీరాల గారికి కృతజ్ఞతలు)**



Pages_Jan 2009.pmd 5 4/19/2011, 4:53 PM

# మారని దృశ్యం




వి. ఆర్. తూములూరి

బండెడు పుస్తకాల బరువుతో దిక్కులు చూస్తూ నడుస్తున్నపుడు
గోడమీది సెక్స్ సినిమా పోస్టరు అమితంగా ఆకర్షిస్తుంది
అమ్మ చదివే సకుటంబ వారపత్రికలోని అర్థ నగ్నసుందరి
కవ్వింతల ఊహా జగత్తుకి లాక్కెళ్తుంది
చూసిన సినిమాలోని పడుచు జంట సరాగాలు
మస్తిష్కంలో చేరి రొదపెడతుంటాయి
విదేశీ ఛానల్స్ అందించే చీకటి దృశ్యాలు
నరాల రవాల్ని శ్రుతి చేస్తుంటాయి
ఇంటర్నెట్‌లోని వెబ్‌సైట్ పురుగు
ప్రకృతి సహజాతాల్ని కదిలే బొమ్మలుగా ముందు నిలబెడుతుంది
ఆడదంటే అనుభవించే బొమ్మేనని
కంటికి కన్పించే ప్రతి దృశ్యమూ చాటినప్పుడు
అమ్మయినా, గోడమీది బొమ్మయినా ఒక్కలాగే కన్పిస్తుంది
తరగతి గదిలోని సహ విద్యార్థిని ఆట వస్తువవుతుంది
సినిమాల్లో అందంగా కన్పించే రేప్ దృశ్యం ఇచ్చిన ప్రేరణ
బ్రతుకు వాకిట విరియని సుమాన్ని నేలరాలుస్తుంది
ప్రపంచీకరణ పేరిట విశృంఖలతకు ద్వారాలు తెరిచిన వాళ్ళు
దిగ్భ్రాంతి ప్రకటనలిచ్చి కాసిని కన్నీళ్ళు రాలుస్తారు
ఘోరం జరిగిందంటూ గగ్గోలెత్తే మీడియా
మరింత నగ్నతను చూపేందుకు పోటీ పడుతుంది
దృశ్యం మళ్ళీ పునరావృతమవుతుంది
గగ్గోలు, ప్రకటనలు, కన్నీళ్ళు అన్నీ షరా మామూలవుతాయి

# మౌనమూమాట్లాడుతుంది

మంత్రి కృష్ణమోహన్

తగిన రూపం దొరికితే
మౌనమూ
మాట్లాడుతుంది



దగా పడ్డవాడూ
బుద్ధిజీవుడే!
ఏ బంధపు తెరనో
కప్పుకొన్నవాడు
అక్కృత్యాన్ని సవాలు చేయలేనివాడు
శక్తిహీనుడా!
ఏదో పాశాల పాదాలకింద
నలుగుతున్న భీష్ముడు

అన్యాయాన్ని ఎదిరించినవాడు
అశక్తుడా!
'కాల' కూటాన్ని
గళాన బంధించినవాడు
మదబలాన్ని అడ్డగించలేనివాడు-
బలహీనుడా!
బలగాన్ని సమీకరిస్తున్న
భవిష్యత్ విధాత కావచ్చు...

తగిన కాలం వస్తే
తగిన రూపం దొరికితే
ప్రళయపు స్వరంతో
మౌనమూ మాట్లాడుతుంది

# చీకటి కిరణం

పురిమళ్ళ సునంద



చీకటి నన్నెందుకిలా వెంటాడుతుంది
చిరుదీపమై వెలగాలని
గర్భకుహరంలో నా ఉనికిని చాటుకున్న మరుక్షణం
లింగ నిర్ధారణలో
నా శ్వాసకు సంకెళ్ళు వేయాలని చూసిందీ చీకటి
పాలనవ్వుల ప్రాయంలో పాపవు నీవంటూ
ముద్దు మురిపాల చుట్టూ అలముకుందీ చీకటి
పువ్వుగ వికసించేవేళ
అణువణువు ఆకలిచూపులతో
ఆబగా తడిమిందీ చీకటి
విపణి వీధిలో వేలం వేసి కొన్న పసుపుతాడు
సహచరినని చూడక ఉరితాడుగా మారిన చీకటి
కటిక చీకటై ఏళ్ళకేళ్ళుగా నన్ను భయపెడుతోంది
ఈ నిశీధి కరాళ పద ఘట్టనలో
మృత్యుహేలయై కవలరపెడుతోంది
ఓర్పు మిణుగురులను విదిలించాను
సహనం తారకలను వెదజల్లాను
అయినా చీకటి విడివడదే
ఆశా చంద్రున్ని నిలిపాను
దిక్కుల చివర్ల నుండి నక్కి నక్కి చూస్తూనే ఉంది చీకటి
రగులుతున్న హృదయ గోళాన్నుండి
ఆత్మగౌరవపు వెలుగు కిరణాన్ని ఎక్కుపెట్టానిక
అది శత సహస్రమై ప్రసరించింది
తిమిరం తునాతునకలైంది
వేకువ కిరణపు వేడిసోకి భళ్ళున పగిలి ముక్కలైన చీకటి
ఇక చీకటిని దరి చేరనివ్వను
ఈ వెలుగునిక అస్తమించనివ్వను
నా మదికి నిశీధిని తాకనివ్వను
ప్రకృతిలో నేను సైతం పల్లవిస్తాను
ఆహ్లాద ఉషస్సులింక అనుభవిస్తాను
నా జీవన గమనం కాదిక శూన్యం
ఎప్పటికీ వెలుగుతున్న అఖండ సూర్యకిరణం



Pages_Jan 2009.pmd 6 4/19/2011, 4:53 PM

నివాళి

# మహోవక్తగా వికసించిన కవి‘జ్వాల’



**మా**టల్ని నిప్పుల మూటలుగా చేసి ప్రసంగించడం ఎవరికి సాధ్యం? నేలను తన్నిపెట్టి ఆవేశపు గొంతుతో దుష్టసమాజాన్ని నిలదీయడం ఎందరికి సాధ్యం? వేలాదిమంది బుద్ధిజీవులను కట్టిపడేసేలా ఉపన్యసించడం ఎంతమంది చేయగలరు? అవును! అతను చేయగలిగాడు. సమాజాన్ని ప్రశ్నించిన అక్షర సాగరమయ్యాడు. సంకుచిత పరిధుల్ని చేధించుకుని మాటల గలగలల్ని ప్రజలకు పంచిన ప్రవక్త అతడు. నిప్పులాంటి జీవితాన్ని నిలువునా కప్పుకుని బతికినవాడు. తలచినదాని కోసం ముళ్ళదారిలో కడకంటా కొనసాగినవాడు. జైలు జీవితం దాటి వచ్చినా, సరైన మార్గమని చెప్పడానికి అదే గీటురాయి కాదన్న సత్యదర్శి. అక్షరాల నక్షత్రాలను వెదజల్లి ప్రజాఉద్యమాల వారసత్వ భరోసాతో అనంతవాయువుల్లో లీనమైన ఒక సంపూర్ణమానవుడు జ్వాలాముఖి.

జ్వాలాముఖి హైదరాబాద్‌లోని సీతారంబాగ్‌లో ఏప్రిల్ 12, 1938లో జన్మించారు. జ్వాలాముఖి అసలు పేరు ఆకారం వీరవెల్లి రాఘువాచార్య. ఆయున తల్లిదండ్రులు వెంకట లక్ష్మినర్సమ్మ, నరసింహాచార్యలు. ఒక తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. ఆయన భార్య సీతాదేవి. ఆయనకు సంపత్‌కుమార్, శ్రీధర్, వాసు కుమారులు. జ్వాలాముఖి పుట్టింది హైదరాబాద్‌లో అయినా వారి నాన్నది మెదక్ జిల్లా సిద్దిపేటకు సమీపంగా ఉన్న ఆకారం గ్రామం. మల్లేపల్లి గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్, నాంపల్లి మల్టీపర్పస్ హైస్కూల్లో పదో తరగతిదాకా చదువుకున్నారు. నిజాం కాలేజీలో పియూసి, బిఎ చేసి ఆ సమయంలో అలియా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఉపాధ్యాయ సంఘంలో చురుకైన పాత్ర పోషించారు. ఎంఎ ప్రైవేట్‌గా చదువుకోగలిగారు. అదే సమయంలో సాయం కళాశాలలో ఎల్ఎల్‌బి చేసి ఎల్ఎల్ఎం చదువు కొనసాగించారు. పన్నెండేళ్ళు ఉపాధ్యాయునిగా, 24 ఏళ్ళు ఎల్ఎన్ గుప్తా ఈవినింగ్ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ కామర్స్, హైదరాబాద్‌లో లెక్చరర్‌గా పనిచేసి 1996లో రిటైర్డ్ అయ్యారు.

సంప్రదాయ వ్యతిరేక ‘మానవతా ఆరాధన’ తర్వాత నాస్తికవాదం, పిదప మానవతావాదం ఆ తర్వాత సర్వరోగనివారిణిగా మార్క్సిస్టు ఆలోచనా విధానం తన సైద్ధాంతిక భూమికగా జ్వాలాముఖి రాసుకున్నారు. 1958లో రాసిన ‘మనిషి’ అనే కవితకు గుంటూరు జిల్లా రచయితల సంఘం ఉత్తమ కవిత బహుమతిని అందజేసింది. ఈ బహుమతిని కరుణశ్రీ చేతుల మీదుగా జ్వాలాముఖి అందుకున్నారు. 1965-70 మధ్యకాలంలో ముందుకు సాగిన ‘దిగంబర ఉద్యమం’లోని ఆరుగురు కవుల్లో ఆయన ఒకరు. ఆ కవులు ప్రచురించిన మూడు సంపుటాల్లో వీరి కవితలున్నాయి. అయితే అశ్లీలత అనుసరణీయం కాదని అనుభవం నిర్ధారించిందన్నారు. ఆ తర్వాత 1970లో విప్లవ రచయితల సంఘం ఏర్పాటులో జ్వాలాముఖి ప్రధానపాత్ర వహించారు. పరిష్కారం కాదని గ్రహించి 1975లో విరసానికి రాజీనామా చేశారు. కొంతకాలం జనసాహితిలో వున్నారు. సమాజం మౌలికంగా మారాలని, భూస్వామ్య, సామ్రాజ్యవాద ధోరణులకు వ్యతిరేకంగా సమైక్యపోరాటం, ప్రజాస్వామ్య చింతనలు బలపడేవిధంగా ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తూ వచ్చారు. దేవులపల్లి, నాగిరెడ్డి భావాలను అనసరించారు. అన్ని వామపక్షాలతో సన్నిహితంగా మెలిగారు.

జ్వాలాముఖి 70వ దశకం నుండి ప్రజాస్వామిక ఉద్యమాల్లో చురుకైన పాత్ర నిర్వహిస్తూ వచ్చారు. భూస్వామ్య దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలకు బాసటగా నిలిచారు. జ్వాలాముఖి ప్రముఖ పాత్ర వహించిన ఉద్యమం భారత్-చైనా మైత్రి ఉద్యమం. ‘భారత్-చైనా మిత్రమండలి’లో కొనసాగుతూ నేడు ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగానూ, జాతీయ ఉపాధ్యక్షులుగానూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆ సంస్థ తరపున రెండు పర్యాయాలు చైనా పర్యటించి వచ్చారు. 1971లో ఆయన ఉపన్యాసాలు, రచనలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నాయని జైల్లో పెట్టారు. 50 రోజులు జైలు జీవితం అనుభవించారు. 1975లో ఎమర్జెన్సీ కాలంలో మరోసారి 15రోజులు జైలులో ఉంచారు. ఆయనకు 1991లో గుండె ఆపరేషన్ జరిగింది. చాలాకాలంగా ఆయన డయాబెటిస్ వ్యాధి ఉంది. సంవత్సరం నుంచి క్రిప్టోజినక్ లివర్ సిరోసిస్ వ్యాధితో బాధపడుతున్నారు. చివరకు ఈ డిసెంబర్ 14 తుదిశ్వాస విడిచారు.

తాను నడిచివచ్చిన దారిని ఎప్పటికప్పుడు సమీక్షించుకున్నవాడు జ్వాలాముఖి. ఆవేశమే విప్లవం అన్న నిర్వచనాన్ని పక్కకు నెట్టివేసి సంయమనానికి ప్రతిరూపమైనవాడు. మహోద్వేగంతో ఉపన్యసించినా పసిబాలుడిలా ప్రజలమధ్య పరవశించినవాడు. అస్తిత్వవాద ఉద్యమాలు తెలుగునేలను బీటలుపారిస్తున్నప్పుడు ఎదురొడ్డి నిలిచిన వాడు జ్వాలాముఖి. ప్రాంతీయవాదాన్ని తలకెక్కించుకున్న అసంఖ్యాక బుద్ధిజీవుల మధ్య నిబ్బరంగా నిలబడిన సమైక్యవాది, నూరణాల తెలంగాణ బిడ్డ జ్వాలాముఖి. సత్యం కోసం నిత్యం అధ్యయనంలో మునిగినవాడు. దిగంబర కవితోద్యమ నేపథ్యం నుండి ఆవేశపు విరసం దాటివచ్చి విశాలత్వం కోసం పరితపించినవాడు. ప్రజాశక్తి, విశాలాంధ్ర పుస్తకాలయాలతో పెనవేసుకుపోయారు. భేషజం లేకుండా నిజం వైపు నిలబడడానికి వెనకాడని వ్యక్తి. నిర్ధారణల కోసం ఎడతెగని సంయమనాన్ని పాటించిన వ్యక్తి. నందిగ్రామ్ సంఘటనలను అవకాశంగా చేపట్టి కాకులుగా మారిన బూర్జువా మీడియా ఒకవైపు, వాస్తవికత పట్టకుండా వివిధ రకాల విచ్ఛిన్నకులు మరోవైపు చేస్తున్న దాడిపట్ల ధర్మాగ్రహాన్ని ప్రకటించినవాడు.ఆ సంఘటనలను విమర్శించే సభల ఆహ్వానాలను తిరస్కరించినవాడు. సాహితీ స్రవంతి విశాల అవగాహనను



Pages_Jan 2009.pmd 7 4/19/2011, 4:53 PM

# అతనొక్కడే!

అతడొక వెలుగు అక్షరం
అతడొక చైతన్య శరం
అతడొక ఉద్వేగ రూపం
అతడొక విప్లవ రసాయనం

అతని మహోపన్యాస ఉద్వేగం
నక్షత్రాలకు పరవశం కల్గిస్తుంది
అతని విప్లవ ఉద్రేకం
అక్షర సూరీళ్ళకు
ఉత్తేజం కలిగిస్తుంది

ఆవేశమే కాదు
సంయమనమూ
విప్లవమే అని చాటిన
మహోవక్త అతడు

అతను పలికన పదం
అతను లిఖించిన అక్షరం
చైతన్యపు విత్తనాలయ్యాయి
అతడొక నదీ ప్రవాహం
అతడొక సముద్రం
అతడొక సత్యజ్వాల

కవి మాత్రమే కాదు
చైతన్యాన్ని రాజేసిన కంఠధార అతడు
మహోపాధ్యాయుడై తెలుగు నేలంతా
కలదిరిగిన జ్ఞాన పరిమళం అతడు

బడుగువాని బతుకు
పండించడానికి
జీవితకాలం
కలం పట్టిన
అసామాన్యుడతడు
బక్కటెముకల్లో
సత్తువ నింపే
మాటల ప్రవక్త అతడు

అతని మాట విప్లవ మంత్రం
అతని బాట సమర శీలం
అరణ్యపు హోరుకు
అదను కాదన్నవాడు
తూటాలనవతల పెట్టి
మాటల అవకాశాన్ని గుర్తించిన వాడతడు

వొ

అందరిలో అతడై
వేరుగాదన్న వీరుడతడు
విచ్ఛిన్నపు ఉచ్చును తెంచుకున్న ద్రష్ట
అతడు

మతోన్మాదులపై
సామ్రాజ్యవాదులపై
నిప్పుల అక్షరాలను వెదజల్లిన
నిలువెత్తు
రుధిర జ్వాల అతడు

తన కలలను ఎందరిచేతనో
కంఠస్థం పట్టించిన
నిరంతర బోధకుడు అతడు

నిప్పుల మార్గాన్ని గుప్పిట పట్టిన
గుండె సడలని నిండు మార్క్సిస్టు అతడు

---

ఆహ్వానించి అనుక్షణం అంటిపెట్టుకున్నవాడు. సాహితీ స్రవంతి చేపట్టిన సాహిత్య ఉద్యమాన్ని వందశాతం ప్రోత్సహించి వెన్నుతట్టినవాడు. రాష్ట్రవ్యాప్తంగా జనకవనాలు, సాహిత్యశాలలను ఎక్కువ భాగం జ్వాలాముఖి ప్రారంభించినవే. ప్రతీ సంవత్సరం సాహితీ స్రవంతి నిర్వహించే శ్రీశ్రీ, జాషువా వర్ధంతి కార్యక్రమాలకు ముందుగానే ట్యాంక్‌బండ్‌కు చేరుకుని ఔత్సాహిక రచయితలకు స్ఫూర్తినింపినవాడు. జార్జిబుష్ రాకకు వ్యతిరేకంగా సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగిన కవిసమ్మేళనంలో నిప్పులు చెరిగినవాడు. అక్షరాలను అచ్చేసుకున్న ఔత్సాహిక ప్రగతిశీల కవులకు ఎందరికో ముందుమాటతో ముద్ర వేసినవాడు. 'నగరంలో నేడు' లో జ్వాలాముఖి పేరును చూసి నగర శివార్ల నుండి కూడా వచ్చి ఆయన ఉద్వేగ ప్రసంగాన్ని విని నాలాగ పరవశించిన వారెందరో! ఒక్కసారి జ్వాలాముఖి ఉపన్యాసం విన్నవారెవరూ అతన్ని మరిచిపోరు. అంతకన్నా అతని సందేశాన్ని అసలే మరిచిపోరు. అంతగా ప్రభావితం చేసే ప్రసంగం జ్వాలాముఖి సొంతం. అతని ప్రసంగానికి ప్రగతిశీల భావాలు పరిమళాన్ని అద్దేవి. సభికుల్ని మంత్రముగ్ధుల్ని చేసేవి. సామ్రాజ్యవాదంపై అతని ఆవేశం సభికుల్ని పిడికిళ్ళు బిగించేలా చేసేది. మతోన్మాదంపై అతని ఉగ్రరూపం వింటున్నవారి కళ్ళను ఎరుపుగా మార్చేది. పెట్టుబడిదారీ సమాజపు క్రూరత్వాన్ని చాటుతున్న అతని ఆవేశం ఎదుటివాళ్ళల్లోకి ప్రవహించేది. సమాజాన్ని మార్చేపనిని మనమే చేపట్టాలన్న అతని ఆకాంక్షలను విన్నవారికి అతనితో భుజం కలపాలనిపించేది. కల్మషం అంటని ప్రగతిశీల హృదయం అతనిది. నిత్యం సమాజాన్ని సూక్ష్మపరిశీలన చేసే చూపు అతనిది. నిప్పుకణికగా మారి కుటుంబంలో నుంచి నగరంలోకి దూకేవాడు. నగరంలో నాలుగుదిక్కులుగా మారి నలుగురికీ గొంతు అయ్యేవాడు. నాలుగుచోట్ల అక్షరమయ్యేవాడు. తన తాహతుకి మించి సమాజహితం అయ్యాడు. నిజాయితీకి, నిబద్ధతకీ నిలువెత్తు ప్రతిరూపమయ్యాడు. ఉద్యమ వేదికలెన్నిటికో అప్యాయ అతిథయ్యాడు. ప్రగతిశీల విశాలత్వంకై నిలువునా పరితపించాడు. విడి ఆకాశాలను భ్రమలన్నాడు. తన అనుభవాల్ని గీటురాయిగా చేసుకుని గొంతు విప్పాడు. బక్కటెముకల్లో సత్తువ నింపడానికి జీవితకాలం అక్షరమయ్యాడు. తెలుగు నేలంతా జ్వాలాక్షరాలు నాటాలని పరితపించాడు. ఉద్యమపంటల కోసం బతుకంతా పరిశ్రమించాడు. నిరాశవైపు క్షణం కూడా చూడని ఉద్యమ కవి అతను. భరోసాగా భువిని విడిచిన ఉద్యమ ఆశాజీవి జ్వాలాముఖి. వాస్తవికతా ఆలోచనలకు నిలువెత్తు సాక్షి అతను. అసందర్భమైన ఆవేశాన్ని వీడి, ఆశావహమైన సంయమనాన్ని చేపట్టి మార్గాన్ని చాటిన నిజమైన మార్క్సిస్టు జ్వాలాముఖి. అతను మాట్లాడితే నేపథ్య సంగీతాన్ని వెక్కిరించే పాటవుతాడు. అతను రాస్తే అక్షరం శ్రమజీవుల చమటను చాటుతుంది. అతని ఉనికి సామాజిక నిబద్ధతను వ్యాప్తిచేస్తుంది. అతని స్ఫూర్తి సామాజిక ఉద్యమంలో ఉన్నవారి భుజం తడుతుంది. ఆ కవి మూర్తికి సాహితీస్రవంతి నివాళి అర్పిస్తోంది. జోహార్ కవీ! జ్వాలాముఖీ!! ◆

**వొరప్రసాద్**



Pages_Jan 2009.pmd 8 4/19/2011, 4:53 PM

ఇంటర్వ్యూ

# విప్లవం పేరిట ఆత్మాశ్రయత్వం అవాంఛనీయం



**జ్వాలాముఖి**

**మీరు రచయితగా మారిన నేపథ్యం చెబుతారా?**

నేను పెరిగిన ప్రదేశం హైదరాబాదులో సీతారాంబాగ్. అక్కడ దేవాలయం. సీతారాంబాగ్ అంటే హైదరాబాదు నగరంలో మహా పల్లెటూరి లాంటి స్థలమన్నమాట. అక్కడ రాముల వారి ఆలయం వుంటుంది. దాని పూజా పురస్కారాలు చూసేది బ్రాహ్మలైనా, వారి చేతుల్లో ఏ అధికారమూ లేదు. అంతా ధర్మకర్తదే పెత్తనం. ఆ ధర్మకర్త స్థానాన్ని అడ్డం పెట్టుకుని అతను చుట్టుపక్కల వారిపై ఎక్కడ లేని హాజం సాగించేవాడు. అక్కడందరూ శ్రీవైష్ణవులే. అయినా నానా బూతులు తిట్టేవాడు. హరామ్‌జాదే అనడం నేను విన్నాను. ఇక ఆలయంలో అన్నీ చూసేది తమిళనాడుకు చెందిన బ్రాహ్మలు. వారి మధ్య స్థానికుల స్థితి దారుణంగా వుండేది. అంతకంటే ఘోరమైన విషయం ఆ గుడి దగ్గర ఒక దిగుడు బావి వుండేది. చాలా పాత కాలానికి చెందింది. ఆ బావిలో రోజూ ఒక శవమైనా తేలేది. నిస్సహాయ మహిళలు ఆ విధంగా ఆత్మహత్యలు చేసుకునేవారు. వాళ్ల శవాలను వెలికి తీయడం, అంత్యక్రియలు అన్నీ సమస్యలే. వాటి బాధ్యత తీసుకోవడానికి ఎవరూ ముందుకువచ్చేవారు కాదు. గుడిముందు శవాన్ని అలా వుంచి కాపలా కాసే వాళ్ళం. చివరకు మా కుటుంబమే ఏదో విధంగా వాటిని వదిలించేది.

మా నాన్న కొంచెం ధైర్యం గలవ్యక్తి. వితంతు వివాహం చేసుకున్న వారికి భోజనం పెట్టాడనే కోపంతో ఆయనను చుట్టుపక్కల వారు ఆదరించేవారు కాదు. కుటుంబం చాలా పెద్దది. నడవడమే కష్టంగా వుండేది. ఒక్కో రోజు మిట్టమధ్యాహ్నం అయినా గాని వంట చేసుకోగలిగే వాళ్లం కాదు. ఈ వాతావరణంలో నా చదువూ సాగేది కాదు. హెచ్ఎస్‌సి ఆరుసార్లు చదివాను. లెక్కలు అసలు వచ్చేవి కావు. చివరకు 1958లో పాసయ్యాను. అప్పటికి నాకు ఇరవయ్యేళ్లు. బుద్ధుడు అంటే బాగా గురి వుండేది. ఈ విగ్రహారాధనం అర్థంలేని ఆచారాలు నచ్చేవి కావు. పక్కనే ముస్లింల కాంపౌండ్ పెద్దది వుండేది. స్వాతంత్ర్యం వచ్చాక అక్కడ ముస్లిములపై దాడులు జరిగాయి. తల పగిలింది. హిందూ ముస్లిముల మధ్య ఈ తగాదాలు నాకు చాలా కష్టం కలిగించాయి. మతం కన్నా మనిషి గొప్ప అనే భావన బల పడింది. ఆ దృష్టితోనే 'మనీషి' అనే కవిత రాశాను. దానికి బహుమానం కూడా ఇచ్చారు. మగ్దూం నా మీద మొదట్లో చాలా ప్రభావం చూపించాడు. స్వతహాగా నేను వస్తు వాదిని. నీతి వాదిని. అఖిల భారతీయ రచయితల 14 వ మహాసభలు ఆంధ్ర సారస్వత పరిషత్ హాలులో జరిగాయి. అనేక మంది ప్రసంగాలు చేశారు. అవి నాపై చాలా ప్రభావం చూపాయి. మానవత్వంవైపు నడిపించాయి. రంగాచారి అని కొరియర్ మా బంధువు. తనను కాల్చేశారు.

**సాహిత్యంతో మీ పరిచయం?**

మగ్దూం నా పట్ల చాలా ప్రేమగా వుండేవాడు. నా పెళ్ళికి కూడా వచ్చాడు. దాశరథి, నారాయణరెడ్డి, కాళోజి ఇలాంటి వాళ్లందరితో 50 వ దశకం చివరలో పరిచయం ఏర్పడింది. 60 లలో పోటీపడి నవలలు చదివాను. సాహిత్యంలో భిన్న ధోరణులుగమనించాను. ఒక వైపు పురోగామి ధోరణులు, మరో వైపు తిరోగామి ధోరణులు. తెలుగులో విశ్వనాథ సత్యనారాయణ వంటివారు అభివృద్ధి నిరోధకత్వాన్ని ప్రచారం చేశారు. నేను హిందీ పరీక్షలు రాసే క్రమంలో ప్రేమ్‌చంద్ సాహిత్యం కూడా బాగా చదివాను. నా కవిత 'మనీషి'కి గుంటూరు వారు బహుమానం ఇచ్చారు. అది అందుకోవడం కోసం వెళ్లాను. అప్పుడే విజయవాడ మొదటిసారి చూశాను. ఆ ఎర్రజెండాలు, ప్రజా ప్రదర్శనలు ఇవన్నీ నాకు ఎంతో ఉత్తేజం కలిగించాయి.

తిరిగివచ్చాక నిఖిలేశ్వర్, నేను ఇతర సాహితీ మిత్రులం... మేమంతా అరిపిరాల విశ్వం ఇంట్లో కలుసుకుంటుండేవాళ్లం. కవిత్వాన్ని



Pages_Jan 2009.pmd 9 4/19/2011, 4:53 PM



సాహిత్యాన్ని గురించి చర్చించు కునేవాళ్లం. అరిపిరాల విశ్వం మాకు మంచి సలహాలిచ్చేవాడు. తర్వాత నేను ఉద్యోగార్ధం బెంగుళూరు వెళ్లాను. అక్కడ వాతావరణం, ఒంటరితనం నాలో మార్పు తెచ్చాయి. రాజకీయ చైతన్యం పెరిగిన కొద్ది ఉద్యమాలు, కార్యకర్తగా తిరగడం వీటిపైనే ఆసక్తి వుండేది. నాది మొదటి నుంచి కందుకూరి వీరేశలింగం ధోరణి. కార్యరంగంలో దూకాలని, ముఖాముఖి మాట్లాడాలని ఎప్పుడూ భావించే వాణ్ని. 1961-65 మధ్య సిటీ ఈవెనింగ్ కాలేజీలో బిఎ చదివాను. తెలుగు భాషా సమితి సెక్రట్రీగా ఎన్నికయ్యాను. అప్పుడే తాపీధర్మారావు, గోపీచంద్, కృష్ణశాస్త్రి తదితరులను చూశాను.

మొదటినుంచి నేను రాజకీయాలలో జాగ్రత్తగా ఆచితూచి అడుగేసేవాణ్ని. 62 ప్రాంతంలో చైనా వ్యతిరేకత బాగా ఆవరించింది. చాలా మంది చైనాను ఖండించుతూ తీవ్ర ధోరణిలో కవితలు రాశారు. నేను ఆ పని చేయలేదు. అప్పుడే కమ్యూనిస్టు పార్టీలో చీలిక వచ్చింది. నాకు పి.లక్ష్మీదాస్; ఉర్దూ ప్రసంగాలు బాగా నచ్చేవి. అలాగే ఎన్.వి.భాస్కరరావు చాలా చిన్న చిన్న ఉదాహరణలతో పెద్ద విషయాలు చెప్పగలిగేవారు. తరిమెల నాగిరెడ్డి శైలి కూడా నాకు బాగా నచ్చేది..

**మరి ఈ నేపథ్యంలో మీరు దిగంబర కవులు ఎలా అయ్యారు?**

ఆ నాటి మా స్థితి అది. మేము ఆరుగురం ఆరు రకాలవాళ్లం. ఏకాభిప్రాయం లేదు. ఉన్న వ్యవస్థపై ఆగ్రహం. దాన్ని ప్రతిఘటించడం అనేదే లక్ష్యంగా పెట్టుకున్నాము. అన్నిటినీ ఈసడించుకోవడం అలవాటైంది. కమ్యూనిస్టు సిద్ధాంతాలు మంచివనే భావం అప్పటికే నాలో బలంగా ఏర్పడింది. దిగంబర కవిత్వంలో కమ్యూనిస్టు వ్యతిరేకతను తగ్గించడానికి నేను చాలా కృషి చేశాను.

**కాని అసలు దిగంబరం అనే భావం ఎలా వచ్చింది?**

హంగ్రీ పోయెట్స్, నేకెడ్ పోయెట్స్ ఇలా రకరకాల ధోరణులు పాశ్చాత్య దేశాలలో వచ్చాయి కదా.. దాన్నే అనుసరించాము. సత్యం అనాచ్ఛాదితం అనేది ప్రధాన సూత్రం. దాన్నే దిగంబరం అన్నాము. మహాస్వప్న దాన్ని సిద్ధాంతీకరించాడు. కులమతాలకు అతీతంగా అందరం కలిసి మెలగాలనే భావం మాత్రం వుండేది.

**దిగంబరులుగానే కొంతకాలం కొనసాగారు కదా?**

దానికి చాలా కారణాలున్నాయి. మా కవిత్వానికి రెండు రకాల స్పందనలు వచ్చాయి. మోటూరు హనుమంతరావు గారు మా కవితా ప్రయోగాలపైన తీవ్ర ఆగ్రహంతో దాడి చేశారు. మా స్పందన వెనక నిజాయితీని గుర్తించి నచ్చజెప్పే ప్రయత్నం చేయలేదు. మద్దుకూరి చంద్రంగారు, కంభంపాటి, తుమ్మల వంటివారు కొంత బుజ్జగించే ప్రయత్నం చేశారు. కాని గజ్జెల మల్లారెడ్డి అసలు పడనివ్వలేదు. ఇక పోతే మరో వైపు నుంచి పైగంబర కవులంటూ బయలు దేరారు. పేర్వారం జగన్నాథం తదితరులతో కూడిన చేతనావర్తం బృందం మమ్మలను ఆకాశానికెత్తి కమ్యూనిస్టు వ్యతిరేకతకోసం వాడుకోవాలని చూసింది. ఇలా రకరకాల కారణాలతో అందలమెక్కించిన వారున్నారు. కొంత మంది మాజీ కమ్యూనిస్టులు, శుద్ధ కవితాభిమానులు కూడా. మాకు కోపం, అసహ్యం వుండేవి కనుక వాటిని వ్యక్త పరచే తీవ్రమైన భాషను ఎంచుకున్నాము. ఆ ఆగ్రహంలో అశ్లీలత లాంటి అంశాలు పట్టించుకోలేదు. అయితే తిట్లు పరిష్కారం కాదు. దిగంబర కవులు సబ్జెక్టివ్‌గా వచ్చినవారే తప్ప ఆబ్జెక్టివ్ కాదు. నెగిటివ్ తప్ప పాజిటివ్ కాదు. తిట్లతో మేల్కొలుపు రాదు. కాని ఒకటి చెప్పాలి. ఈ తిట్లలో కూడా తరతమ తేడాలున్నాయి. మాలో నగ్నమునే అదే పనిగా బూతులు అతిగావాడాడు. ఇది సరికాదని చెప్పడానికి ఒకరోజు రాత్రి ప్రత్యేకంగా వాళ్ల ఇంటికివెళ్లి చర్చించాను.

**మరి ఆ వైఖరి మారి, విరసం వైపు రావడం ఎలా జరిగింది?**

తిట్లు మేల్కొల్పు కాదని ఇందాకే చెప్పాను. దిగంబర కవులుగా మేము ప్రజల దగ్గరకు వెళ్లడం పెరిగిన కొద్దీ... అంటే సమాజానికి దగ్గరైన కొద్ది ఆ వైఖరితో భాషతో మనలేకపోయాము. మమ్మల్ని కాలేజీలకు సభలకు ఆహ్వానించేవారు. అక్కడ ఇలాటి భాష మాట్లాడలేక పోయాము. మార్క్సిజమే పరిష్కారమని నేను మొదటినుంచి భావిస్తున్నాను. మరోవైపు ఎంఎల్ పార్టీ ఏర్పడింది. విశాఖ లో శ్రీశ్రీ షష్టిపూర్తి సభలో సోమసుందర్ మాటలకు నేనూ తగువిధంగా సమాధానం ఇచ్చాను. ఆ విధంగా వేడి పెరిగింది. తర్వాత కాలంలో విరసం ఏర్పడడం, దిగంబర కవులు దాంట్లో చేరడం తెలిసినవే. విరసం కోసం రూపొందించిన నాలుగు సూత్రాల్లో ఒకటి నేను రాశాను. ముసాయిదా తయారు చేశాము. నేను ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వుండేవాణ్ని. స్థూలంగా సమాజం కోసం తిరుగుబాటు చేసేవాళ్లను బలపరచాలనే తత్వం మమ్మల్ని ప్రభావితం చేసింది. అంతకు మించిన అవగాహన లేదు. లక్ష నక్షత్రాలు రాలందే.. అంటూ అప్పుడే రాశాను. కొండపల్లి సీతారామయ్య మాకు పాఠాలు చెప్పారు. అయితే విప్లవానికి హింస మంత్రసాని అనే మాటను మేము పొరబాటుగా అన్వయించుకున్నాము. జనం పాత్ర ముఖ్యం. స్థూలంగా విప్లవ రాజకీయాలు తప్ప సాహిత్యసంఘానికి గ్రూపు నిబద్ధతలు పనికిరావని భావించేవాణ్ని. నా వరకు నాకు దేవులపల్లి వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి పట్ల గౌరవం . అంటే వాళ్లు తక్కువ తప్పులు చేస్తారని. కాని విరసంలో వున్న అయిదేళ్లలోనూ ఈ వాతావరణంలో ఇమడలేకపోయాము. అరసం ఏ విధంగా సోవియట్ విప్లవ వారసత్వాన్ని చాటి చెప్పిందో ఆ విధంగా విరసం తాను చెప్పే చైనా విప్లవ ఆదర్శాన్ని ఆచరణలో చూపలేక పోయింది. విరసం ఒక గ్రూపును ఒక ముఠాను బలపరచాలనే ధోరణి నేను అంగీకరించలేదు. కాని నిబద్ధతతో నిలబడ్డాను. 1971లో మమ్మల్ని అరెస్టు చేశారు. తర్వాత జస్టిస్ చిన్నపరెడ్డి తీర్పుతో విడుదలైనాము. త్యాగాలు చేయడం, జైళ్లకు పోవడం మన మార్గం సరైందనడానికి గీటు రాళ్ళు కాదు. ప్రజలలో కదలిక తెచ్చిసమీకరించాలి. కాని అలా జరగలేదనే విషయం కళ్లముందు కన్పిస్తున్నా విరసం సవరించుకోలేదు. అందుకే బయటకు వచ్చాము.

ఖమ్మంలో అక్టోబరు 8, 9 తేదీలలో విరసం మొదటి మహాసభలు జరిగాయి. "ఝంఝ" పేరిట కవితా సంకలనం వెలువడింది దీన్ని ప్రభత్వం వారు నిషేధించారు.

నవంబరులో ఢిల్లీలో జరిగిన "ఆఫ్రో ఆసియా రచయితల



Pages_Jan 2009.pmd 10 4/19/2011, 4:53 PM



సభల్ని" బహిష్కరించమని అందులో రష్యా పెత్తనముందని చైనాను పిలవలేదని చెబుతూ రచయితల్ని బహిష్కరించమని ఒక కరపత్రాన్ని విరసం "కాల్" పేరిట ఇంగ్లీషులో అక్కడ "విజ్ఞాన్‌భవన్" లో పంచింది.

కవితలు ముమ్మరంగా సాయుధ పోరాటాన్ని నక్సలైట్ ఉద్యమాన్ని సమర్థిస్తూ వచ్చాయి. "ఇప్పుడు వీస్తున్న గాలి" పేరిట కథా సంకలనం వచ్చింది. దీన్ని నిషేధానికి గురిచేశారు.

ఈలోగా సాయుధ పోరాటం విషయంలో రచయితల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి. పార్లమెంటరీ పంథావల్ల ప్రజలకు న్యాయం జరగని మాట నిజమేకాని "వర్గశత్రునిర్మూలన" పేరిట కొందరిని చంపితే విప్లవం రాదని, విప్లం ఎవరికి అవసరమో ఆ ప్రజలు కనీసం కూడా పాల్గొననిది అది విప్లవం కాదని కొందరు వాదించి బయటకు వచ్చారు. 1975 చారుమజుందారును కొండపల్లి సీతారామయ్యను సమర్థించే వారు విరసంలో వుండిపోయారు. మిగతా వారు ఒకరి తర్వాత ఒకరు బయటకు వచ్చేశారు. విప్లవవాద రచయితల సంఘాలు గ్రూపులవారిగా ఏర్పడ్డాయి. ఆ తర్వాత కొందరు "స్వతంత్ర రచయితలు" ఉండిపోయారు "ఎమర్జెన్సీ" రావడంవల్ల చాలా మంది రచయితలు నిర్బంధానికి కేసులకు గురయ్యారు.

"ప్రజలనుసాయుధం చేస్తున్న రెవల్యూషనరీ నేడు విప్లవకవి" అనేది ప్రధాన నినాదం అయింది - కవి విప్లవ సమర్థకుడే కాని విప్లవాన్ని నిర్మించడు ఆ సామర్థ్యం రాజకీయానికి ఉంటుంది. ఈ సందర్భంలోనే రసవాదాన్ని అలంకారాన్ని కలిపి ఆకుకు అందకుండా పోకకు పొందకుండా గుంటూరు శేషేంద్రశర్మ "కవిసేన" అనే ఉద్గ్రంధాన్ని వెలువరించారు. దాన్ని ఎవరూ సీరియస్‌గా పట్టించుకోలేదు. ఆయనకొక అభిమాన సంఘం కొంత కాలం ఏర్పడ్డానికి తోడ్పడింది. ఆయన ఎంత చక్కని కవో అంత గందరగోళపు సిద్ధాంతవేత్త - ఫ్యూడల్ రసైక దృష్టి ప్రజాస్వామిక విప్లవ చింతన, సంఘీభావ కవితాభివ్యక్తి కలవడంలేక కలపడం కుదరని పని.

విప్లవ కవిత్వం తన వైభవాన్ని 1975- నుండి 1980 దాకా వుంచగలిగింది. విప్లవ అవగాహనకు సంబంధించిన భిన్నాభిప్రాయాలే విరసాన్ని విరసంగా పని చేయకుండా చేసింది. పౌరహక్కుల ఉద్యమం కూడా ఈ సందర్భంలో రచయితల అధ్వర్యాన మొదట కొనసాగింది.

**తర్వాత జన సాహితి....**

దాంట్లో అయిదేళ్లు వున్నాను. అప్పుడూ ఇదే సమస్య. సైద్ధాంతిక విభేదాలకు పెద్ద పీటవేస్తూ సాహిత్య రంగంలో విశాల కర్తవ్యాలను నిర్లక్ష్యం చేయడం. మురాతత్వాలు. సాహిత్యం తెలియని వాళ్లు శాసించడం. రచయిత ఫిలసాఫికల్‌గా కమిట్ కావాలి తప్ప గ్రూపు అనుబంధం పాటించనవసరం లేదనేది నా భావం. అందుకే దాని నుంచీ వైదొలగాము. అప్పటినుంచి ఒపిడిఆర్; భారత చైనా మిత్ర మండలి లాటి వాటిలో పని చేస్తున్నాను. సాహిత్యంలో ప్రగతిశీల శక్తుల విశాల ఐక్యత వుండాలనేది నా ఆకాంక్ష. అందుకోసమే నేను ఎప్పుడూ చేతనైన కృషి చేస్తుంటాను.

**సీనియర్ కవి అయినా మీ సంపుటాలు చాలా తక్కువగా వుండటానికి కారణం?**

చెప్పాను కదా.. నేను ప్రధానంగా కార్యవాదిని. రాసినవి తీసిపెట్టుకోవడం, పుస్తకాలుగా వేసుకోవడం పై పెద్ద ఆసక్తి లేకపోయింది. దాంతో పాటు ఆర్థిక వనరుల కొరత కూడా వుంది. 1972లో 'ఓటమి' తిరుగుబాటు సంపుటి వేశాను. అంతే. ఉరిశిక్ష ను వ్యతిరేకిస్తూ 1979లో జ్యోతి మాసపత్రికలో వేలాడేమందారం నవల రాశాను. కథలు కూడా కొన్ని వున్నాయి.

**మీరు సాహిత్య ఉపన్యాసకులుగా రాష్ట్రవ్యాపితంగా ఎంతో ప్రభావం చూపి ఉత్తేజపరచారు, ఈ విషయంలో మీ అనుభవాలు ఏమిటి?**

నేను విద్యార్థి దశ నుంచే ఉపన్యాసాలు చేసేవాణ్ని. నా అభిప్రాయాలు చెప్పడం అలవాటు. సంప్రదాయ సాహిత్యం, హిందీ ఉర్దూ సాహిత్యాల పరిచయం కూడా వుండటం మరో సదుపాయం. ఈ పాతికేళ్లలో ఎన్నో సాహిత్య సభల్లో మాట్లాడాను. ఆయన ఇప్పటికి నేను ఏమి మాట్లాడాలో తయారవుతూంటాను. రాసుకుంటాను. మైకుకు దగ్గరగా వెళ్లానని, డైవర్ట్ అయ్యానని ఇలా సభ తర్వాత నన్ను నేను విమర్శించుకుంటుంటాను. అయినా ఆవేశంలో మళ్లీ అలా జరుగుతూనే వుంటుంది. మొత్తంపైన నా అనుభవాన్ని రచనలను బట్టి సాహితీ మిత్రులు నన్ను సభలలో మాట్లాడవలసిందిగా తరచూ పిలుస్తుంటారు. వాస్తవానికి రాష్ట్రం వెలుపల హిందీ రాష్ట్రాలలో కూడా నేను చాలా ప్రసంగాలు చేశాను. ఇంకా ఉపన్యాసాలలో సంయమనం పెంచుకోవాలనే అనుకుంటాను.

**స్త్రీవాదంపై మీ వ్యాఖ్యలు మరీ శృతిమించాయనే అభిప్రాయం సాధారణంగా వుంది. దాని పట్ల అలాగే సాహిత్యంలో ఇతర వాదాల పట్ల మీ ప్రస్తుత అభిప్రాయాలేంటి?**

నా అభిప్రాయాలకు నిశిత విమర్శలకు నేను కట్టుబడే వున్నాను. జెండర్ వివక్ష,కుల వివక్షలపై పోరాడవలసిందేగాని ఇవి వర్గ పోరాటాన్ని రీప్లేస్ చేయలేవు. ఎన్‌జివో ల ప్రభావం మన ప్రజా పోరాటలను దారి తప్పిస్తుంది. నీలి కవితలు అని అప్పట్లో నేను చేసిన వాదనలు రుజువయ్యాయి. అలాటి విమర్శలు నిజానికి ఆ వాదనలు పుట్టిన చోట వచ్చిన వాటినే నేను వుటంకించాను తప్ప కొత్తగా క నిపెట్టలేదు.

వియత్నాంలో చావుదెబ్బ తిన్నాక అమెరికాలాంటి సామ్రాజ్యవాద దేశాలు, ఉపజాతుల సిద్ధాంతం అనే ఉద్యమాన్ని రూపొందించి ఆసియా ఆఫ్రికా దేశాల్లో స్త్రీలను కిందిజాతులను రెచ్చగొట్టడానికి కోట్లాది నిధులిచ్చి "స్వచ్ఛంద సంస్థల్ని" నెలకొల్పాయి అలా వచ్చిన వికృత వాదాల్లో "స్త్రీవాదం" ఒకటి - లింగవివక్ష పేర విజృంభించారు. వీరికి డాలర్ల పంట పండుతూ వుంది. ప్రాజెక్టులు వస్తున్నాయి. "పీడితులు ఒకటిగా కాకుండా ఎవరికి వారు ముక్కలు ముక్కలుగా వేరుపడేట్లు చేయడం వీరి ప్రధాన ధోరణి. స్త్రీవాదం దళితవాదం, మైనారిటీవాదం బహుజనవాదం, ఆధునికోత్తరవాదం, ఇలా రంగప్రవేశం చేశాయి. ప్రజలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సంఘటితపడకుండా చూస్తున్నాయి.

ఈనాటి నవల, కథ, కవిత, విమర్శ నాటకాలు ఎలా



Pages_Jan 2009.pmd 11 4/19/2011, 4:53 PM

# దృశ్యాల వెనుక రహస్యాల్ని చూడాలి

**కె. ఆనందాచారి**



కళ్ళను తాకే దృశ్యాల వెనుక రహస్యాల్ని
ఒకసారి చూడాలి మనం

విధ్వంసం మొలకెత్తిన
ఆలోచనా వ్యూహపుదారులలో
ఆజ్ఞల చక్రబంధంలోకి
తనను తాను తాకట్టుపెట్టుకుని
బ్రతుకు జూదంలో వాడు మృగమై తేలుతాడు
ప్రాణాన్ని స్టెన్‌గన్‌లలో బుల్లెట్లుగా నింపుతాడు
ఎవరు శత్రువో ఎవరిపైన తానెందుకు పేలాలో
తెలియని గురిపెట్టిన ఉన్మాద భీభత్స తుపాకీ వాడు

దృశ్యాల వెనుక జీవిత చిత్రాల్ని చూడాలి

వాడిప్రాణం ఖరీదు వాడికి తెలుసు
దాని వెనుక ఒక కుటుంబం-
లక్షా యాభైవేలతో వారికి
బ్రతుకు దారిని పరిచే ప్రయత్నంలో ఒక
ఉన్మత్త బోధన తలకెక్కించుకుంటాడు

ఈ లక్షా.. వాడొక్కడి ప్రాణం ఖరీదు మాత్రమే కాదు
తూటాలు తమ గుండెల్లో దిగి రక్తం మడుగెందుకు కట్టిందో
బాంబులెందుకు తమ బ్రతుకుల్ని మసి చేశాయో
తెలియని నిస్సహాయ తనువులెన్నో
చివరి శ్వాసల్ని వాడి కుటుంబానికి జమచేశాయి

వాడెక్కడివాడైతేనేమి
వాడి దారిద్ర్యం
అరాచక ఉన్మాద రణానికి పనిముట్టయింది

కళ్లను తాకే దృశ్యాల వెనుక రహస్యాల్ని
ఒకసారి చూడాలి...

ఉన్మాదమో.. ఉగ్రవాదమో ఒంటరిగా ఎదగలేదెన్నడూ
అరాచక రాజకీయార్థికాగ్రహాంకారాల చేతుల్లో
ఇంతింతై పెరిగినవే అన్నీ

దోపిడి యుద్ధాన్ని మోసుకొస్తోంది
యుద్ధం ఆయుధాన్ని ఎగురేస్తుంది
ఆయుధం నెత్తురై విస్తరిస్తుంది
లోకాన్ని దుఃఖాల కొలిమిలో ముంచేస్తుంది
మతమో, జాతో, దేశాల సరిహద్దుల్లో ఏదైనాకానీ
ఈ రక్తాన్ని రుచిచూశాయంటే
మనిషిపై యుద్ధం కొనసాగుతుంది

ఇది దృశ్యమవని
అగ్రరాజ్య ఆకృత్యాల ఆలోచనా ఫలం

కళ్లను తాకే దృశ్యాల వెనుక రహస్యాల్ని
ఒకసారి చూడాలి మనం

---

వుండాలనే విషయంలో జరగాల్సినంత జరగలేదు. చెప్పుకోదగ్గ గొప్పరచనలు సార్వకాలికాలుగా ఏవీ నిలవలేదు.

కొత్త రచయితలు, కొత్త అభివ్యక్తులు వచ్చాయి. ఈ మధ్య "తెలంగాణా సంస్కృతి రంగం" పేరిట మాండలిక సంస్కృతి రక్షణ ధోరణి ప్రబలింది.

20 వ శతాబ్దం సాధించిన పీడిత జన సంఘటిత రూపాన్ని మధ్యతరగతి నిబద్ధతను ఆ తర్వాత వచ్చిన వేర్పాటు ఉద్యమాలు దెబ్బతీశాయి – దేశాలు స్వాతంత్ర్యాన్ని, జాతులు విముక్తిని ప్రజలు విప్లవాన్ని కోరుతున్న తరుణంలో "ప్రపంచీకరణ" వచ్చి అన్నిటిని "బజారు సంస్కృతి"కి బలి చేసింది "సమిష్టితత్వం" పోయి "వ్యక్తిదుగ్ధ" ప్రధానమైంది.

**మీరు సాంప్రదాయ సాహిత్యాన్నికూడా తరచూ వుటంకిస్తుంటారు, నేటి సాహిత్య కారులకు అవి అవసరమా?**

తప్పకుండా. భారతంలో శాంతిపర్వం, యుద్ధపర్వం, విరాట పర్వం, స్త్రీ పర్వం స్వర్గారోహణ పర్వం తప్పక చదవాలి. స్వర్గారోహణ పర్వంలో భీమార్జున నకుల సహదేవులు ద్రౌపది ఒక్కొక్కరే పడిపోతారు. ఇలాగే విప్లవ ప్రస్థానంలో కూడా చివరవరకూ నిలిచే వారు కొందరే వుంటారు. వారికి సహనం, సంయమనం వుండాలి అని నేను చెబుతుంటాను. ఇలాటి సజీవమైన ఉదాహరణలు చాలా వుంటాయి. రావిశాస్త్రి పిపీలికంలో వలె. టాల్‌స్టాయ్ అన్నా కెరినా ఎదుర్కొన్న సంక్షోభం, విషాదాంతం ఒకవైపు– గోర్కి అమ్మ విప్లవంలో నిలిచిన తీరు మరో వైపు కనిపిస్తుంటాయి. ఇటీవల వచ్చిన రేగడి విత్తులు నవల నవీన మధ్యతరగతి బూర్జువావర్గాన్ని చూపిస్తే అంటరాని వసంతం పేద ప్రజల పరిస్థితిని కులం కోణం నుంచి చూపింది. ఇలాటి ధోరణులు కాక సమగ్ర దృష్టితో సమైక్యంగా కదలాలనేది నా వాదన. ఈ నాటి రచనలలో తెలుగు ప్రయోగాలు తగ్గి అనుకరణలు పెరుగుతున్నాయి. ఒక్క వాక్యంలో విప్లవానికి నమస్కారం పెట్టి ఆ పైన ఆత్మాశ్రయంగా రాస్తున్నారు. ఇదేమి ఉపయోగపడదు. నాకు పగలు వద్దు, రాత్రి కావాలి అని కవిత రాయడం అభివృద్ధికి దారి తీయదు కదా.

**ఈ నాటి సాహిత్యోద్యమాలకు, రచయితలకు మీ సూచనలు?**

అన్ని రకాల అభ్యుదయ శక్తులు ఐక్యంగాపని చేయాలి. వ్యక్తి నిష్ఫన్నంగా గాక సమాజ నిష్ఫన్నంగా రాయాలి. ఆలోచించాలి.

**(ప్రస్థానం 2003 జనవరి–మార్చి సంచిక నుండి పునర్ముద్రణ)**



Pages_Jan 2009.pmd 12 4/19/2011, 4:53 PM

## నివేదిక

# తమిళనాడు అభ్యుదయ రచయితల సంఘం 11వ మహాసభలు

ఎ.జి. యతిరాజులు



మూడు రాష్ట్రాల సాహిత్య ప్రతినిధులు: తమిళనాడు అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి తమిళ సెల్వం, కేరళ పురోగమన కళా సాహిత్య సంఘం ప్రధాన కార్యదర్శి వి.ఎన్. మురళి, సాహితి స్రవంతి కన్వీనర్ తెలకపల్లి రవి

**1975** అత్యవసర పరిస్థితి ఆవరించిన అంధకార యుగంలో తమిళ రచయితల కవుల భావ ప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించటానికై తమిళనాడు అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భవించింది. ఆనాటి నుండి ప్రజాస్వామ్యము, సమానత్వము ఆశయాలతో అసంఖ్యాకమైన నూతన కవులను రచయితలను ఈ సంఘం రూపొందించగలిగింది. కాలానుగుణమైన మార్పులతో సోషలిస్టు వాస్తవికతను తన ఆదర్శంగా మలచుకొని ప్రగతిబాటలో పయనిస్తూ నేడు తమిళ ప్రజల సామాజిక సాహిత్య జీవితంలో అవిభాజ్య అంగంగా వర్థిల్లుతున్నది.

తమిళనాడు అభ్యుదయ రచయితల సంఘం 11వ రాష్ట్ర మహాసభలు చెన్నైలో కొడంబాక్కంలో డిసెంబరు 18–21 తేదీలలో జయప్రధంగా నిర్వహించబడ్డాయి. తమిళనాడు రాష్ట్రంలోని అన్ని మూలల నుంచి వేయి మందికి పైగా సాహితీకారులు, కళాకారులు నాలుగు రోజుల మహాసభలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరిలో 300 మంది మహిళలలు కూడా ఉండటం విశేషం.

ప్రారంభ సభకు ఆహ్వానసంఘం అధ్యక్షులు సుప్రసిద్ధ సినీ దర్శకులు బాలుమహేంద్ర స్వాగతం పలికారు. ప్రసిద్ధ తమిళ అభ్యుదయ రచయిత ప్రభంజన్ మహాసభను ప్రారంభిస్తూ సమస్త ప్రజల సాంస్కృతిక జీవనాన్ని కకావికలం చేస్తున్న ప్రపంచీకరణకు వ్యతిరేకంగా వారిని చైతన్యపరచవలసిన కర్తవ్యం రచయితలకు ఉందన్నారు. మనుషుల ఉపయోగానికి సరుకుల ఉత్పత్తి అనే దానికి బదులు సరుకుల వినియోగానికి మనుషులుగా ప్రస్తుతము మనందరము మారిపోయిన విషయము గుర్తుచేశారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన చిత్రకారుడు పికాసో, రచయితలకే గురువు మాక్సింగోర్కీ, గాయకుడు, కవి పాబ్లోనెరడా, హిందీ రచయిత ప్రేమ్‌చంద్ అందరూ అభ్యుదయ భావాలతోనే తమ శక్తిసామర్థ్యాలను ప్రజానుకూలంగా ప్రదర్శించి మనకు ఆదర్శనీయులైనారని, వారి బాటలోనే అభ్యుదయ రచయితలు, కళాకారులు సామ్రాజ్యవాద మాయాలేడి అయిన ప్రపంచీకరణకు, మతోన్మాద ఫాసిజానికి వ్యతిరేకంగా అత్యంత వేగంగా కార్యాచరణకు దిగాలని ఉద్బోధించారు.

మహాసభలను అభినందిస్తూ సందేశము అందజేసిన కేరళ అభ్యుదయ కళాసాహిత్య సంఘ ప్రధాన కార్యదర్శి ఆచార్య మురళి ప్రస్తుతము దేశంలో మతోన్మాదశక్తులు ప్రజల సమైక్యతను చీల్చి వేస్తున్నాయని, దీనిపట్ల మనము మిక్కిలి జాగరూకతతో ఉండాలని హెచ్చరించారు. ఆయన మళయాళంలోని ఒక కవితను చెపుతూ 'వేయి పక్షులు రెక్కలు విప్పి ఎగిరితేనేమి, ఆకాశం ఒకటే కదా!' అలాగే వివిధ మతాల ప్రజలు నివసించిన మనభూమి ఒక్కటే' అన్నారు. క్రిస్టమస్ రోజున ఒరిస్సా కంధమాల్ జిల్లాలో బంద్‌నకు పిలుపునిచ్చి మతోద్రేకాలను రెచ్చగొట్టే హిందూత్వ శక్తుల పట్ల రచయితలు, కవులు భ్రమలకు లోను కాకూడదన్నారు.

ఆంధ్రప్రదేశ్ నుండి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన సాహితీస్రవంతి రాష్ట్ర కన్వీనర్ తెలకపల్లి రవి సందేశమిస్తూ 'తమిళ సాహిత్యానికి తెలుగు సాహిత్యానికి అనాదిగా ఉన్న సాన్నిహిత్యాన్ని ప్రస్తావించారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతి తెలుగు కవితోద్యమానికి ఎంతో స్ఫూర్తి నిచ్చారన్నారు. ఆనాడు భారతి లాంటి సాహితీవేత్తలు దేశస్వాతంత్ర్యానికి గళమెత్తితే నేటి మన పాలకులు మనందరి స్వేచ్ఛను సామ్రాజ్యవాదుల పాదాక్రాంతం చేస్తున్నారన్నారు. నేటి మీ చిన్నప్పభారతి నవలలు సంఘము, దాహము, చక్కెర మొదలైనవి తెలుగు పాఠకులను ఎంతగానో ప్రభావితం చేశాయన్నారు. తెలుగు ప్రసంగానికి సభికులు తరచుగా స్పందించడం విశేషం. నిర్వాహకుల ఒత్తిడి మేరకు తెలుగులో మాట్లాడిన తెలకపల్లి రవి ప్రసంగాన్ని ఎ.జి. యతిరాజులు తమిళంలోకి అనువదించారు.

ప్రారంభసభకు అధ్యక్షత వహించిన తమిళనాడు అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య అరుణన్ తన ఉపన్యాసములో ప్రపంచాన్ని తన ఆయుధ బలంతో గడగడలాడిస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రజాప్రతిఘటన తీవ్రమవుతుందన్నారు. దాని ప్రతిబింబమే ఇరాక్‌లో బుష్‌పైన జర్నలిస్టు బూట్ల దాడి అంటూ ఈ మార్పును అభ్యుదయ రచయితలు, కళాకారులు గ్రహించాలన్నారు.

మహాసభల సందర్భంగా చిత్ర ప్రదర్శనలు, పుస్తక ప్రదర్శనలు, జానపద కళాకారుల ప్రదర్శనలు, తమిళ సంస్కృతిని ప్రతిబింబించే కళాకారుల ప్రదర్శనలు నాలుగు రోజులపాటు కొనసాగాయి. రెండవ రోజునుంచి ప్రారంభమైన ప్రతినిధుల సభ మూడురోజులు కొనసాగింది. తమిళనాడు అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి, ప్రముఖ తమిళకథా రచయిత తమిళసెల్వన్ విస్తృతమైన నివేదికను సమర్పించారు. తమిళనాట ప్రస్తుతము ఉన్న విభిన్న సాహితీ ధోరణులను, కళాప్రక్రియలను సమీక్షించి గత మూడు సంవత్సరాలు తమ సభ్యుల సృజనాత్మక ప్రక్రియలన్నింటినీ వివరించారు. గత మూడు సంవత్సరాలలో తమ సంఘము తమిళ ప్రాచీన భాషా ప్రకటనకు, దళితులపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనటానికి మతోన్మాద కార్యాక్రమాలపై ప్రజలకు అవగాహన



Pages_Jan 2009.pmd 13 4/19/2011, 4:53 PM

కల్గించడానికి, కొత్తగా ప్రత్యామ్నాయ సినిమా ఉద్యమాన్ని అట్టడుగు స్థాయి వరకు తీసుకుపోవడానికి రచయితలు, కవులు నిర్మించిన లఘుచిత్రాలను గూర్చి, డాక్యుమెంటరీ ఫిల్ముల గురించి పలు విషయాలను వివరించారు. దర్శకుడు బాలుమహేంద్ర ఒక కథ చలన చిత్రంగా ఎలా రూపొందుతుందో ప్రదర్శనా పూర్వకంగా వివరించారు.

మిగతా రోజులలో కూడా ప్రతినిధుల సభలలో వివిధ అంశాలపై మేధావుల చేత ఉపన్యాసాలు ఇప్పించటం జరిగింది. ఈ సంఘం సీనియర్ కార్యకర్తలకు సభా వేదికపై గౌరవపూర్వకమైన సత్కారాలు కూడా జరిగాయి. ప్రసిద్ధ దళిత మేధావి ఆచార్య ఆనంద్ టెల్‌డుమడే సామ్రాజ్యవాద వ్యతిరేకత-దళిత విముక్తి అనే అంశంపై ఇచ్చిన ఉపన్యాసము ప్రతినిధులను ఆకట్టుకున్నది.

చివరి రోజు మహాసభలకే తలమానికంగా పార్లమెంట్ సభ్యులు సీతారాం యేచూరి సాంస్కృతిక సవాళ్ళు అనే అంశంపై ప్రసంగించారు. సంస్కృతీ సాహిత్యాలనేవి ఎక్కడో ఆకాశం నుంచి ఊడిపడ్డవి కావు. ఆయా కాలాల్లో నివసించిన ప్రజల సామాజిక జీవనాన్ని సాహితీసంస్కృతులు ప్రతిబింబిస్తాయి. అయితే అప్పటి పాలకవర్గాల స్వార్థ భావజాలానికి అనుగుణంగానే అవి ఉంటాయి. ఈ తేడాను మేధావి వర్గమైన రచయితలు అర్థం చేసుకోవాలి. భారతదేశ ప్రాచీన కావ్యాలు, ప్రబంధాలు అణిచివేతకు ప్రతిరూపాలైన వర్ణవ్యవస్థను రక్షించటానికే రచింపబడ్డాయి. వాటిలోని నిజానిజాలు తర్కయుక్తంగా మనం గ్రహించాల్సి ఉంటుంది. ఉదాహరణకు మన పురాణాలలోని విష్ణువు దశావతారాలను తీసుకుంటే అప్పటి మన దేశ ప్రజల జీవనం ఆయా అవతారాలలో మనకు విశదమవుతున్నదని అన్నారు.



తెలకపల్లి రవి ప్రసంగాన్ని తమిళంలోకి అనువదిస్తున్న ఎ.జి. యతిరాజులు

అప్రత్యక్షంగా నేడు మన ఎదుట సామ్రాజ్యవాదము, మతోన్మాదశక్తులు ప్రధాన శక్తులుగా నిలబడ్డాయి. వీటికి వ్యతిరేకంగా రచయితలూ, కళాకారులూ దృఢంగా నిలబడి ప్రజల పక్షాన తమ రచనలూ, కళారూపాలూ సృష్టించాలని ఆయన ఉద్బోధించారు.

మహాసభలో నూతన రాష్ట్ర బాధ్యులు ఎన్నుకోబడ్డారు. అధ్యక్షులుగా ఆచార్య అరుణన్, ప్రధాన కార్యదర్శిగా తమిళ సెల్వన్‌లతో పాటు నూటపందొమ్మిది రాష్ట్ర కమిటీ సభ్యులుగానూ, 39 మంది కార్యదర్శి వర్గ సభ్యులుగానూ ఎంపికచేయబడ్డారు. మహాసభలలో అనేక తీర్మానాలు చేయడం జరిగింది.

మహాసభల చివరి కార్యక్రమంగా వేదిక నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొడంబాక్కం లిబర్టీ వరకు కళాకారుల మహాప్రదర్శన సాగింది. కళాకారులు, తమిళ జానపద కళారూపాలను ప్రదర్శిస్తూ ముందుకు సాగారు. రంగు రంగుల ఈప్రదర్శన చెన్నై నగర ప్రజలను బాగా ఆకట్టుకుంది. అక్కడ రాత్రి ఏడు గంటల నుంచి వేకువ జాము వరకు ప్రసంగాలు, చర్చాగోష్టులు, నాటికలు, పాటలు, వాయిద్యాల హోరు, కవితాఘోష్టి వంటి సాంస్కృతిక కార్యక్రమాలను వేలాది ప్రజానీకము వీక్షించారు. కళారాత్రి అనే ఈ విశిష్ట కార్యక్రమంలో సినీదర్శకులు, నటీనటులు కూడా పలువురు పాల్గొని తమిళ అభ్యుదయ రచయితల సంఘ కార్యక్రమాల పట్ల తమ ఏకీభావాన్ని ప్రకటించారు. ◆

## ప్రజా చైతన్యమే లక్ష్యంగా సాంస్కృతిక ఉద్యమం

### త. అ. ర. సం. ప్రధాన కార్యదర్శి



***1975వ సంవత్సరంలో ఎమర్జెన్సీ కాలంలో పెట్టుబడిదారి శక్తులకు, తదనంతరం కొనసాగిన వారి విధానాలకు, అనంతరం వచ్చిన ప్రపంచీకరణ మూలంగా తలెత్తిన ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా 33 సంవత్సరాలుగా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు సాంస్కృతికంగా వివిధ రూపాల ద్వారా కృషి చేస్తున్నది తమిళనాడు అభ్యుదయ రచయితల సంఘం. ఆ సంఘం 11వ రాష్ట్ర మహాసభలు చెన్నయ్ కోడంబాక్కంలోని రామ్ థియేటర్‌లో ఈ నెల 18-21 తేదీలలో జరిగిన సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి తమిళ సెల్వన్ మాటల్లో ....***

ఎమెర్జెన్సీ కాలంలో ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం అనేక మంది వివిధ రూపాలలో పోరాడారు. ఇందుకు ప్రజలను సన్నద్ధం చేసేందుకు రచనలూ దోహదం చేశాయి. ఆ క్రమంలో ఏర్పాటయ్యిందే తమిళనాడు అభ్యుదయ రచయితల సంఘం.

ఆ కాలంలో రచయితలపై తీవ్ర నిర్బంధం ఉండేది. రచయితలను జైళ్ళకు పంపించిన ఘటనలూ ఉన్నాయి. ఇవేవీ లెక్కచేయకుండా అన్ని కష్టాలకు ఓర్చి ప్రజల కోసం పాటుపడిన వారు అనేక మంది ఉన్నారు. వారిలో ముఖ్యులు కె. ముత్తయ్య, ఎన్.శంకరయ్య, అరుణన్, ఎస్.కె. పెరుమాళ్, చిన్నప్ప భారతి లాంటి అనేక మంది ఉన్నారు. వారి ఆకాంక్షల ప్రతిరూపమే ఈ సంఘం. ఎమర్జెన్సీ ముగిసిన తర్వాత ప్రజల మధ్య అసమానతలు అధికమయ్యాయి. కులతత్వం హెచ్చుమీరింది. దీంతో సంఘాన్ని జిల్లాస్థాయికి విస్తరించి, కమిటీల ద్వారా గ్రామాలలో కులతత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్వహించాము. అనంతరం ప్రపంచీకరణతో ఆర్థిక అసమానతలు ఎక్కువయ్యాయి. ఆ సమయంలో జానపద కళారూపాలను సైతం ప్రదర్శించేవారు. సినిమా నటులు, ఇతర సాంస్కృతిక రంగాలకు సంబంధించిన అనేక మందిని సంఘంలో చేర్చుకున్నాము. ప్రస్తుతం సంఘంలో 12 వీధి నాటిక దళాలు, 15 పాటల దళాలు, 15 జానపద కళలకు సంబంధించిన దళాలు ఉన్నాయి. వీటి ద్వారా గ్రామాలలో ప్రదర్శనలను ఇప్పిస్తున్నాం. ప్రతి ఏడాది ఫిబ్రవరి నెలలో జానపద కళారూపాల ప్రదర్శనను నిర్వహిస్తున్నాం. 30కి పైగా లఘుచిత్రాలు, డాక్యుమెంటరీలు నిర్మించి గ్రామాలలో ప్రదర్శిస్తున్నాం. వివిధ అంశాలకు సంబందించి 200 పైగా పుస్తకాలను ప్రచురించాం. స్త్రీలను వంటింటికే పరిమితమవ్వాలనే నానుడిని రూపుమాపేందుకు భర్తలకు కూడా వంట నేర్చుకునేలా శిక్షణలు ఇప్పిస్తున్నాం. గత 10 సంవత్సరాలుగా ఉత్తమ సినిమా, ఉత్తమ నవల, ఉత్తమ అనువాద నవల, ఉత్తమ పిల్లల సినిమా, తమిళ భాష అభివృద్ధికి సంబంధించి కథ, ఉత్తమ పుస్తకము ఇలా 8 అవార్డులను అందిస్తున్నాము. సామ్రాజ్యవాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రచారాలను నిర్వహిస్తున్నాము. ప్రస్తుతం సంఘం 60 వేల సభ్యత్వాన్ని కలిగి ఉంది. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మహాసభలు జరుగుతాయి. ప్రస్తుతం 11వ మహాసభ జరుగుతుంది. ఈ మహాసభలకు సుమారు 1000 మంది ప్రతినిధులు హాజరయ్యారు. నాలుగు రోజులు జరిగిన ఈ సభల్లో పలు అంశాలపై చర్చలు, సెమినార్లు నిర్వహించాం. 50 కొత్త పుస్తకాలను, 3 ఫిల్మ్‌లను, 2 పాటల క్యాసెట్‌లతను విడుదల చేశాం. ప్రస్తుతం మా సంఘం కార్యకలాపాలు మరింత విస్తృతం చేయడానికి ఈ మహాసభలలో నిర్ణయం తీసుకోబోతున్నాం. ప్రపంచీకరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కీలకసమయంలో మా సంఘం తమిళ సాహిత్య, సాంస్కృతిక రంగాలలో మరింత క్రియాశీలక పాత్ర నిర్వహించబోతుంది. ◆



Pages_Jan 2009.pmd 14 4/19/2011, 4:53 PM

పరిచయం

# నాలుగు రెక్కలతో నలు దిక్కులకూ...

## ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రచురణలు

డా. ఎం.వి. రమణ
తోట వెంకటస్వామి

ఏ విశ్వవిద్యాలయానికైనా నిర్దేశిత లక్ష్యం ఒకటి ఉంటుంది. స్థాపనకు ఒక ముఖ్య ఉద్దేశ్యం ఆ విశ్వవిద్యాలయం నెరవేర్చవలసిన ప్రయోజనాలు మొదలైనవి తప్పకుండా ఉంటాయి.

త్రిభాషా ప్రాంతమైన కుప్పంలో దాక్షిణాత్య భాషీయుల మధ్య భావ సమైక్యతను పెంపొందించేందుకు 1997లో ద్రావిడ విశ్వవిద్యాలయం స్థాపించబడింది. ఈ విశ్వవిద్యాలయ అవతరణ వెనుక సమున్నత లక్ష్యం సముదాత్త ఆశయం ఉంది.

ప్రపంచనాగరికతల్లోనే అతి ప్రాచీనమైంది, ద్రావిడ నాగరికత. ఒకప్పుడు ఆఫ్రికా ఖండం హిందూ దేశం. హిందూ దేశ దక్షిణభాగం కలిసి వుండేవని పురా చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఆ తరువాత కాలంలో హిందూ మహాసముద్రం పాయ ఈ రెండింటిని విడదీసింది. ఈ కారణంగానే ఆఫ్రికా ప్రజల మధ్య దక్షిణ భారతీయుల మధ్య రూపంలోనే కాకుండా భాషల్లోను పోలికలెన్నో ఉన్నాయని పరిశోధనలు తేల్చి చెబుతున్నాయి. వాటిని వెల్లడించేందుకు పరిశోధకులు శ్రమిస్తున్నారు.

ఇప్పటికి అందిన సమాచారాన్ని బట్టి సుమారు 27 భాషలు కన్యాకుమారినుంచి భారతదేశం అంతటా ఆపై ఆఫ్ఘనిస్థాన్ ద్వారా విస్తరించి వ్యాపించి ఉన్నాయి. వాటిని ద్రావిడ భాషా కుటుంబంగా గుర్తిస్తున్నారు. ప్రపంచంలో ద్రావిడ సంస్కృతి నాగరికతలకు సమకాలీనంగా ఎన్నో నాగరికతలు వికసించినప్పటికీ అవి కాలక్రమంలో అంతరించాయి. ఇప్పటికి సజీవంగా ఉన్న ద్రావిడ నాగరికతను, భాషను, సంస్కృతిని, చరిత్రను, కళను అధ్యయనం చేయడానికి ఒక సంస్థ అవసరాన్ని గుర్తించిన వారు ఈ ద్రావిడ విశ్వవిద్యాలయానికి అహరహం శ్రమించి రూపకల్పన చేసి దానిని సాకారపరిచారు. ఈ దృష్ట్యా దీని స్థాపనకోసం కృషిచేసిన ఆచార్య వి.ఐ. సుబ్రమొణియం, కాశీపాంద్యన్ లాంటి పెద్దలను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన చేయూతను సదా జ్ఞాపకంలో ఉంచుకొని ఈ విశ్వవిద్యాలయ అభివృద్ధికి దోహదకారులుగా నిలిచిన పూర్వ ముఖ్యమంత్రులైన నందమూరి తారకరామారావు, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, నారా చంద్రబాబునాయుడు లతో పాటు ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం ముఖ్యంగా ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖరరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఈ విశ్వవిద్యాలయం ముందుకు నడుస్తున్నది.

ఒకనాడు కేవలం ఐదు విభాగాలతో ఉన్న ఈ విశ్వవిద్యాలయం నేడు రెండు పదుల విభాగాలుగా విస్తరించింది. ఈ ప్రాంతానికి కావలసిన విద్యావసరాలను తీరుస్తూనే దీని స్థాపన విశిష్టతను నిలబెట్టుకుంటూ బహుముఖీన కృషిని సాగిస్తున్నది. అందులో నాలుగు ప్రధానమైన ద్రావిడ భాషా విభాగాలను నెలకొల్పి ఆ విభాగానికి అనువాద అధ్యయనాన్ని అదనపు విలువగా చేర్చి విద్యార్థులను రూపుదిద్దుతూ ఉన్నది. ఈ విశ్వవిద్యాలయంలో అందుకే ప్రతి విభాగం అనువాదాన్ని ప్రత్యేకంగా కలిగి ఉన్నది. వీటితోపాటు తుళు ఇంగ్లీషు అండ్ కమ్యూనికేషన్స్ స్కిల్స్ విభాగంతో ఒకవైపు విస్తరిస్తూ మరో వైపు ద్రవిడియన్ అండ్ కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్ విభాగం, ద్రావిడ తులనాత్మక సాహిత్యం అండ్ తత్త్వశాస్త్ర విభాగం, మరియు జానపద, గిరిజన విజ్ఞాన విభాగంతో కృషిని సాగిస్తుండగా వాటికి సరిధీటుగా బయోటెక్నాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ హ్యూమన్ రిసోర్స్‌లతో విస్తరణే లక్ష్యంగా విశ్వవిద్యాలయం పనిచేస్తున్నది.

బోధనాంగం, పరిపాలనాంగం, ప్రసారాంగం అనేవి విశ్వవిద్యాలయానికి ఉండవలసిన అంగత్రయం. 2005లో అప్పటి ఉపాధ్యక్షులు ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణగారు 'అనుసృజన', 'ప్రసారాంగ' అను రెండు విభాగాలను ప్రారంభించారు. ఈ మూడేళ్ళలో ఈ రెండు విభాగాలు ఇంచుమించు 140 గ్రంథాలను ప్రచురించి వాటి ఉనికిని నాలుగు దక్షిణాది రాష్ట్రాలలోను బలంగా చాటాయి.

ద్రావిడ విశ్వవిద్యాలయం ఏర్పడిన పదేళ్ళలోపే ద్రావిడ భాషా సాహిత్య సంస్కృతుల విషయంగా మహత్తర కృషిని మొదలు పెట్టింది.



Pages_Jan 2009.pmd 15 4/19/2011, 4:53 PM

అందుకు తార్కాణంగా వేమనను తుళు భాషీయులు, మళయాళీలు చదువుకుంటున్న విషయాన్ని ఇప్పుడు చూడవచ్చు. ఒక్క వేమననే కాదు వీరేశలింగం జీవిత చరిత్రను, ఆచంట జానకిరాంగారి ఆత్మకథలను, కృష్ణశాస్త్రిగారి భావకవిత్వాన్ని, శ్రీశ్రీ, తిలక్‌లను, కొడవటిగంటి కుటుంబరావును, చలం, విశ్వనాథలను, నేలటూరి వేంకటరమణయ్యగారి శ్రీకృష్ణదేవరాయలు రచనను, ఆంధ్రదేశంలోని ఆటలను, చరిత్ర, సంస్కృతి, కళలు సమస్త విషయాలను తమిళ, కన్నడ, మళయాళ భాషల్లో చదువుకోగలుగుతున్నారు. అలాగే తమిళ, కన్నడ, మళయాళ భాషల్లోని సుప్రసిద్ధ రచయితలు, కవులు, కావ్యాలు, కథలు, నవలలు, నాటకాలు, యాత్రా రచనలు, కావ్యపీఠికలు, భాషా వ్యాకరణాదులు, సంగీత, సాహిత్య శాస్త్రగ్రంథాలు ఒకటేమిటి అన్నిటినీ అపూర్వమూ, అరుదైన వాటినీ ద్రావిడ భాషీయులు వారి వారి భాషల్లో చదువుకునేందుకు సోదర ద్రావిడ భాషల్లోని ఉత్తమ రచనలను, గ్రంథాలను సమర్థులయిన వారిచేత అనువదింపజేయించి ప్రచురించే పనికి పూనుకుంది ద్రావిడ విశ్వవిద్యాలయం.




ద్రావిడ భాషీయుల మధ్య ఈ అనువాదాల ద్వారా మరింతగా సాంస్కృతిక సాహిత్య వికాసంలో ద్రావిడ భాషా సాహిత్య సంస్కృతులకు ఉన్న ప్రాధాన్యాన్ని అటు ఔత్తరాహులతోపాటు, ఇటు ద్రావిడ భాషీయులు గుర్తించేట్లు చేయటం. భావ సమైక్యతను దృఢంగా పెంచడానికి, సాధించడానికి ఈ విశ్వవిద్యాలయం నిర్వర్తిస్తున్న పాత్ర ఎంతో కీలకమైంది. మొత్తం భారతీయ సంస్కృతిలో ద్రావిడ సంస్కృతికి ఉన్న పాత్రను, అది చేసిన దోహదాన్ని, దానికి ఉన్న ఔన్నత్యాన్ని దక్కవలసిన సముచిత గౌరవాన్ని దక్కించుకోవటంలోనూ, దక్కించుకునేందుకు సాగాల్సిన ప్రయత్న పరంపరలను ద్రావిడ భాషీయుల గుర్తింపులోకి తెచ్చి వారికి కర్తవ్య నిర్దేశంచేసే పనిలోనూ నిమగ్నమైంది.

కృష్ణశాస్త్రిగారి కవిత్వానికి ఇంద్రగంటి కిరణ్మయి, బాలాంత్రపు రజనీకాంతరావు గారి అన్నమయ్య పద షష్టి ఆంగ్లానువాదాలకూ వేగుంట మోహనప్రసాద్ సంపాదకత్వం నవలలు, కథలు, జీవిత చరిత్రలు, స్వీయ చరిత్రలు లాంటి మూల గ్రంథాలను అందజేసిన సంగ్రహీకరణం సాహితీవేత్తల సంచలన చర్చలకు పాత్రమయ్యాయి. అలాగే ఇతర ద్రావిడ భాషలనుండి తెలుగులోకి, తెలుగునుండి ఇరుగుపొరుగు భాషల్లోకి అనువాదాలు జరుగుతూ ఆయా భాషల్లో ఆదరణ పాత్రమవుతున్నాయి. రాబోయే రోజుల్లో కాబోయే అనువాదాల గురించి ముఖ్యంగా బుచ్చిబాబు, చలం, రావిశాస్త్రి 20వ శతాబ్ది తెలుగు కవిత్వాన్ని, కవిత్వ గాఢతని పట్టిచూపే వంత కవితల ఆంగ్లానువాదం గురించి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. ఆయా రచనల ప్రాశస్త్యాన్ని ద్రావిడ వీధులలో సాహిత్య పథికులతో ముచ్చట్లుగా చెపుతూ చిరునవ్వులు చిందుతున్నాయి.

అనుసృజన అనువాదాలను చేయిస్తే, అనుబంధంగా అటు విశ్వవిద్యాలయానికి, ఇటు సాహిత్య ప్రపంచానికి ఒక వారధిగా 'ప్రసారాంగ' ప్రచురణలు మరియు విస్తరణ సేవల విభాగం విశ్వవిద్యాలయం ఉద్దేశించిన లక్ష్యాలకోసం పనిచేస్తున్నది. అనుసృజన-ప్రసారాంగల సంయుక్త కృషి ఫలితంగా ఇప్పటికే అనేక రచనలు వెలుగు చూశాయి. ప్రసారాంగ స్థాపన ప్రధాన ఉద్దేశం ప్రచురణ ఒక్కటే కాదు. ప్రచురిత సాహిత్యాన్ని ఆయా భాషీయుల దాకా చేర్చటం. తద్వారా ద్రావిడ భాషా సాహిత్య సంస్కృతుల పట్ల ఒక సదవగాహనను పెంచటం. విశ్వవిద్యాలయ స్థాయిలో జరిగే బోధన పరిశోధనలు అక్కడితోనే ఆగిపోకుండా ఆయా పరిశోధనలు ప్రాజెక్టుల నివేదికలను కూడా ఉత్తమ ప్రమాణాలతో ప్రచురించి వాటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చే అవిరళ కృషి చేస్తోంది. విశ్వవిద్యాలయంలో జరుగుతున్న బౌద్ధిక పరిశ్రమ ఫలం మేధావుల పరిధిలోనే మిగిలిపోకుండా ఆ అధ్యయన ఫలాలు అందరికీ అందాలని సంకల్పించుకుంటున్నది ప్రసారాంగ.

బహుభాషలు, బహు సంస్కృతులు, బహుళ సాహిత్యాలు కలిగి ఉన్న భారతీయ సమాజంలోనూ, భారతీయ సంస్కృతిలోనూ ద్రావిడ సంస్కృతి ఒక అంతర్భాగమని, ద్రావిడ సంస్కృతి విహితంగా భారతీయ సంస్కృతీ వికాసాలు పరిపూర్ణం కాదని మనమందరం చెప్పగలగాలి. అనేకతలు అనేవి సాంస్కృతికంగా గానీ, సాహిత్యపరంగాగానీ ఒకే తానులోని వివిధానేక వర్ణాలతో కూడిన దారాలని, జాతీయ సమైక్యతను సాధించాలంటే భిన్న సంస్కృతీ సాహిత్యాల మధ్య ఉండే వైవిధ్యాలను వైరుధ్యాలుగా భావించకుండా భాష, ప్రాంత, సాహిత్య పరిమితులను పరస్పరం అవగతం చేసుకుంటూ తమని తాము విశాల పరచుకునేందుకు చోదకశక్తిగా నిలబడాలని 'ప్రసారాంగ' ను నిలబెట్టుకోవాలని ద్రావిడ విశ్వవిద్యాలయం ఆకాంక్షిస్తున్నది.

ప్రస్తుత ఉపాధ్యక్షులు ఆచార్య కడప రమణయ్య ద్రావిడ విశ్వవిద్యాలయ అభివృద్ధికి విశేషమైన కృషిని మొదలు పెట్టారు. విద్యాబోధన, పరిశోధనలకు సమధిక ప్రాధాన్యమిచ్చి 'ప్రసారాంగ' ద్వారా విశ్వవిద్యాలయ సేవలను మరింత సమాజానికి చేరువ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

తొలి తమిళ నవలను ప్రస్తుతం తెలుగు వారు 'ప్రతాపమొదలియార్ చరిత్ర' గా అనువాద రూపంలో చదువుకోవచ్చు. కన్నడిగులు వీరేశలింగం జీవిత చరిత్రని సంక్షిప్తంగా చదువుకుంటారు. తమిళులు ప్రకాశం పంతులుగారిని, మళయాళీలు ఆంధ్ర శబ్దచింతామణిని, తుళు భాషీయులు తెలుగు వేమనను చదువుతున్నారు. 'అనుసృజన' విభాగం మదర్ టంగ్ టు అదర్ టంగ్ అని నినదిస్తుండగా 'ప్రసారాంగ' నాలుగు రెక్కలతో నలుదిక్కులకూ .... అంటూ ద్రావిడులది అధ్యయన సంస్కృతి, అభ్యసన సంస్కృతి అని నాలుగు రాష్ట్రాలలోనూ పుస్తకావిష్కరణల ద్వారా సాహిత్య సదస్సుల ద్వారా నిరూపిస్తున్నది. ◆



Pages_Jan 2009.pmd 16 4/19/2011, 4:53 PM

# యుద్ధనగారా

**మఉని**



కానరాని కాలనాగులు
కాలకూట విషాన్ని వెదజల్లుతున్నాయి
విద్వేషాల విస్ఫోటాలతో ఉగ్రవాదం
వేయి తలల విషసర్పమై
విలయతాండవం చేస్తున్నది
◆
ఆర్డీయక్స్‌ల రాక్షస క్రీడలో
అశువులు బాసే అమాయక జీవులు
శతఘ్నుల శబ్దాల ధాటికి
శవాల గుట్టలుగా మారే నగటు
మానవుడు
ఎక్కుపెట్టిన ఏకేల తూటాలకు
తలలెగిరిన విగత జీవులు
◆
లక్ష్యంలేని లాసం
లయతప్పిన తీవ్రవాదం
క్షణం క్షణం భయం
అనాగరికం వైపా ఈ సమాజ పయనం
◆
కులమతాల ఇనుపతెరలు
మానవత్వాన్ని మరుగు పరుస్తున్నాయి
వేర్పాటువాద ఉక్కుగోడలు
సమసమాజం పై నమ్మెట
దెబ్బలయినాయి
◆
విధ్వంసంపై విమర్శలు కాదు ఇప్పుడు
కావల్సింది
ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపే శక్తులు
కలవాలి
ప్రజలంతా శక్తులు నిండిన సైనికులై
కదలాలి
తీవ్రవాదంపై తిరుగులేని యుద్ధనగారా
మ్రోగించాలి

---

# వేకువ తంత్రులు



**కుమారస్వామి**

నా చుట్టూ చీకటి ఆవరించేవుంది
నేను దీపం కోసం వెదుకుతున్నాను
చీకట్లోంచి చిమ్మ చీకట్లోకి
నను తోసేస్తున్నదెవరో?
అయినా నేను వెలుగు కోసం
పరితపిస్తూనే ఉన్నాను
నా దాహం తీర్చే సెలయేర్లు లేవు
నా పైర్లకు కళకళలాడే జలధారలు లేవు
అయినా సుజల స్రవంతులకోసం నేనెప్పుడూ
ఆరాటపడుతూనే వుంటాను
నాబతుకు వృక్షంలో ఆశలు చివురుటాకుల్లా
మొలుస్తూనే ఉంటాయి
కష్టజీవుల కలల సౌధపు నిర్మాణాలసలే లేవు
నాముందు మగ్గాల వురితాళ్ళు
వేలాడుతున్నాయి
మళ్ళీమళ్ళీ పిలిచే భేతాళునిలా
ఆహ్వానం పలుకుతూనే ఉన్నాయి
నాలో విశ్వాసపు ఛాయలు మసక
బారలేదు
నేనిప్పుడు కొత్తస్వరం కోసం
గొంతు సవరించుకుంటున్నాను
మార్గం ముళ్ళబాటైనపుడు
రక్త తర్పణం కోసం వెనుకాడను
రేపటి స్వప్నంకోసం
నేను సమూహాన్నై కదులుతాను
వేయి తంత్రులై శ్రామిక వీణను
మ్రోగిస్తాను

---



# దుర్భర(అ) దృశ్యం

**కటుకోఝ్వల రమేష్**

కళ్ళల్లో వొత్తులేసుకుని
ఓ జీవితకాల నిరీక్షణ
అంతా కోల్పోయాక
అంటరాని వసంతం
ఎన్ని రంగుల్ని పులుముకుందో...

కళ్ళల్లో పొడుచుకున్న
ఇంద్ర ధనస్సులు
కన్నీళ్ళై రాలిపోతున్నాయి
నేలలో ఇంకిన దుఃఖం
మట్టివాసనై
వొళ్ళంతా అలుముకుంటుంది
మనసును గట్టిగా పిండుకుంటే
బాధల సమూహాలే అన్నీ
ఎందుకీ పరాధీనత!?

నా వెనుక
ఏడుతరాల్ని ప్రశ్నించాలిపుడు
రోజూ భుజం తట్టే
నా సహవాసి
ఆక్రోశంగా... ఆవేశంగా...
పుటలు పుటలుగా నన్ను
తరుముతూనే వున్నాడు
మెదడు పొరల్లో... గుండె అరల్లో...
పరుగెత్తీ ... పరుగెత్తీ...
నా కలం ఇప్పుడు
తిరుగుబాటును లిఖిస్తుంది
అరాచక దృశ్యంపై అక్షరాన్ని
సంధిస్తుంది
ఓ చిన్నారి మరణ మృదంగపు
దీర్ఘ శ్రుతి నా ఎదుటే
నవ్వుల పువ్వుల్ని చిదుముతూ
పసిమొగ్గలపై బూచీల పంజా
బీభత్సంగా భయానకంగా
భూమ్మీదే ప్యాండిమోనియం
ఖాళీ మెదళ్ళన్నీ అక్కడే
వికృతంగా విశృంఖలంగా

పరం పరానుగత స్మృతిలో
అన్‌రికార్డెడ్ దుర్భర దృశ్యం
అస్పష్టంగా అనాకారంగా
ది గ్రేట్ ఎస్కేప్ గా
ఆలీబాబా నలభై దొంగలు
అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ...



Pages_Jan 2009.pmd 17 4/19/2011, 4:53 PM

పరిశోధన

# తులనాత్మక అధ్యయనం - ఒక ప్రస్తావన

**ఒక అంశంపైన లేదా ఒక హిందీ రచయిత సాహిత్యంపైన పరిశోధన చేయడమే మోయలేని భారంగా ఉండడం వల్ల, తులనాత్మక అధ్యయనం జోలికి ఎవ్వరూ వెళ్ళడం లేదు. దాన్ని ప్రోత్సహించే పథప్రవర్తకులు కూడా లేరు! సముద్రపు టలల్లా చెలరేగవలసిన విద్యార్థులు మానసికంగా క్రుంగిపోయినట్లు కనిపిస్తారు. తులనాత్మక అధ్యయనాలు జరగకపోవడం, విషాద స్థితినే సూచిస్తుంది. నిజానికి, తులనాత్మక అధ్యయనం పట్ల అంత భయపడిపోవాల్సిన అవసరం లేదు.**

**జయంతి పాపారావు**

**1. పరిచయం:**

తులనాత్మక అధ్యయనం గురించి విశ్వవిద్యాలయ హిందీ విభాగ పరిశోధక విద్యార్థుల అవగాహన కోసం ఈ వ్యాసంలో చిన్న ప్రయత్నం చేయడమైంది. సువిశాలమైన మనదేశంలో విభిన్నత ఉంది. విభిన్నత వెనుక భౌగోళిక, చారిత్రక, రాజకీయ, సామాజిక నేపథ్యం ఉంది. అటువంటి నేపథ్యంలో వివిధ ప్రాంత ప్రజలు ఎవరికి ఏ జీవన విధానం అనుకూలంగా ఉందో, ఆ జీవన విధానాన్ని ఏర్పర్చుకున్నారు. విభిన్న జీవన విధానాల్లోంచి విభిన్నమైన సంస్కృతీ సంప్రదాయాల రూపుదిద్దుకున్నాయి. విభిన్నమైన భాషలు ఏర్పడ్డాయి. సంస్కృతికి మూలం భాషలోనే ఉంది. సంస్కృతీ సంప్రదాయాలు, కళలూ, భాషలోంచి వచ్చి విశ్వవ్యాప్తమౌతాయి. భాష మానవజాతి మనుగడకూ, అభివృద్ధికీ ఓ గొప్ప సాంస్కృతిక శక్తి. భాషలోంచి సాహిత్య కళ ఆవిర్భవించింది. భాషవల్ల సాహిత్య కళ, సాహిత్య కళ వల్ల భాష, పరస్పరం సహకరించుకుంటూ ఉన్నత శిఖరాలు అధిరోహిస్తాయి.

మనదేశంలో, మన జాతిలో, ఓ గొప్ప సాంస్కృతిక శక్తి ఉంది. ఆ శక్తిని మన ప్రజలు నిర్మించారు. శాంతియుత సక్రమ సామరస్య సహజీవన విధానాన్ని నిర్మించారు. ప్రజలు ఎప్పుడూ శాంతినే కోరుకుంటారు. ఆ మౌలిక లక్ష్యంలోంచి శాంతియుత సక్రమ సామరస్య సహజీవన విధానం రూపదిద్దుకుంది. శాంతియుత సక్రమ సామరస్య సహజీవన విధానమే 'సంస్కృతి' అవుతుంది. శాంతియుత సక్రమ సామరస్య సహజీవన విధానాన్ని దృఢంగా నిలబెట్టుకుంటూ, వికసింప జేసుకుంటూ, వైవిధ్య భరితం చేసుకుంటూ, ముందుకు సాగడానికి, అందులోంచే వచ్చిన 'సంస్కృతి' దానికి సహకరించే శక్తిగా బలపడుతుంది. 'సంస్కృతి' ప్రజల్లోకి వెళ్ళడానికి, ప్రజల్లో వ్యాప్తి చెందడానికి, కళలను సృష్టించుకుంటుంది. కళలు, సంస్కృతికి ప్రచార పరికరాలుగా, ప్రజల మనసులో, ప్రజల ఆలోచనా విధానంలో, జీవన విధానంలో, సుస్థిర స్థానం కలిగి ఉంటాయి.

సాహిత్యం శక్తిమంతమైన కళారూపం. మన ప్రజలు నిర్మించుకున్న శాంతియుత సక్రమ సామరస్య సహజీవన విధానం వల్ల, 'భిన్నత్వం'లో 'ఏకత్వం' నిర్మింపబడింది. 'ఏకత్వం' ఎంత బలపడితే, అంతగొప్ప శాంతియుత సక్రమ సామరస్య సహజీవన విధానం ప్రజలకు లభిస్తుంది. 'ఏకత్వ' నిర్మాణం, 'ఏకత్వ' సుస్థిరీకరణ, శాశ్వతీకరణ, 'సంస్కృతి' ముందున్న మహోన్నత లక్ష్యం.

ఆ లక్ష్యసాధనలో కళలు శక్తిమంతమైన సాధనాలుగా పనిచేస్తాయి. సాహితీకళ విస్తృతమైంది. అన్ని వర్గాల ప్రజలకూ, అన్ని స్థాయిల చదువరులకూ అందుబాటులో ఉంటుంది. అందువల్ల సాహితీ కళ 'సంస్కృతి' కి ఆయువు పట్టుగా ఉండి, ప్రాణవాయువులా అంతటా తేలిగ్గా వ్యాపిస్తుంది. సంస్కృతి నిర్దేశిస్తున్న 'ఏకత్వం' లక్ష్యసాధనలో సాహితీ కళ మహోన్నతమైన, అంతేకాకుండా శక్తిమంతమైన పాత్ర పోషిస్తుంది.

శాంతియుత సామరస్య సహజీవనాన్ని కోరుకుంటున్న మన ప్రజలు సహజీవన విలువల విషయంలో, మానవ సంబంధాల విషయంలో ఉన్నతమైన, అంతేకాకుండా దృఢమైన నిర్మాణాలు నిర్మించారు. మనదేశంలోని 'విభిన్నత్వాన్ని' 'వైవిధ్యం' గా మలిచారు. 'విభిన్నత్వం' 'వైరుధ్యం' గా మారకుండా అడ్డుకున్నారు. ప్రజలు నిర్మించిన 'వైవిధ్యం', శాంతియుత సామరస్య సహజీవనాన్ని నడిపే సాంస్కృతిక శక్తిగా స్థిరపడేటట్లు చేశారు. మన ప్రజా జీవనంలో ఉన్న గొప్పతనం అదేనని మనం చారిత్రకంగా గుర్తించగలం.

ఈ వైవిధ్య నిర్మాణం సామరస్య సహజీవనాన్ని ఉన్నతీకరించడంలో బహుముఖంగా ఉపయోగపడుతుంది. ఒక ప్రాంత ప్రజాజీవనాన్ని మరో ప్రాంత ప్రజా జీవనంతో పోల్చుకోవడం వల్ల, రెండు ప్రాంతాల ప్రజా జీవనం ఇచ్చిపుచ్చుకునే విధానంలో మెరుగుపడుతుంది. ఒక ప్రాంత ప్రజాజీవనంలోని మంచిని, మరోప్రాంత ప్రజాజీవన విధానం నేర్చుకుంటుంది. లోపాలను గుర్తించి తొలగించుకుంటుంది. ఆ విధంగా సహజీవన విలువల సమున్నతీకరణ అంతటా జరుగుతుంది. ప్రజా జీవనం, మూసపోత విధానంగా, యాంత్రిక జీవన విధానంగా పతనమై పోకుండా, 'వైవిధ్యత' బలమైన శక్తిగా పనిచేస్తుంది.

ఈ 'వైవిధ్యత' పలు మార్గాల్లో అన్ని ప్రాంతాలకూ విస్తరిస్తూ వైవిధ్యభరితమవుతూ ఉంటుంది. ప్రజా జీవనాన్ని వైవిధ్యభరితం చేస్తూ ఉంటుంది. 'వైవిధ్యత' 'వైరుధ్యం' గా మారకుండ కాపాడుకోగలిగితే, అది 'ఏకత్వం' సాధనగా నిర్మాణశీలంగా బలపడుతుంది. వైవిధ్య వాహికలో, ప్రచారంలో, పలు



Pages_Jan 2009.pmd 18 4/19/2011, 4:53 PM

మాధ్యమాలు పనిచేస్తాయి. అన్ని కళారూపాలు తమవంతు పాత్రను పోషిస్తాయి. సాహితీకళ గొప్ప పాత్రను పోషిస్తుంది.

సాహితీ కళా ప్రక్రియల్లో 'తులనాత్మక అధ్యయనం' ప్రత్యేకమైంది. పరిశోధనాత్మకమైంది. శాస్త్రీయమైంది. అందువల్ల, విశ్వసనీయమైంది.

### 2. అవగాహనా విధానం

తులనాత్మక అధ్యయనం గురించి, సంక్లిష్టమైన అంశాల్లోకి తలదూర్చకుండా, అవగాహన చేసుకునే ప్రయత్నం చేద్దాం.

ఒక సహజీవనాంశం లేదా ఒక ప్రజాసమస్య, విభిన్నమైన ప్రాంతల్లో, విభిన్నమైన భాషల్లో ఏవిధంగా సాహిత్యీకరింపబడింది? అలాగే ప్రజా జీవనంలోని మానవసంబంధాల గురించి, లేదా ప్రజా సమస్య గురించి విభిన్న ప్రాంతాలకూ, విభిన్న భాషలకూ చెందిన ఇద్దరు లేదా కొందరు రచయితలు ఏవిధంగా స్పందించి రచించారు? ఈ విధంగా వాస్తవాల్ని పరిశోధించడానికి 'తులనాత్మక అధ్యయనం' చేయాల్సి వస్తుంది. ఈ విధంగా ఎన్నెన్నో అంశాలపైన లేదా ప్రజా సమస్యలపైనా 'తులనాత్మక అధ్యయనం' చేయొచ్చు. వరకట్న నిర్మూలనంపైన, కుల నిర్మూలనంపైన, వర్గ నిర్మూలనంపైన, మత నిర్మూలనంపైన, పురుషాధిక్యతా నిర్మూలనంపైన, దోపిడీ నిర్మూలనంపైన, ప్రాంతాయ అసమానతలపైన, మానవ సంబంధాలపైన, ప్రత్యేక ఆర్థిక మండలీకరణ పైన, నిర్వాసీకరణపైన – ఆ విధంగా ప్రతి అంశంపైన, ప్రతి ప్రజా సమస్యపైన, 'తులనాత్మక అధ్యయనం' చేయొచ్చు. అయితే, 'తులనాత్మక అధ్యయనం' చాలా అరుదుగా ఎక్కడో కానీ జరగలేదనే వాస్తవాన్ని విస్మరించలేం.

### 3. ఎంపిక విధానం

తులనాత్మక సాహిత్యాధ్యయనానికి సంబంధించిన కొన్ని ప్రాథమిక అంశాల గురించి సూచనప్రాయంగా చెప్పుకుందాం.

1. అంశం లేదా సమస్య విభిన్న ప్రాంతాలకు చెందినవై ఉండాలి. 2. రచయితలు విభిన్న ప్రాంతాలకూ, విభిన్న భాషలకూ చెందినవారై ఉండాలి. 3. సాహిత్య ప్రక్రియలు ఒకే విధమైనవిగా ఉండాలి. కవిత్వ ప్రక్రియనూ, కథానికా ప్రక్రియనూ తులనాత్మకంగా అధ్యయనం చేయలేం. అలాగే వచన సాహిత్యాన్ని, పద్య కవితా సాహిత్యాన్ని తులనాత్మకంగా అధ్యయనం చేయలేం. 4. ఒకే విధమైన సాహిత్య ప్రమాణాలనూ, సాధనాలనూ ఉపయోగించి విశ్లేషించాల్సి ఉంటుంది. 5. సాహిత్య రచనాకాలం సమకాలీనమైనదిగా ఉండాలి. 6. భావజాల సారూప్యత ఉన్న రచయితల సాహిత్యం సముచితంగా ఉంటుంది. 7. పరిశోధక విద్యార్థికి ఆ భాషలపైన పట్టు ఉండాలి. ఇటువంటి ప్రాథమిక అంశాలను దృష్టిలో పెట్టుకుని, పరిశోధనకు సరైన ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

### 4.వాస్తవ పరిస్థితి:

పరిశోధక విద్యార్థులు తులనాత్మక అధ్యయనం పట్ల మొగ్గు చూపరు. దానికి చాలా కారణాలున్నాయి. కొన్నింటిని స్పృశించి చూద్దాం. తెలుగు రచయితల వివరాలూ, వారి రచనల వివరాలూ పరిశోధక విద్యార్థులకు లభ్యంగా లేవు. అలాగే హిందీ రచయితల వివరాలు, వారి రచనల వివరాలూ కూడా లభ్యంగా ఉండవు. హిందీ రచయితల రచనల సేకరణలో కూడా ఇబ్బంది ఉంది. విద్యార్థుల కష్టాలు ఇక్కడే మొదలవుతాయి. ఏ విషయంపైన లేదా ఏ హిందీ రచయిత సాహిత్యంపైన పరిశోధన చేయాలన్న విషయం అంతుపట్టని పరిస్థితి ఉంది. సమాచారం లభ్యం కాకపోవడం వల్ల, పథప్రవక్త ఆచార్యుల చెప్పిన ఏదో విషయంపైన లేదా ఏదో రచయిత సాహిత్యం పైనే పరిశోధన చేయక తప్పని పరిస్థితి ఉంది. అంతేకాకుండా, వారివద్ద కూడా వర్తమాన సమాచారం ఉండదు. అందువల్ల, దంపిన పిండే మళ్ళీ దంపక తప్పని పరిస్థితి ఉంది. ఆ పరిశోధన కూడా ఇదివరకు వారు ఏవిధంగా పరిశోధన చేయించారో, అదే పద్ధతిలో, మొక్కుబడి పద్ధతిలో, చేయక తప్పని పరిస్థితి ఉంది. అందువల్ల, గర్వంగా చెప్పుకోదగిన గొప్ప పరిశోధనకు అవకాశమే లేకుండా పోయింది. ఒక అంశంపైన లేదా ఒక హిందీ రచయిత సాహిత్యంపైన పరిశోధన చేయడమే మోయలేని భారంగా ఉండడం వల్ల, తులనాత్మక అధ్యయనం జోలికి ఎవ్వరూ వెళ్ళడం లేదు. దాన్ని ప్రోత్సహించే పథప్రవర్తకులు కూడా లేరు! సముద్రపు టలల్లా చెలరేగవలసిన విద్యార్థులు మానసికంగా క్రుంగిపోయినట్లు కనిపిస్తారు. తులనాత్మక అధ్యయనాలు జరగకపోవడం, విషాద స్థితినే సూచిస్తుంది. నిజానికి, తులనాత్మక అధ్యయనం పట్ల అంత భయపడిపోవాల్సిన అవసరం లేదు. ఒక అంశం లేదా ఒక పరిణామం లేదా ఒక ప్రజా సమస్య వంటి అంశాలను పరిశోధనకు స్వీకరించడం, అన్ని భాషా సాహిత్యాల్లోనూ కూడా ఇంచుమించుగా పక్కన పెట్టేశారు. అందువల్ల, ఇక్కడ ఇద్దరు రచయితల తులనాత్మక సాహిత్యాధ్యయనం గురించి కాస్త వివరించుకుందాం.

### 5. పరిశీలనా విధానం

ఇద్దరు రచయితలు, వారి సాహిత్య యాత్రను, ఒకరి పక్కన మరొకరు నడుచుకుంటూ, ప్రారంభదశ నుంచి ఒకరికొకరు చెప్పుకుంటూ పోతూ, సాహిత్యయాత్రలోని మజిలీలు, పరిణామాలు దగ్గర కాస్త ఆగి, సమీక్షించుకుంటూ ముందుకు పోతూ ఉంటే ఏమౌతుంది? వారి సాహిత్య యాత్రలోని భావజాల సారూప్యతనూ, సామీప్యతనూ, విభిన్నతనూ, వాటి వెనుకనున్న కారణాలనూ విశ్లేషించుకుంటూ పోతే ఏమౌతుంది? ఆ దృశ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఇద్దరి రచయితల సాహిత్యాన్ని, ఒకదాని పక్కన మరొకటి పెట్టి, యాత్రా క్రమంలో అధ్యయనం చేస్తే ఏమౌతుంది? అది 'తులనాత్మక అధ్యయనం' అవుతుంది. ఒక రచయిత సాహిత్య అధ్యయనంలో ఏ పద్ధతిని, ఏ విధానాన్ని, ఏ ప్రమాణాలను ఉపయోగించి విశ్లేషిస్తామో, ఆ విధంగానే 'తులనాత్మక అధ్యయనం' లో ఇద్దరి రచయితల సాహిత్యాధ్యయనం జరుగుతుంది. పిమ్మట, వారి సాహిత్య దృక్పథంలో, సాహిత్య లక్ష్యంలో, రచనా విధానంలో, ప్రజా జీవన చిత్రణలో– ఆ విధంగా అధ్యయనం చేసిన అన్ని అంశాల్లో, ప్రమాణాలను ఉపయోగించి, సారూప్యతనూ, సామీప్యతనూ, విభిన్నతనూ,



Pages_Jan 2009.pmd 19 4/19/2011, 4:53 PM

అలాగే వాటి వెనుకనున్న కారణాలనూ గుర్తించి, సారాంశాన్ని సూత్రీకరించాల్సి ఉంటుంది.

**6. పరిశోధనా విధానం:**

సిద్ధాంత గ్రంథ ప్రణాళికను సూచన ప్రాయంగా అవగాహన కోసం ప్రతిపాదించి, ఈ దిగువన సూచించడం జరిగింది. పరిశోధనంటేనే వినూత్న ఆవిష్కరణ. అది దృష్టిలో పెట్టుకుని, పరిశోధనకు స్వీకరించిన సాహిత్య స్వరూప స్వభావాల ఆధారంగా అతి శ్రద్ధతో ప్రణాళికను సక్రమంగా శాస్త్రీయంగా రూపకల్పన చేసుకుంటే, పరిశోధన చురుగ్గా ప్రయోజనకరంగా సాగుతుంది.

**సిద్ధాంత గ్రంథ ప్రణాళిక**
**తులనాత్మక అధ్యయనం**
**(తెలుగు-హిందీ)**
**అన్వేషణరావు - శోధనా చైతన్య**

◆ ◆ ◆

1. (i) . **తులనాత్మక అధ్యయనం - ఒక ప్రస్తావన**
1. (ii) . **అన్వేషణరావు శోధనా చైతన్యం జీవితం - సాహిత్యం**
1. **(అ) . అన్వేషణరావు - జీవితం**
1. 0. 1. పరిచయం
1. 0. 2. చదువు
1. 0. 3. ఉద్యోగం
1. 0. 4. వివాహం
1. 0. 5. వ్యక్తిత్వం
1. 1. 0 (అ) అన్వేషణరావు - సాహిత్యం
1. 1. 1 నేపథ్యం
1. 1. 2 రచనలు
1. **(ఆ) శోధనా చైతన్య- జీవితం**
1. 0. 1 పరిచయం
1. 0. 2 చదువు
1. 0. 3 ఉద్యోగం
1. 0. 4 వివాహం
1. 0. 5 వ్యక్తిత్వం
1. 1. 0 **(ఆ) శోధనా చైతన్య-సాహిత్యం**
1. 1. 1. నేపథ్యం
1. 1. 2. రచనలు
**1.అ. ఆ. తులనాత్మక విశ్లేషణ- జీవితం- సాహిత్యం**
(1) సారూప్యత
(2) సామీప్యత
(3) విభిన్నత
(4) సారాంశ నిర్ధారణ
**2. సాహిత్య దృక్పథం**
**2.1.0. (అ) అన్వేషణరావు - సాహిత్య దృక్పథం**
2.1.1. సాహిత్యం-పరిచయం
2.1.2. సాహిత్యం-సామాజిక ప్రయోజనం
2.1.3. సాహిత్యం-సమాజం
2.1.4. సాహిత్యం-జీవితం
2.1.5. వస్తువు-రూపం
2.1.6. శిల్పం-సాహిత్య విలువలు
**2.1.0 (ఆ) శోధనా చైతన్య -సాహిత్య దృక్పథం**
2.1.1. సాహిత్యం - పరిచయం
2.1.2. సాహిత్యం-సామాజిక ప్రయోజనం
2.1.3. సాహిత్యం-సమాజం
2.1.4. సాహిత్యం-జీవితం
2.1.5. వస్తువు-రూపం
2.1.6. శిల్పం-సాహిత్య విలువలు
**2.అ.ఆ. తులనాత్మక విశ్లేషణ-సాహిత్య దృక్పథం**
(1) సారూపత్యం
(2) సామీప్యత
(3) విభిన్నత
(4) సారాంశ నిర్ధారణ
**3. కథాలోక దర్శనం**
**3.1.0. (అ) అన్వేషణరావు-కథాలోక దర్శనం**
3.1.1. కథాలోక దర్శనం- పరిచయం
3.1.2. సంఘచైతన్యం
3.1.3. ప్రగతిశీల చైతన్యం
3.1.4. విప్లవ చైతన్యం
3.1.5. ప్రపంచీకరణ ప్రతిఘటన చైతన్యం
3.1.6. మానవ సంబంధాలు-సహజీవన చైతన్యం
3.1.7. తదితర అంశాలు-చైతన్యం
3.1.8. కథాలోక దర్శనం-సారాంశ నిర్ధారణ
**3.1.0. (ఆ) శోధనా చైతన్య-కథాలోక దర్శనం**
3.1.1. కథాలోక దర్శనం-పరిచయం
3.1.2. సంఘచైతన్యం
3.1.3. ప్రగతిశీల చైతన్యం
3.1.4. విప్లవ చైతన్యం
3.1.5. ప్రపంచీకరణ ప్రతిఘటన చైతన్యం
3.1.6. మానవ సంబంధాలు-సహజీవన చైతన్యం
3.1.7. తదితర అంశాలు - చైతన్యం
3.1.8. కథాలోక దర్శనం-సారాంశ నిర్ధారణ
**3. అ. ఆ. తులనాత్మక విశ్లేషణ-కథాలోక దర్శనం**
(1) సారూపత్య
(2) సామీప్యత
(3) విభిన్నత
(4) సారాంశ నిర్ధారణ
**4. నవలా దర్శనం**
**4.1.0. (అ) అన్వేషణరావు - నవలా దర్శనం**
4.1.1. పరిచయం
4.1.2. కథాంశం
4.1.3. కథాకథనం
4.1.4. పాత్రల చిత్రీకరణ
4.1.5. నవలా శిల్పం



Pages_Jan 2009.pmd 20 4/19/2011, 4:53 PM

# నామధ్యేయం

**ఇందిర**

జానెడు జాగా కోసం
జెండా పట్టుకు
బయల్దేరింది భూదేవి!
సుడిగాలి
కిడ్నాప్ చెరలో
చిన్నారి సమీర!

జాత్యహంకారుల చేతిలో
భీతిల్లుతూంది
రాజ్యం!
ఇల్లు కోసం
కీళ్ళరిగేలా తిరుగుతూంది
ఇందిరమ్మ!

రాళ్ళు మోస్తూ
బతుకీడుస్తోంది
బాలరత్న!

# పసి వనాల్ని పడదొక్కుకుంటూ

**గేరా**




కాసేపు
మీ పుష్పవిలాపాల్ని పక్కనపెట్టి
ఇటు చూడండి
మొగ్గల బుగ్గలపై
కన్నీటి మరకలు
లేత రేకులపై
చెమట చారికలు
విరిసీ విరియని పరిమళాలపై
దుర్వాసుల దుర్గంధాలు
పచ్చనోట్లలో పత్రహరితాన్ని
కలగంటూ
పసిడివర్ణ పసివనాల్ని
పడదొక్కుకొంటూ
ఎడారి దిబ్బలవైపు
ఎవరికివారు ఒకటే
పరుగులు
పరుగెత్తి... పరుగెత్తి...
చివరికి
పోగొట్టుకొన్నదేదో
తెలిసే సరికి
ఎటుచూసినా ఎండమావులే
తప్ప
ఒయాసిస్సులు కూడా
మిగలవు!!

4.1.6. సందేశం
4.1.7. సారాంశ నిర్ధారణ
**4.1.0. (ఆ) శోధనా చైతన్య-నవలా దర్శనం**
4.1.1. పరిచయం
4.1.2. కథాంశం
4.1.3. కథాకథనం
4.1.4. పాత్రల చిత్రీకరణ
4.1.5. నవలా శిల్పం
4.1.6. సందేశం
4.1.7. సారాంశ నిర్ధారణ
**4.అ. (ఆ) తులనాత్మక విశ్లేషణ-నవలా దర్శనం**
(1) సారూప్యత
(2) సామీప్యత
(3) విభిన్నత
(4) సారాంశ నిర్ధారణ
**5. రచలను-తీరుతెన్నులు**
**5.1.0. (అ) అన్వేషణరావు రచనలు-తీరుతెన్నులు**
5.1.1. పరిచయం
5.1.2. భాషా శైలి
5.1.3. శిల్ప ప్రాధాన్యం
5.1.4. పాత్రల చిత్రణ
5.1.5. సంభాషణలు
5.1.6. వ్యక్తీకరణలు
5.1.7. వర్ణనలు
5.1.8. సన్నివేశ చిత్రణ
5.1.9. సారాంశ నిర్ధారణ
**5.1.0. (ఆ) శోధనా చైతన్య రచనలు-తీరుతెన్నులు**
5.1.1. పరిచయం
5.1.2. భాషా శైలి
5.1.3. శిల్ప ప్రాధాన్యం
5.1.4. పాత్రల చిత్రణ
5.1.5. సంభాషణలు
5.1.6. వ్యక్తీకరణలు
5.1.7. వర్ణనలు
5.1.8. సన్నివేశ చిత్రణ
5.1.9. సారాంశ నిర్ధారణ
**5. అ. తులనాత్మక విశ్లేషణ-రచనల తీరుతెన్నులు**
(1) సారూప్యత
(2) సామీప్యత
(3) విభిన్నత
(4) సారాంశ నిర్ధారణ
**6. తులనాత్మక అధ్యయనం-ఉపసంహారం**
6.1.అ. ఆ. ముగింపు వ్యాఖ్యానాలు
6.2.అ. ఆ. సూత్రీకరణలు
6.3.అ. ఆ. ముగింపు ప్రస్తావన
6.4.అ.(1) అన్వేషణరావు - ముఖాముఖి
6.4.అ. (2) శోధనా చైతన్య-ముఖాముఖి

**6. ముగింపు ప్రస్తావన:**

తులనాత్మక అధ్యయనం సామాజిక వాస్తవాలనూ, ప్రజా జీవన స్థితిగతులనూ, సాహిత్య విలువలనూ, పరిశోధించి, నిగ్గు తేల్చి, సూత్రీకరించి గ్రంథస్థం చేస్తుంది కాబట్టి విశ్వసనీయతను సమపార్జించుకుంటుంది. ఇది ప్రజల్లోకి వెళ్ళదు. అయితే, విద్యావంతులైన యువతరానికి అందుబాటులో ఉంటుంది. యువతరంలో, జాతి సమైక్యతకూ సమగ్రతకూ సౌభ్రాతృత్వానికీ శాంతియుత సామరస్య సహజీవన విలువలకూ ఉపకరించే చైతన్యాన్ని కలిగించి, వాటి ఉన్నతీకరణకు సహకరిస్తుంది. సాహిత్యాభివృద్ధి జరుగుతుంది. ◆



Pages_Jan 2009.pmd 21 4/19/2011, 4:53 PM

విశ్లేషణ

# వర్గ స్పృహకు నిలువెత్తు సాక్ష్యం - రావిశాస్త్రి సాహిత్యం



కొట్టి రామారావు

రావిశాస్త్రి తన రచనలకు ఒక ఆదర్శాన్ని నిర్దేశించుకున్నాడు. "రచయిత ప్రతివాడు తాను రాస్తున్నది ఏ మంచికి హాని కల్గిస్తుందో, ఏ చెడ్డకి ఉపకారం చేస్తుందో అని ఆలోచించవలసిన అవసరం ఉందని నేను తలుస్తాను. మంచికి హాని, చెడ్డకి సహాయమూ చేయకూడదని నేను భావిస్తాను.

ప్రపంచంలోని ఏ రచయిత అయినా ఇదే అదర్శంతో తన రచనలు చేస్తాడని మనం ఆశించాలి. తద్విరుద్ధంగా చేస్తే అది మంచికి హాని, చెడ్డకి సహాయమూ చేయవచ్చు. అప్పుడది నిజాయితీ అయిన రచన అనిపించుకోదు.

'మార్క్సిజం' గురించి చెబుతూ "మార్క్సిజాన్ని విమర్శించాలనే వారు నాలాంటి వాడి వ్యసనాన్ని చూపి మార్క్సిజాన్ని తిడతారు. వారు ఇలాంటి వాడిని చూపేకన్న నమ్మింది ఆచరించిన వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం మొదలగు వారి ఆదర్శం పాటించితే మంచిది. ఒక గొప్పవాడి గొప్ప మంచివాడు చెప్పినా చెడ్డవాడు చెప్పినా ఒక్కటే. అలానే మార్క్సిజం గొప్ప మార్క్సిజానిదే గాని చెప్పేవాడిని బట్టి మారదు"! అన్నారు.

సుఖ దుఃఖాలను రావిశాస్త్రి 'ఎండ' అనే కథలు: చూపిన విధానం చూడండి: అన్యాయం, దుఃఖం, ఆటవిక న్యాయం – వీటిని పేద శారదమ్మ పిల్లలను ఆవరించుకున్నవి, పాడుబడ్డ గదిలోని మబ్బులూ, వానా, చీకటీ, రొంపే, రొచ్చూ, ఈదురుగాలి ఇవే దుఃఖానికి, వేదనకీ ప్రతీకలు. ఇక ఆ పేదరాలి ఇంటికి కావలిసినవి ఏమిటి సుఖకారకాలు? అయిదేళ్ల పిల్ల దిగులు దిగులుగా 'అమ్మా! ఎండెప్పు డొస్తుందమ్మా?' అని అడుగుతుంది. అక్రమంగా శిక్షకు గురై జైలుకి వెళ్లిన నాన్న తిరిగిరాడు. చీకటినీ, చెమ్మదనాన్ని, నీడల్ని, భయాలజాడల్ని చీల్చుకుని వాళ్ల జీవితంలోకి ఆశాకిరణం ప్రసరించదు. ఎండా, సూర్యకిరణాలు ఇక్కడ సుఖహేతువులు. purpose of function on is not to educate but so entertine అన్నవాదం రావిశాస్త్రికి వర్తించదు. రాజారాం అన్నట్లు "ఆయన ఎడ్యుకేట్ చేస్తూనే ఎంటర్ టెయిన్ చెయ్యగలరు. ఎంటర్ టెయిన్ చేస్తూనే ఎడ్యుకేట్ చెయ్యగలరు"...

బల్లచెక్క అన్న కథలో లాభ నష్టాల గురించి రావిశాస్త్రి చాలా సూక్ష్మంగా చెప్పాడు. "ఒకడు నష్టపోతేనే ఇంకొకరికి లాభం" అనీ "కష్టపడ్డవాడు నష్టపోతేనే మిగతావాళ్లకి లాభాలు" అను. పెట్టుబడిదారు కష్టజీవుల కష్టాన్ని ఎలా దోచుకుంటున్నాడో ఈ కథలో రావిశాస్త్రి పై రెండు వాక్యాల్లోనూ విశదపరిచాడు. తలుపుగొళ్లెం: కథలో దోచుకు తినేవాడి గురించి చెప్పింది చదివితే ఎంత ధైర్యస్తుడికైనా భయం కలుగుతుంది. "దోచుకుతినడం బెస్టు" అనేటటువంటి పరమ ఘోరమైన నిశ్చయానికి ఏ మానవుడైనా వచ్చి సాహసంతో రంగంలోకి ఉరికి, మెలకువతో వ్యవహారించి, పట్టుదలతో పని చేస్తే!! – మరింకవాణ్ని ఆపడం చాలా కష్టం. వాడు చాలా దూరం వెళ్తాడు. చాలాపైకి వెళ్తాడు. పాపభీతి, దైవభీతి, సంఘభీతి, ఏ భీతీ ఉండదు, వాడికి వాడు పెద్ద పులిలా ఉంటూనే పరమ ధర్మరాజులా కన్పించగలడు. తన బాగుకోసం వాడి తల్లి గొంతు నొక్కగలడు. తండ్రి వెన్ను పొడవగలడు. తమ్ముడి నెత్తురు తాగ్గలడు. లొంగిన వాళ్లని వాడు అణుస్తాడు. లొంగని వాళ్లతో కలుస్తాడు. అవసరం తీరి పోయాక నివురంతా కప్పేసు కుంటాడు. దైవం, ధర్మం, అర్థం, కామం, సంఘం, స్వర్గం, అన్నీ తన కోసమే ఉన్నాయి. కాని తాను ఎవరి కోసమూ ఉండనంటాడు. చెదలాతినేస్తాడు. "పులిలా విరుచుకుపడతాడు. దేశాన్ని అమ్ముతాడు, ధర్మాన్ని చంపుతాడు – వాడు చాలా దూరం వెళ్తాడు....

ఇరాక్ మీద అమెరికా దండయాత్రనే మనాలి?

అమెరికాకు అయిల్ కావాలి. అది ఇరాక్ దగ్గరుంది సద్దాం అమెరికా చెప్పినట్టు వినడు, ఆయిల్ ఇవ్వడు. అంతే అమెరికా ఇరాక్‌ని కాటేసింది సర్వనాశనం చేసింది. ఆ దేశాధ్యక్షుణ్ణి తన మాట విననందుకు వేటాడి పట్టుకుని విచారణ డ్రామాతో ఉరితీసింది. రావిశాస్త్రి పైన చెప్పిన 'వ్యక్తి దుర్మార్గం' కన్న అమెరికా దేశపు దుర్మార్గం ఎన్నిరెట్లు ఎక్కువో...!

పెట్టుబడిదారీ వ్యవస్థ తన స్వలాభం కోసం, స్వార్థం కోసం ఎంతకైనా తెగిస్తుంది. నిన్న ఇరాక్‌ని కబళించిన అమెరికా ఇరాన్‌నీ మట్టుపెట్టడానికే ఉవ్విళ్లూరుతున్నది. మరో సంవత్సరం

పదవీకాలముంటే బుష్ ఇరాక్ మీదా దండయాత్ర చేయగలడు. ఇక్కడా అదే ప్రయోజనం.... ఆయిల్ ....ఆయిల్...

ఏ దేశమైనా తన చెప్పుచేతల్లోనే ఉండాలనేది ధనికస్వామ్య లక్షణం. చెప్పుచేతల్లో లేని ఏ దేశమైనా అది ప్రజాస్వామ్య దేశమా, మత దూరహంకారంతో కూడినదేశమైన, నియంతృత్వపాలనలో ఉన్న దేశమైనా అమెరికాకు అనవసరం. ఇంత స్నేహం నటిస్తూనే రేపు –పాపం శమించుగాక – ఇండియా అయినా తనకు ఎదురు తిరిగితే – అమెరికా సహించదు. ఏమైనా చేస్తుంది. గతంలో అమెరికా అన్యాయాల్ని ఎదుర్కొనే సోవియట్ యూనియన్ అంతరించడంతో అమెరికాకు ఎదురేలేకపోయింది ఈ వర్గ పోరాటాన్ని, స్వలాభం కోసం ఎటువంటి పంథాను అనుసరించాలి అనే విషయాన్ని రావిశాస్త్రి చాలా సైంటిఫిక్‌గా "గోవు లొస్తున్నాయి జాగ్రత్త'లో చూపిస్తాడు. తన ఉన్నత స్థితికి స్వార్థపు ప్రయోజనాన్ని కాపాడుకోవడానికి ఎంతకైనా తెగించే 'రాజయోగి పెదనాయనగారు' తన తమ్ముడి కొడుకు 'కిరిటి'తో జరిపే సంభాషణా ఆ కుర్రాడికి చేసే 'జ్ఞాన' బోధ గమనిస్తే ఈ సత్యం మనకు తేటతెల్లమవుతుంది. కిరీటి ఆలోచనలూ తన రాజయోగి పెదనాయన గారి పంథాలోనే ఉంటాయి...

కిరీటి ఒక చోట అంటాడు" అలగాజనం, వెధవల బెదిరింపులకు ప్రభువులు లొంగిపోవడం చాలా అన్యాయమూ, అసందర్భమూ అని నాకన్పిస్తుంది"

దేశభక్తుడు సత్యమూర్తి, రాజయోగి ఇద్దరూ ఖద్దరే ధరిస్తున్నారు. నిజాయితీ గల సత్యమూర్తి ఖద్దరు బట్టల్ని 'గాడిదరంగు' అనీ రాజయోగి ఖద్దరు బట్టల్ని 'పులి రంగు' అనీ రావిశాస్త్రి వర్ణిస్తాడు. మరొక అడుగుముందుకు వేసి రాజయోగి నుండి మధురవాసన వేస్తోంది. "పవర్ (అంటే అధికారానికి) ఒక విధమైన పరిమళం ఉంటుంది. సిరిసంపదలకి ఒక విధమైన సువాసన ఉంటుంది. ఈ రెండూ తరచు కలుస్తాయి" వర్గ దృక్పథాన్ని బట్టల్లోనూ చూపించ గలగడం రావిశాస్త్రి సైంటిఫిక్ ఎనాలిసిస్‌కి మచ్చుతునక!

ధనికుడికి పేదల మీద జాలి, దయ – అదే తన సంపాదనకూ దాన్ని నిలబెట్టుకోడానికి అడ్డుపడే పేదల మీద – ఉండరాదు. "కవులు ఆ విధంగా ఆవిడ మీద జాలిపడితే పడొచ్చు గాక మనం మాత్రం జాలిపడకూడదు. జాలి అనే పదార్థం మనకి (ధనవంతుడికి) చాలా ప్రమాదకరమైంది. ఎలకల్ని కరుణించే పిల్లులు, టెంపరరీగానీయినా పిల్లి జాతికి నీ 'వర్గ శత్రువులు'గా మారే ప్రమాదం ఉంది. మనజాలి మన సరిహద్దులు దాటకూడదు. కాని దానిలో హద్దులుదాటే ప్రమాదగుణం ఉంది. అందుచేత దాన్ని మనం కంట్రోల్లో ఉంచుకోవాలి''. రావిశాస్త్రికా భయం అక్కరలేదు. ధనికుడైన ప్రతివాడు, ధనికుడవ్వాలనుకున్న Shortcut లో ప్రతీవాడు మొట్టమొదటి విసర్జించేవి జాలి, దయ! రాజయోగి గారు కిరీటికి చెప్పే మాటలు' వినిపించడమే కాదు కనిపిస్తు న్నట్టు' కూడ అనిపించింది. బతుకులు జాతుల గురించి చెబుతూ 'ఎవరికైనా సరే బతుక్కు తగిన గుండెలుండాలి. బతుకుల్ని బట్టి జాతు లేర్పడతాయి. జాతులంటే కులాలు కాదు. జాతులు, బతికేమార్గం బట్టి ఏర్పడ్డ జాతులు''! అంటారు. ఈ రకమైన ఎనాలసిస్ రావిశాస్త్రి ఘనత! దీన్నే మరికాస్త సాగదీసి" బతుకులో బాగుపడే వాడెవడూ ''నేను మంచి వాణ్ణా, చెడ్డవాణ్ణా అని ప్రశ్నించుకోడు" "మరైతే ఏం చేస్తాడు?" "బాగుపడతాడంతే!"

జగన్నాథుడి గురించీ ఒక మాట చెప్పేరు రాజయోగి. "చరాచర జగత్తుతోనే మనకి సంబంధం కాని, ఉన్నాడాలేడా అనే దాని నాథుడితో కాదు. మన సంబంధాలు, మనుష్యులతోనే, జనంతోనే..." బాగు పడాలను కున్నవాడు భగవంతుడి గురించి కాక మనుష్యులను ఎలా లొంగదీసు కోవాలా అనేదే ముఖ్యం అని ధనవంతుడా లోచిస్తాడన్న మాట! "బతికే మార్గం బట్టి మనలో జాతులున్నా యని ఇంతకు ముందు చెప్పేనుకదా! అన్ని జీవరాసుల్లోను అవి రెండే రకాలు! రెండేరకాలంటే – తినేవి, తినబడేవి, చంపేవీ, చంపబడేవీ... కిరీటీ, నీకు ఏ రకం ఇష్టం? ఏ జాతిలో కలవాలనుంది? తినే జాతిలోనా, తినబడే జాతిలోనా? చంపే జాతిలోనా, చచ్చే జాతిలోనా?"

దీనికి కిరీటి మొదటి రకాన్నే ఎంచుకుంటాడనడంలో సందేహం లేదు. అంతకు ముందే చెప్పినట్టు అతడు (బ్రిటిష్ కాలం నాటి) పులి పిల్ల, సింహం పిల్ల...!

''జీవితం యదార్థం కాదు, మాయ అంటారు. అది అబద్ధం. జీవితం నిజం. అందులో బతికిచావడం నిజం..."

''అందులో చంపిచావడం నిజం. అందులో? సుఖం, నిజం, దుఃఖం ఎంతో నిజం.... బతికి చావడం నా కిష్టం లేదు. అందుచేత నేను చంపిబతుకుతాను. నాకు దుఃఖం ఇష్టం లేదు. సుఖాలే నా సుఖాలే నాకిష్టం. సుఖాన్నే నేను ప్రేమిస్తాను, కామిస్తాను. అందుకోసం ఏమైనా, ఏదైనా చేస్తాను.." ధనిక స్వామ్యపు ఆలోచనలకు ప్రతిరూపంగా రాజయోగిని రావిశాస్త్రి సృష్టించారు. ఈ వర్గపు ఆలోచనలు, ఆకాంక్షలు, సృష్టాది నుండి ఇదే రకంగా ఉన్నాయి.. ఉంటాయి... "చచ్చే జాతి చంపే జాతి మీద తిరగ బడకుండా' పరమజాగ్రత్తగా ఉండాలి.. బహుపరాక్‌గా ఉండాలి.. మనం పులులం. మనకి కత్తుల్లాంటి కోరలుండాలి. బాకుల్లాంటి గోళ్లుండాలి.." తిరగబడే, తిరగ బడటానికి అవకాశం ఉండే "గుర్రాలకి కళ్లేలుండాలి. పశువులకి పలుపు లుండాలి... మనకీ... పులలకీ గొలుసు లుండకూడదు చంపేజాతి చావకూడదు. చచ్చే జాతి బతకక్కాడదు. మనం జయించాలి... మనవే ఉండాలి....

ధనస్వామ్యంలో పులిలా బ్రతకడానికి రావిశాస్త్రి మూడు చిట్కాలు చెప్పించారు. రాజయెాగి చేత 1. గుండు దెబ్బకు దొరక్కు 2. ఎవరి బోనుకీ చిక్కకు 3. మేక కాలికి మొక్కకు...

వర్గ స్పృహని కథారూపంలో, పాత్రల రూపంలో, మధురాంతకం రాజారాం చెప్పినట్లు రావిశాస్త్రి "ఎడ్యుకేట్ చేస్తూనే ఎంటర్‌టెయిన్ చెయ్యగలరు. ఎంటర్‌టెయిన్ చేస్తూనే ఎడ్యుకేట్ చెయ్య గలరు" ఇంత గొప్ప రచయిత, తెలుగులో ఇప్పటి వరకు రాలేదని నేను దృఢంగా నమ్ముతున్నాను.

●



Pages_Jan 2009.pmd 23 4/19/2011, 4:53 PM

# కొన్ని వేళలలో కొందరు గాయత్రీలు



**అనువాద కథ**

మలయాళ మూలం : సేతు

తెలుగు సేత : ఎల్.ఆర్. స్వామి

"ఇది కొత్త కాలం సుబ్బూ... పాతరోజులు కావు. ఈ పాడు రోజుల్లో నేను మనస్సుని ఎలా అదుపులో వుంచుకోవాలి. నావైన పగటి వేళలని... నావి కాని రాత్రులని... నా జ్ఞాపకాలని... దుఃఖాలని .....

**అ**వును! ఇప్పుడు "కాల్ సెంటర్" విశ్రాంతి గదిలోనే వున్నాను నేను. రాత్రి వేళ, నా పని వేళ మొదలయ్యే ముందు సంధ్య వెలుగులో మరి కాసేపు నేను నా పేరుని పరిరక్షించుకోగలను. నేను పగలు గాయత్రి, రాత్రి మాగి!

ఈ "కాల్ సెంటర్" దయతో నాకు ప్రసాదించిన పేరు మాగి! గాయత్రి అనే పేరు బాగానే వుంది కాని రాత్రి పనికి అది సరిపడదట! అమెరికా నుంచి పిలిచేవాడి నాలుకలకు సులువుగా వుండే కొన్ని పేర్లు చూపించి వాటిలో ఒకటి ఎన్నుకోమన్నారు. మా సూపర్‌వైజర్ సెలీనా మేడం ఏదో ఒకటి ఎన్నుకోమన్నారు కాని పిలుపు సులువుగానూ, నా ముఖానికి తగినట్టుగానూ వుంటుందని మాగి అనే పేరు ఆవిడే ఖాయంచేసారు. ఆ తరువాత కొత్తగా పుట్టిన బిడ్డకి నామకరణం చేస్తున్నట్లు నా చెవులలో మూడుసార్లు మంత్రించారు. మాగి, మాగి, మాగి.

అలా రాత్రి తోడు కోసం దొరికిన కొత్త పేరు తాలూకు మాధుర్యం చప్పరిస్తూ "కాల్ సెంటర్"లో పక్క అడుగులు వేస్తూ వుంటే సెలీనా మేడం మొగ గొంతు వినబడింది. "ఏది ఏమైనా తల్లిదండ్రులు పెట్టిన పేరు మరవకు అమ్మాయి."

గాయత్రి అనే పేరు అమ్మ పెట్టింది. అనుకోకుండా తన జీవితంలోకి అడుగుపెట్టిన పాపకి అమ్మ పెట్టిన పేరు అది. ఇరువది నాలుగు అక్షరాలని కుదించి తయారు చేసిన ఆ పేరు అమ్మకి ఒక రక్షణ కవచంగా మారింది. నాన్న అప్పుడు అస్సాం అడవుల్లో వుండేవాడు. పేరు పెట్టిన చాలా రోజులకు కాని నా పేరు పిలవలేదు. నాన్న సెలవుల్లో వచ్చినప్పుడు సంధ్యవేళలో పిలిచారు. గాయత్రి అని నేను అక్షరాలు దిద్దడం మొదలు పెట్టక ముందే సముద్రం దాటి మరో అడవిలో చేరాడు ఆ మిలటరీవాడు. అతనికి విధించినది అడవులే! అయినా యుద్ధం చేసి శాంతి కోల్పోవటం కోసం లంకలోకి దూకేటప్పుడు తోక లేకుండా వెళ్ళవలసి వచ్చినందుకు బాధపడలేదు నాన్న.

ఆ తరువాత నాన్న గురించి ఎక్కువ వినలేదు. శాంతి నెలకొల్పటం కోసం వెళ్ళిన మొదటి 'బ్యాచు'లో అధిక భాగం శాంతి దొరకక తిరిగి వచ్చేసారు. వెళ్ళిన వారి నుంచి వచ్చిన వారి సంఖ్య తీసేసి ప్రాణం పోయిన వారి సంఖ్య వొదిలేసి లెక్కవేసిన ప్రభుత్వానికి చాలాసార్లు లెక్క తప్పింది. చివరికి ముగ్గురి లెక్కలు తేలలేదు. ఆ తేలని లెక్కల చిక్కుముడిలో చిక్కి చాలా బాధపడి వుంటాడు పాపం నాన్న! అతని గురించి అడగటానికి వెళ్తే మళ్ళీ మళ్ళీ లెక్కలు వేశారు. ప్రభుత్వం మొరుగుతూనే వుంది వస్తాడు... వస్తాడు అని.

కొన్ని నెలలు 'పోయాక' ప్రభుత్వానికి విసుగు వచ్చింది. లెక్క వెయ్యటం మానేసింది.

అమ్మ మాత్రం ఎదురు చూస్తూనే గడిపింది మరి కొంతకాలం. అప్పుడప్పుడు ఇంటి అరుగుమీద కూర్చుని అదుపు



Pages_Jan 2009.pmd 24 4/19/2011, 4:53 PM

తప్పిన బాధతో చీకటిలోకి చూస్తూ అనుకునేది.” ఎన్నేళ్ళు దేవుడా, ఈ బాధ?” గుండెలో చేతులు వేసుకొని రోదిస్తూ ఆమె అడిగిన ఆ ప్రశ్నకి బదులు ఉండేది కాదు. నాన్న వెళ్ళిన అడవులు కాని, పది నాలుకలు వుండే లంకేశుడు కాని వేల వేల వేళ్ళు వున్న ప్రభుత్వం కాని బదులు పలకలేదు.

ఆమెకు అప్పుడంతా అర్థమైంది. బాధతో మూలిగింది. ఆమెతో పాటు ఒడిలో పడుకొని వున్న నేను కూడా మూలిగాను. నాకు కూడా ఏవో కొన్ని అర్థమవుతున్నట్లు అనిపించింది.

అలా వుండగా ఒక కర్రి నలుపువాడు ఇంటి మెట్లు ఎక్కి వచ్చాడు. వాడి పేరు “అళకేశన్”. దుఃఖ భారంతో కృంగిపోతున్నట్టు నటిస్తూ అతడు అన్నాడు. ఆశ వదలక అమ్మా అడవిలో పులిపొద వద్ద చూసినవారు ఉన్నారు. అతనితో పాటు పేరు తెలియని ఒక అరవవాడు కూడా ఉన్నట్టు చెప్తున్నారు. ప్రయత్నం ఆపొద్దు. ఇది దేవుడు నిర్ణయించిన వనవాసమని అనుకోవమ్మా!”

ఆ మాట విని ఇంటి ఎదురుగా వుండే రావిచెట్టు నీడలో కూర్చున్న అయ్యప్ప గట్టిగా నవ్వాడు. “వనవాసమట రామదాసుకి! నేనెప్పుడో చెప్పాను కదా పులిపట్టుకుందని. పులి అంటే మామూలు పులి కాదే, బెబ్బులి! పట్టుకుంటే వొదులుతాదా?

‘అళకేశన్’ మళ్ళీ మళ్ళీ వచ్చాడు. వచ్చినప్పుడల్లా ఏవేవో చెప్పేవాడు. అమ్మకి ఆశ కలిగించేవాడు. కొంత డబ్బులు పట్టుకుపోయేవాడు.

చివరికి ఎలాగోలా ఓదార్పు పొందింది, అమ్మ నాన్న ఇక రాడనే నిర్ణయానికి వచ్చింది. తోకలేకుండా లంకకి వెళ్ళినందుకు శిక్ష అనుభవించాడని స్వయంసాంత్వన పరచుకుంది. చిన్నప్పుడు అమ్మ అమ్మమ్మ ఒడిలో పడుకొని రోజూ రామాయణం వినేది కదా!

ఇప్పుడు ఇవన్నీ ఎందుకు అని అనుకుంటున్నావా సుబ్బూ? అయితే విను చెప్తాను. నిన్న నాన్న నా కలలో వచ్చారు. చూసి గుర్తులేని నాన్న! నాన్న ఒంటినిండా మచ్చలు ఉండేవి, నెరిసిన రోమాలు పులి రోమాలే – కళ్ళు పులి కళ్ళలా కనబడ్డాయి. నాన్న గరుకు గొంతులో నేను చూడని అడవులుండేవి.

నాన్న గురించి నేను ఎప్పుడూ ఆలోచించలేదు. నాన్న కావాలనే కోరిక కూడా వుండేది కాదు. అప్పుడప్పుడు తండ్రిని గుర్తు చెయ్యటం ఇద్దరు తండ్రులున్న అమ్మకి అలవాటే!

“తండ్రిని మరవకూడదు తల్లి” అమ్మ అనేది. “మనస్సులోనైనా వుండాలి, ఒక తండ్రి రూపు. తండ్రి లేక పెరగటం ఆడపిల్లకి మంచిది కాదు తల్లీ.”

ఒక రోజు మాగి కూడా ఇవే మాటలు అంది. ఆమెకు ఒకప్పుడు తండ్రి వుండి వుంటాడు!

“అళకేశన్” వస్తూ పోతూ వుండేవాడు. నాన్న గురించి మూడు సంతాప సభలు జరిగాయి. అన్ని సభలకి జనం బాగానే వచ్చారు. తెల్ల చీరకట్టి, తలదించి వేదికపై కూర్చునేది అమ్మ – అమ్మ ఒడిలో నేను. బంగారు పన్ను వున్న ఎంఎల్ఏ గారు, పన్నులేని పంచాయితీ ప్రెసిడెంటు మరియు పన్నుపోయిన మాజీ సైనికులు బాధాపూరిత ప్రసంగాలు చేసారు. కాని ఆ ప్రసంగాలు తనలో ఏ స్పందన కలిగించలేదని అమ్మ నాకు తరువాత చెప్పింది. వారి మాటలు నాకు గుర్తు లేవు. గుర్తున్నది గొంతు చించుకొని పాడిన “బలి పశువు లారా...” అనే పాట మాత్రం!



ఏది ఏమైనా తండ్రి పులి నోటిలో పడి ప్రాణం పోగొట్టుకున్నందుకు కూతురికి సర్కార్ ఉద్యోగమిస్తామని ఎంఎల్ఏగారు మైకులో చెప్పారట! కాని ఉద్యోగానికి తగిన వయస్సు వచ్చినంత వరకు ఆగాలని కూడా అన్నారట! అందువల్ల భవిష్యత్తులో ప్రభుత్వోద్యోగిని అయిన నన్ను అందరూ సాదరంగా చూసారు.

కాలేజీలో చదివేటప్పుడు అమ్మ కూడా పోయింది. అయినా నిలబడగలిగాను. అడవి చిగురులకు నీడ యెందుకు? ఆధారమెందుకు? అవే బ్రతికేస్తాయి. కొందరు చందా వేసుకొని నన్ను బీదల హాస్టల్లో చేర్చారు. బాగా చదివే దాన్ని కనుక అత్యవసరం వచ్చినప్పుడు కొందరు డబ్బు ఇచ్చి సాయం చేసారు. వారిలో కొందరు డబ్బు ఇచ్చి సాయం చేసారు. వారిలో కొందరు అల్లరి చెయ్యటం ప్రారంభించినప్పుడు కాబోలు అడవి చెట్టుకు స్వయంగా ముళ్ళు పుట్టుకొచ్చాయి. జర్మనీ నుంచి అప్పుడప్పుడు డబ్బులు తెప్పించి ఇచ్చే పెద్దాయన చెప్పేవాడు” జాగ్రత్తగా వుండు తల్లీ! రోజులు బాగోలేవు.”

సుబ్బూ నీకు తెలుసా హాస్టల్లో కూడా నేను ఒంటరిదాన్నే! కొందరు స్నేహం చేసుకోవాలని ముందుకు వచ్చారు. కాని నా ప్రవర్తన వల్ల కాబోలు వెనకడుగు వేసారు. కాని ఎవరితోనైనా స్నేహం చెయ్యాలనే ఉబలాటం ఉండేది నాకు – శారీరక సంబంధం లేని స్నేహం – కాని అలాంటి స్నేహం చేసుకోలేకపోవటం నా చేతకానితనమే. మరో రోజు...

గాయత్రి సుబ్బుతో అంది “సుబ్బూ సంధ్య వెలుగులో కాల్ సెంటర్ విశ్రాంతి గదిలో అడుగు పెట్టాక, రాత్రి డ్యూటి ప్రారంభించే ముందు నా గొంతు మాగి గొంతుగా మారడానికి ఎక్కువసేపు పట్టదు. కాని మాగి నుంచి గాయత్రికి తిరిగి రావటానికి చాలాసేపు పడుతుంది. కష్టంగా కూడా వుంటుంది. అయోమయంగా వుంటుంది సుబ్బూ. ‘నిజంగా నేను ఎవరు? గాయత్రినా, మాగీనా? ఇల్లు చేరినా మాగి అనే అల్లరి దొరసాని నా మనస్సు నుంచి దిగి వెళ్ళదు.”

సుబ్బు ఏమి అనలేదు. గాయత్రినే చూస్తూ కూర్చున్నాడు.

“సుబ్బూ నాకు ఈ మాగి పని విసుగు వచ్చేసింది.”

గాయత్రి మళ్ళీ అంది. “నీళ్లలోనూ ఒడ్డులోనూ బ్రతికే ఒక రకం” మర్మేడ్” జీవితం నాది. ఒక వైపు పగటి వెలుగుల గాయత్రి – మరోవైపు ఆషాఢ మాసపు రాత్రుల మాగి. లోన, బయట కూడా జీవితాన్ని సగం సగం చెయ్యవలసివస్తోంది. వీటిలో



Pages_Jan 2009.pmd 25 4/19/2011, 4:53 PM



నిజమైనది ఏది? ఈ సమయ మార్పుల, భాషా మార్పుల మధ్య నేను ఎక్కడ వున్నాను? ఇప్పుడు, ఇది రెండు పేరుల మధ్య వున్న దూరం కాదు. దాని కంటే ఎక్కువ. నాకే ఒక రూపంలేనట్టు – ఒక అడవిలో వుండే చిమ్మ చీకటి నాలో. నిశ్శబ్దం నిండిన అడవిలో వున్నట్టు – అడవి –నాన్న – కనబడకుండా పోయిన అడవి – అమ్మ వెతికిన అడవి!

దూర దేశాలలో నుంచి పలురుచులలో వున్న "పిలుపులు" – తెల్లవారి పిలుపులు – వస్తున్నాయి –వారి ఆర్థిక వ్యవహారాల గురించిన ప్రశ్నలు – భయాలు – ఫిర్యాదులు – అన్నీ ఒక భూ మండలం నుంచి వచ్చే మరో భూ మండలతో ముడిపడి వున్న "కాల్స్" – నా ఒళ్ళు కుచించుకుపోయి ఒక ఫిర్యాదు పెట్టెగా మారినట్టు అనిపిస్తూ వుంటుంది. నేను ఎన్ని వేషాలు వేసినా, పేర్లు మార్చినా, నేను తెల్లదాన్ని కాదని వాళ్ళకు తెలుసు.

పొట్ట పోషించుకోవటానికి కోసం రాత్రివేళ నిద్రమాని కూర్చునే మూడో ప్రపంచపు నల్లదొరసాని అని – కాల్ అందుకునే ఒక పిల్ల అని వాళ్ళకు తెలుసు. తెల్లగా మార్చటానికి ఎంత ప్రయత్నించినా, నల్లదాని గొంతు నల్లగానే ఉంటుంది. తెల్ల చర్మపు పొగరుతో కొందరు నాతో సరసాలాడడానికి ప్రయత్నిస్తారు. మొదటి శ్రేణి ప్రపంచపు మోటు సరస సంభాషణ అందుకోవటం విధిగా మారిన మూడో ప్రపంచపు యవ్వనం వింటూ కూర్చుంటుంది.

ఎందుకిలా వింటూ కూర్చోవాలి, నిరసన వ్యక్తం చెయ్యవచ్చు కదా అని నీవు అడగవచ్చు.

"నిరసన వ్యక్తం చెయ్యటం నిషిద్ధం." గాయత్రి పెదవులపై చూపుడు వేలువేసుకొని" అంది. "బహుశ చాలా చాకచక్యంగా నిరసన చూపవచ్చునేమో... తెల్ల చర్మానికి గీసుకోకూడదు. "కాల్ సెంటర్" లోని నియమావళి చాలా కర్కశంగా వుంటుంది. మాట్లాడే టప్పుడు అనుమతింపబడిన డెసిబెల్ దాటకూడదు. అందువల్ల మొదటి శ్రేణీ ప్రపంచపు పౌరుష వీర్యం ఆడుకోవలసిన కన్నెపిల్లలలో ఒకర్తె ఈ గాయత్రి కూడా" గాయత్రి గొంతు జీరబోయింది.

సాధారణంగా అంతా వింటాడే తప్ప, ఏది మాట్లాడడు సుబ్బు. కాని ఇప్పుడు మాట్లాడక తప్పలేదు అతనికి. అతడు అన్నాడు నిరసన యొక్క నిప్పు గోడలు లేవు మీకు. అయినా ప్రపంచాన్ని ఎదుర్కొనే కన్నె మనస్సులు..."

ఏది ఏమైనా పెళ్ళి చేసుకున్నాక పనిలోకి పంపే ప్రసక్తే లేదని మనసులో అనుకున్నాడు సుబ్బు.

"ఏమైంది గాయత్రీ, అలా భయపడినట్టు...." కాసేపు గడిచాక సుబ్బు అడిగాడు." ఎవరివో సైబర్ బీజాలు స్వీకరించి నీవు పిల్లి కళ్ళ పిల్లలని కంటే..."

"మూర్ఖుడు..." గాయత్రి మనస్సులో అనుకుంది. కాని పైకి అనలేదు.

"ఏది ఏమైనా ఈ పని నాకు తప్పదుగా.." మెల్లగా పలికింది గాయత్రి.

"తప్పదని ఏముంది? ఇంకో పని గురించి ప్రయత్నించవచ్చుగా?"

''ఎన్నో సంవత్సరాలుగా చేస్తున్న పని ఇది. ఈ "కాల్‌సెంటర్" పని కాక నాకు ఇంకేం పని వస్తుంది?"

"పట్టుదలతో వెతికితే మరొకటి దొరకదా?"

మౌనంగా చాలాసేపు గడిపింది గాయత్రి. చివరికి ఆమె పెదవులు కదిలాయి." సుబ్బూ ..."

"చెప్పు.."

"ఈ ఉద్యోగం దొరకటం ఎంత కష్టమైందో తెలుసా?"

ఆ సంగతి సుబ్బుకు బాగా తెలుసు. పులి తిని చనిపోయిన వారి లెక్కలో కూతురికి ఉద్యోగం దొరుకుతుందని గాయత్రి అమ్మ చాలా ఆశపడింది. కాని కూతురుకి ఉద్యోగం రాకముందే ఆమె చనిపోయింది. ఎంఎల్ఏ మారిపోయారు. పంచాయితి ప్రెసిడెంట్ మారాడు. చనిపోయిన ఎంఎల్ఏ స్థానంలో వచ్చిన కూతురు ఎంఎల్ఏ చెప్పింది గాయత్రి నాన్న మామూలుగానే చనిపోయాడని, అతన్ని పులి మింగిందని అనటానికి సాక్ష్యం లేదని, అయినా ఇది పులి పొదలలో వ్యవస్థ. న్యాయం ఎలా వుంటుంది?

"నీకు తెలుసా సుబ్బూ. నేను ఇప్పుడు ఇద్దరు తండ్రులను గురించి ఆలోచిస్తున్నాను. మా నాన్న గురించి – మాగి నాన్న గురించి."

"ఈ మధ్య నీవు మాగి గురించి ఎక్కువగా ఆలోచిస్తూ మనస్సు పాడు చేసుకుంటున్నావు. ఏం మాట్లాడినా నీ మాటలు మాగి వైపే వెళ్తున్నాయి" సుబ్బు అన్నాడు. "నిజమే. మాగి నాకు తెలిసిన నిజాలతో ఒకటిగా ఎక్కువగా వుండవచ్చును. నీకు తెలుసా సుబ్బూ ఒక రోజూ సెలీనా మేడంని అడిగాను 'మాగి' ఎవరని. కాసేపు అర్థం కానట్టు కూర్చుంది ఆమె. ఆ తరువాత తనదైన మగ గొంతుతో అంది. "నీకిచ్చిన ఒక వినసొంపైన పేరు.. దానికి మించి ఏముంది?"

అంతేనా...ఆమెకు ప్రాణం లేదా?..."

"పేరుకు ప్రాణముంటుందా?"

"మాగికీ ఒక ప్రపంచం ఉంటుంది కదా?..."

"ఓ... అదా..."

"ఒకటి అడగనా మేడం... మాగి చూడటానికి ఎలా వుంటుంది...?"

"బాగా ఎర్రగా వుంటుంది..."

"ఆమె ఊరు..."

"ఏమిటీ పిచ్చి ప్రశ్న...?"

"సీరియస్‌గానే అడుగుతున్నాను మేడం..."

"అర్థమవుతోంది. అప్పుడప్పుడు నీ పిచ్చి మాటలు వింటూ వుంటే అనిపిస్తోంది, నీకేదో.."

"మేడం, నా ప్రశ్నకి జవాబు..."

"ఇంత కాలం పని చేసినా, నీకు "కాల్ సెంటర్" పద్ధతులు అర్థం కాలేదా! ఇవన్నీ ఉద్యోగంలో భాగంగా వెయ్యవలసిన వేషాలు. వేషం తీసేస్తే అంతా మర్చిపోవాలి, పాత్రతో అనుబంధం పెంచుకోకూడదు."



Pages_Jan 2009.pmd 26 4/19/2011, 4:53 PM

"అది అంత సులువు కాదు మేడం, మాగి నుంచి విభిన్నమైన గాయత్రి ఉందా? ఇంతకాలం నాతో గడిపిన మాగికి ప్రాణం పొయ్యవలసినది నేనే కదా?"

"నాన్‌సెన్స్' నీవే మాగి, నీవే గాయత్రి కూడా."

సెలీనా మేడం గొంతులో ధ్వనించిన కోపం నాకు బాధ కలిగించింది. మాగిని నాకు అంటకట్టింది. ఆవిడే కదా!

బహుశ ఆ తరువాతనే మాగి నాలో ఎదగటం ప్రారంభించిందని అనుకుంటున్నాను.

నాకు కొంత పిచ్చని సెలీనా మేడం అప్పుడే అనుకొని వుండవచ్చు. అవకాశం వచ్చినప్పుడు బయటకు నెట్టవలసిన ఉద్యోగుల పట్టికలో నా పేరే మొదటి పేరుగా రాసుకొని వుండవచ్చును.

"సుబ్బూ నా బాధ నీకైనా అర్థమవుతోందా?" గాయత్రి అడిగింది.

అర్థం కాకపోయినా, గాయత్రి మాటలకు "ఊ" కొట్టడం అలవాటు చేసుకున్న సుబ్బు మూలిగాడు.

"మెలమెల్లగా నేను మాగిలోకి ప్రవేశిస్తున్నాను." ఎడతెరిపి లేకుండా చెప్పుకుపోతోంది గాయత్రి. "మాగికే సొంతమైన ఒక వాతావరణం ఇవ్వటానికి ప్రయత్నిస్తున్నాను, ఇప్పుడు 'ముందు ఆమెకి ఒక రూపం ఇచ్చాను. ఎర్రని రంగు, గుండ్రటి ముక్కు, ఎర్రని జుట్టు, పిల్లికళ్ళతో కూడిన ఒక లావు అమ్మాయి మాగి. 'నూ ఓరియన్స్'లోని ఒక చీకటి వీధిలోని ఇంటిలో పుట్టింది. తండ్రి నల్లజాతికి చెందినవాడు. తల్లి తూర్పు ఐరోపియా ఖండానికి చెందిన స్త్రీ. 'నాజీ'ల కాలంలో వలస వెళ్ళినవారి సంతతి. ఆమె పదునాలుగవ ఏట వేరుగా జీవించటం ప్రారంభించినా ఆ నల్లజాతి తండ్రికి, ఎర్రజాతి తల్లికి ఆమె హృదయంలో స్థానం ఉండేది. ఆమె భాష నలుపు ఎరుపుల సంకరం. తల్లి వంశానికి చెందిన వారిని ఒకానొకప్పుడు గోడకి ఆన్చి నిలబెట్టి కాల్చి ప్రాణంతో కొట్టుకుంటున్న శరీరాలని 'బాయిలర్'లోకి విసరేవారట! అవన్నీ విన్నా మాగి స్పందించేది కాదు కాని అందగత్తెన తల్లి, నగరంలోని పేరుమోసిన క్రిమినలైన నాన్నలో ఏం చూసిందని, ఎందుకు ప్రేమించిందని మాగికి ఇప్పటికి అర్థం కాలేదు. వాళ్ళ మధ్య రోజు గొడవలే వుండేవి. ఎవరో ఒకరు ఇంటి బయటకు వెళ్ళినంత వరకు సాగేది ఆ గొడవ. తండ్రి అంటే చాలా ఇష్టం మాగికి. ఏదో బ్రాందిషాపులో జరిగిన కొట్లాటలో చంపబడినంత వరకు మాగిని చూడటానికి వచ్చేవాడు అతడు. దొంగలించిన వస్తువులని రంగు రంగుల కాగితాలతో అందంగా అమర్చి మాగికి కానుకగా తెచ్చేవాడు."

"ఇక ఆపు" సుబ్బుకి విసుగు వచ్చింది. "చాలు, చాలు ఈ పరకాయ ప్రవేశం."

"పరకాయ ప్రవేశం కాదు సుబ్బూ... శరీరం నాదే. ఈ శరీరంలో ఎక్కడో వుంది. మాగి అలాటప్పుడు ఇది నాలోకి నేను చూసుకోవటమే కదా? నమ్మబుద్ధి కావటం లేదు కదూ... గాయత్రికి మాగికి కొన్ని అదృశ్య బంధాలు కలిపే ఈ "కాల్‌సెంటర్" ఒక యదార్థం కదా! దానివల్ల వచ్చిన మాగి కూడా యదార్థమే! మాగి నా శరీరాన్ని పంచుకునే చెలి, చెల్లి, ప్రేయసి, సపత్ని. అప్పుడప్పుడు నన్ను విడిచి వెళ్ళిన తల్లి కూడా నాకు మాగి కావాలి, మానసికంగా కాదు, శారీరకంగా కూడా..."



"ఏమిటి ఈ పిచ్చి మాటలు? నీవు ఏం మాట్లాడుతున్నావనేది నీకు అర్థమవుతోందా?"

"ఇప్పుడు నేను మాగిని చూడగలను. ఆమె మాటలు వినగలుగుతున్నాను. నా మనస్సు నిండా ఆమె కోరికలే!

ఆమె దుఃఖాలే! నాన్నగారి బానిస అయిన ఒక ఒంటి కన్నువాడితో కొన్ని రోజులు గడిపింది మాగి. ఆ కలసి వుండటం చివరికి పెద్ద గొడవగా ముగిసినప్పుడు రెండు కాళ్లు చచ్చిపడి "వీలు కుర్చీలో ఒక చిత్రకారుడు ఆమెకి స్నేహితుడైనాడు."

"ఏమిటి... ఏమిటి కట్టుకథలు..."

"కట్టు కథలు కావు సుబ్బూ.." మాగి నా మనస్సు నిండా వుంది." అనుకున్నాడు. సుబ్బు- గాయత్రి నాన్న వెళ్ళిన అడవి - తల్లి వెతికిన అడవి విషయం మార్చటానికి ప్రయత్నించాడు.

"రూపాంతరంలో ఇప్పుడు ఏ స్టేజిలో వున్నావు?" సుబ్బు అడిగాడు.

"మధ్య వున్నానని చెప్పవచ్చు" గాయత్రి నిట్టూర్చింది. ఆ తరువాత అంది "నీవు మరో ఉద్యోగం గురించి చెప్పావు కదా... దాని గురించి ఇప్పుడు ఆలోచించలేను"

"నీవేగా అన్నావు, ఈ పని విసుగు వచ్చిందని..."

"నిజమే! అప్పుడప్పుడు అలా అనిపిస్తూ వుంటుంది ఒక మార్పువల్ల నేనూ, మాగి ఈ బంధం నుంచి బయట పడవచ్చు కదా అని ఎంత ప్రయత్నించినా నా మనస్సుని అదుపులో వుంచటానికి కుదరటం లేదు."

"ఎందువల్ల...?"

"ఏమో... నేను ఈ చోటు విడిచి పెట్టలేను సుబ్బూ."

"ఎందుకని...?"

"నేను ఈ చోటు విడిచి పెడితే మాగి వుండదుగా..."

"ఇదేం పిచ్చి గాయత్రి..?" కంగారుగా అడిగాడు సుబ్బు.

"నీవు నాతో గడపవలసిన దానివి. అప్పుడు నీవు ఎవరివి - గాయత్రియా?.. మాగియా....?"

"పగలు గాయత్రి, రాత్రి మాగి. అనుమానమేమిటి?"

"అయితే మనకు పుట్టే పిల్లలు..."

"పిల్లలు ప్రకృతి సంతానాలు. పువ్వులా, చెట్టులా వాళ్ళని ఇచ్చేది ప్రకృతియేగా, అలాంటప్పుడు వాళ్ళ గురించి ఆత్రుత ఎందుకు?..."

గట్టిగా నిట్టూర్చాడు సుబ్బు. తన రూపాంతరంలోని మరో స్టేజి చేరుకుంది గాయత్రి.

●



Pages_Jan 2009.pmd 27 4/19/2011, 4:53 PM

# వీడ్కోలు తీసుకున్న ధిక్కార స్వరం హెరోల్డ్ పింటర్



నోబుల్ బహుమతి విజేత, ప్రసిద్ధ బ్రిటీష్ నాటక రచయిత హెరోల్డ్ పింటర్ దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతూ క్రిష్టమస్(2008) రోజు మరణించారు. 78 సంవత్సరాల పింటర్ కొంతకాలంగా లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. 2005 నోబుల్ సాహిత్య పురస్కారం అందుకొన్న హరోల్డ్ పింటర్ విశ్వవిఖ్యాతుడైన నాటకకర్త. తను చనిపోయేవారకు రాజీపడని వామపక్షవాదిగా ఉన్నారు. బ్రిటన్, అమెరికా విదేశీ విధానాలపై తీవ్రంగా విమర్శలు చేశారు. ముఖ్యంగా మూడు సంవత్సరాల క్రితం ఇరాక్‌పై జరిగిన దాడిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ సాహిత్య వ్యాసంగాన్ని నిలిపివేసి రాజకీయ సంకల్పాన్ని చేపట్టారు.

హారోల్డ్ పింటర్ 1930 అక్టోబరు 10 వ తేదీన తూర్పు లండన్‌లో పుట్టాడు. తండ్రి యూదు మతస్తుడు. దుస్తుల తయారీ చేసేవాడు. హిట్లర్ ఫాసిజం యూదులను వేటాడి నరమేధం సాగించిన నేపథ్యం పింటర్ రచనలకు ప్రేరణ. ఆ బీభత్సం, హింసాకాండ, రెండవ ప్రపంచ యుద్ధపు బాంబుల వర్షం పింటర్‌పై ప్రభావం చూపాయి. రష్యన్ చిత్రం 'ఒడిస్సీ ఫైల్' ద్వారా ప్రసిద్ధికెక్కిన ఒడిస్సీ ( దాన్నే కొందరు హంగరీ అంటారు ) తన తాతల నివాసమై వుండొచ్చని పింటర్ అంటుంటారు. అయితే కథలు తప్ప ఇందులో పూర్తి నిజానిజాలు తెలియవంటారు. వీధులలో యూదు వ్యతిరేకులతో ముఖాముఖి తలపడ్డ అనుభవాలు, యుద్ధ సంఘటనలు ఆయనలో హింసపట్ల భయం పోగొట్టాయి.

ఈ కారణంగానే ఆయన ఇరాక్‌పై దురాక్రమణను నిశితంగా ఖండించారు. 'అమెరికా అడుగులకు మడుగులొత్తే బ్లెయిర్ కారణంగా తాను బ్రిటిష్ పౌరుడనైనందుకు సిగ్గుపడుతున్నానని ప్రకటించారు. బ్లెయిర్ నరహంతకుడని, క్రైస్తవ ధగ్గ అని ధ్వజమెత్తారు. తమ దేశాన్ని యుద్ధ నేరాల కింద శిక్షించాలని కూడా కోరారు. వీటన్నిటితర్వాత ఆయనకు నోబుల్ పురస్కారం లభించడం ఆశ్చర్యం అనిపించవచ్చు. పింటర్ నాటకకర్తగా ప్రదర్శించిన అసమాన ప్రతిభా విశేషాలు, సృజన శీలతలే అందుకు మూలం. ఆయన ఇంతకు ముందే అనేక అంతర్జాతీయ అవార్డులు పొందారు. షేక్స్‌పియర్ ప్రైజ్ (హాంబర్గ్), ఐరోపా సాహిత్య పురస్కారం (వియన్నా) పిరండిలో ప్రైజ్( పాలెమారో) డేవిడ్ కోహెన్ బ్రిటిష్ సాహిత్య పురస్కారం (లండన్) జీవిత కాలపు కృషికి గాను లారెన్స్ ఆలివర్ అవార్డు, మాలిరీ గౌరవం వాటిలో కొన్ని మాత్రమే. 1999లో పింటర్‌ను రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్ కూడా ప్రత్యేకంగా గౌరవించింది.

హారోల్డ్ పింటర్ 30కి పైగా నాటకాలు రాశాడు. అంతకు ముందు మారుమూల గ్రామాల్లోనూ పట్టణాల్లోనూ కూడా నాటక ప్రదర్శనల్లో ప్రత్యక్షంగా పాల్గొనడం వల్ల ఆయనకు ప్రజల స్పందనలు, మనోభావాలు బాగా పట్టుబడ్డాయి.

27వ ఏట 'ద రూం' అన్న నాటికతో ఆయన రంగ(స్థల) ప్రవేశం చేశారు. అదే ఏడాది వచ్చిన బర్త్‌డే పార్టీ ఆయనకు ఎనలేని ఖ్యాతి తెచ్చిపెట్టింది. 1958లో అది మొదట ప్రదర్శించినప్పుడు విమర్శకులు విపరీతంగా గేలి చేశారు. పరమ చెత్త అని తిట్టిపోశారు. ప్రేక్షకుల స్పందన కూడా మొదట్లో అంతంత మాత్రంగానే వుండింది. కాని తోటి నాటక కర్తలు మాత్రం అతనిలోని ప్రతిభను ఎంతగానో శ్లాఘించారు. తనకు ఎంతో ఇష్టుడైన నవలా రచయిత శామ్యూల్ బెకెట్ కూడా అనుకోని విధంగా మెచ్చు కోవడంతో పింటర్‌కు చాలా ఆత్మవిశ్వాసం కలిగింది.

తర్వాత కేర్ టేకర్, హోమ్ కమింగ్, డంబ్ వైటర్, స్లెట్ ఏక్, ద హాట్‌హౌస్, ఎ నైట్ ఔట్, ద డ్వార్ఫ్‌, ద బేస్‌మెంట్, లాండ్ స్కేప్ తదితర నాటకాలు రాశాడు. 'ద సర్వెంట్', ద గో బిట్వీన్, ద ఫ్రెంచ్ లెఫ్టినెంట్స్ వుమన్, తదితర 29 స్క్రీన్‌ప్లేలు రాశాడు.

బర్త్‌డే పార్టీ, సెలబ్రేషన్, యాషెస్ టు యాషెస్ ఇలా ఒక్కో నాటకం రూపు దాల్చేకొద్దీ పింటర్ స్థాయి పెరిగింది. తూర్పు లండన్ నుంచి లండన్ రెస్టారెంట్లలో వాటిని చూసి ఆనందించే స్థితి వచ్చింది. కాని ఆయన నాటకాలన్నిటిలోనూ సూటిగా నాటుగా సాగే సంభాషణలు, గుండెల్లో గుచ్చుకునే మౌనం వుంటాయి. ఆయన నాటకాల్లో నిగూఢత నిండి ఒక పట్టాన అంతుపట్టవు. ఆయన కావాలనే అంతా గందరగోళం చేస్తాడన్న

ఆరోపణ వినిపిస్తుంటుంది. కాని అదే వాటిపై ఆసక్తిని సజీవంగా వుంచుతుంది. ఆయన నాటకాలు 'ఒక నిర్మాణ వ్యవస్థ కలిగించే భావ ప్రతిమలుగా, విభిన్న పరిస్థితులకు ప్రతిబింబాలుగా, అలంకారాలుగా వుంటాయి. నాటకాలలో సంభాషణలు, భాష కూడా ప్రత్యేక తరహాలో సాగుతాయి. పాత్రలతో విచిత్రమైన మాటలు పలికించి దిగ్భ్రాంత పరుస్తాడు. నాటకాలలో మాటలు మాత్రమే కాక మౌనం కూడా కీలకపాత్ర వహిస్తుంది. అది మానవ సంబంధాలలో శూన్యాన్ని స్తబ్దతను ప్రతిబింబిస్తుందంటాడు పింటర్. ఉదాహరణకు బాగా తమాషా సృష్టించాలను కున్నప్పుడు ఒక తెర లేదా పొగ మంచు వచ్చేస్తుంది. (ఈ విషయంలో ఇవోన్ సాంకోతోనూ, అమెరికా నాటకకర్త ఎడ్వర్డ్ ఎల్బీతోనూ పింటర్‌కు పోలికలున్నా యంటారు.) ఈ ప్రత్యేకత పిక్చురిస్క్ అన్నట్టే పింకరిస్క్ అన్న పదబంధాన్ని సృష్టించింది. సంభాషణలు సంక్షిప్తమైన ఆత్మభాషణల్లా వుంటాయి. 'మనకు వినిపించే భాషణలు మనకు వినిపించని దాని సూచనలు' అంటాడు పింటర్. మామూలుగా వినిపించని మౌన శబ్దాలను వినాలంటే మనం మరింత సావధానం కావాలి. మానవత్వంతో చూడాలి. గొప్ప రచయితలందరూ చేసే ఈ పనినే పింటర్ మరింత బాగా చేశాడు.

బయిటి ప్రపంచంతో వ్యవహరించే ముందు మనతో మనం మాట్లాడుకోవాలనే దృష్టి ఆయునది. (తన అస్తిత్వం ప్రమాదంలో పడుతుందేమోననే ఆందోళన మనిషిలో ప్రాథమికంగానే వుంటుందన్న మార్టిన్ హైడ్జర్ ప్రభావం కూడా ఇందులో వుందంటారు.) కాని పింటర్‌లో ఆ భయం నైరాశ్యంగా వుండదు. ఉదాహరణకు బర్త్‌డే పార్టీలో ఇద్దరు ఆగంతుకుల రాకను భయానికి సంకేతంగా ఆయన ఉపయోగిస్తాడు." తలుపు దగ్గర ఎవరో వచ్చి నిలబడడమనేది గత ఇరవయ్యేళ్లుగా గత రెండేళ్లుగా రెండు వందల ఏళ్లుగా ఐరోపాలో జరుగుతూనే వుంది' అని పింటర్ వ్యాఖ్యానిస్తాడు.

పింటర్ రచన 'హోం కమింగ్' లో సెక్స్, వ్యభిచార వృత్తి వంటి సమస్యలను బ్రిటిష్ కార్మిక వర్గ జీవిత వాస్తవాల పరిధిలో చర్చించడం చూస్తాం. ఈ నాటకం ఇండియాతో సహా ప్రపంచమంతటా యువతరం సాహిత్యాభిమానులను విశేషంగా ఆకర్షించింది. మొదట్లో అవి అందరినీ దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఇప్పుడు మీడియా బాగా అందుబాటులోకి వచ్చాక ఆ తీవ్రత తగ్గినా వాటి ఆకర్షణ ప్రత్యేకత ఏ మాత్రం తగ్గలేదు. తను ఏ దేశాన్ని దృష్టిలో పెట్టుకుని రాస్తానో అక్కడి నేలకు హత్తుకునేలా జాగ్రత్తపడతానంటాడు పింటర్. ఆయన రాసిన దాన్ని ' అసంగత నాటకం'(థియేటర్ ఆఫ్‌ద అబ్సర్డ్) అన్నప్పటికీ దేశదేశాలను ఆకర్షించడానికి అదో కారణం.

ద ఫ్రెంచ్ లెఫ్టినెంట్స్ వుమన్, ద సర్వంట్, గో బిట్వీన్ వంటి సినిమా రచనలు పింటర్‌కు ప్రత్యేక స్థానం సంపాదించి పెట్టాయి. ఆయన నవల ద డ్వార్ఫ్ 1990లో వెలువడింది. అలాగే ఆయన పందొమ్మిదవ ఏట కవిత్వం మొదలెట్టి మొత్తం అరడజను కవితా సంపుటాలు వెలువరించారు. ఇరాక్ యుద్ధ నేపథ్యంలో కూడా ద వార్, ఎయిట్ పోయెమ్స్ అండ్ వన్ స్పీచ్ అన్న కవితా సంపుటాలు ప్రచురించారు. రచయితగా ఎంత ప్రసిద్ధుడో సామాజిక కార్యకర్తగానూ, సామ్రాజ్యవాద వ్యతిరేకిగానూ ఆయన అంత శక్తిమంతుడు. ఆయన 1958లో నేను నిజానికి నిజం కానిదానికి మధ్య అభేద్యమైన తేడాలేమీ లేవని రాశాను. అలాగే నిజం కాని దానికి నిజమైన దానికి మధ్య కూడా. ఒక విషయం తప్పని సరిగా వాస్తవమో అవాస్తవమో అయి వుండాలని ఏమీ లేదు. అయినా ఇలాంటివి నొక్కి చెప్పడంలో విజ్ఞత వుంది. కళలో సత్యాన్వేషణ చేయడానికి అవి దోహద పడతాయి. కనక ఒక రచయితగా నేను వారితో నిలబడతాను. పౌరుడుగా నిలబడలేను. పౌరుడుగా నేను ఏది నిజం? ఏది బూటకం? అనే ప్రశ్న వేయక తప్పదు" పౌరుడుగానే తాను పాశ్చాత్య దేశాల ఆధిపత్యంపై నిప్పులు చెరుగుతానన్నది ఆయన భావం. తన సైనిక బలంతో అమెరికా మిగిలిన ప్రపంచంపై ఆర్థిక పెత్తనం సాగించడం అన్యాయమని ఆయన నిశ్చితాభిప్రాయం. బ్లెయిర్, బిల్ క్లింటన్, బుష్‌లను యుద్ధ నేరస్తులుగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశాడు. నామ్ చామ్‌స్కీ, ఆర్థర్ మిల్లర్‌లు అమెరికా చైతన్య స్వరూపాలని కొనియాడాడు. తన మాటలను తప్పుగా ప్రకటించినందుకు గార్డియన్, ఇండిపెండెంట్ వంటి బ్రిటిష్ పత్రికలు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశాడు.' మీరు నా నోరు నొక్కలేరు' అన్నది ఆయన శంఖారావం.



హెరాల్డ్ పింటర్ నోబుల్ బహుమతి పొందిన సందర్భంలో ప్రస్థానం2005 డిసెంబర్ ముఖచిత్ర కథనం

వయసు పైబడినా, కాన్సర్ తినేస్తున్నా ఇరాక్‌లో సామ్రాజ్యవాదుల దురాగతాలను పింటర్ సహించలేకపోయాడు. అడుగడుగునా ఖండించాడు. ఆఖరుకు నోబుల్ బహుమతి స్వీకరిస్తూ ఆయన చేసిన ప్రసంగం కూడా అమెరికాపై నిప్పులు చెరిగింది. కాన్సర్ శస్త్ర చికిత్స అనంతరం దుర్బల దేహంతో వణికే కంఠంతో తన చక్రాల కుర్చీలోనే రికార్డు చేసిన సందేశంలో పింటర్ అమెరికాను, ప్రత్యేకించి బుష్‌ను చీల్చి చెండాడాడు. అస్వస్థుడైనప్పటికీ అభినయంలో వ్యక్తీకరణలో ఆరితేరిన పింటర్ వీడియో సందేశం ప్రేక్షకులను పరిశీలకులను మంత్ర ముగ్ధులను చేసింది. వాస్తవానికి వీడియో షూటర్ కూడా కాస్సేపు సూచనలు చేసినా తర్వాత అంతా ఆయన ఇష్టానికే వదిలేశాడట.

పింటర్ సందేశం మొత్తం ప్రధానంగా అమెరికా విదేశాంగ విధానంపై దాడి. కాని ఆయన దాన్ని అందించిన తీరులో ఒక మహానాటకకర్త నైపుణ్యం తొణికిస లాడింది. బుష్ ఉపన్యాసాలు రాసేందుకు తనను పెట్టుకుంటే బాగుంటుందని అంటూ 'మా దేవుడు మంచివాడు. వాళ్ల (లాడెన్) దేవుడు చెడ్డవాడు. అతను చెడ్డ దేవుడు. సద్దాం దేవుడు చెడ్డవాడు. కాకపోతే అసలు అతనికి దేవుడే లేడు. అతనో బర్బరుడు. మేం బర్బరులం కాము." ఇలా సాగుతుందంటాడు. పింటర్ ఈ మాటలు చెప్పేతీరు దానిలోని వ్యంగ్యాన్ని మరింతగా పండించింది.

'ఇక్కడ ఈ మనిషి అమెరికా విదేశాంగ విధానంపైన,దానికి బ్రిటన్ వంత పాడడంపైన దాడి చేస్తున్నాడు. నియంత్రిత ఆగ్రహంతో భయంకరమైన వ్యంగ్యంతో ఆ పని చేస్తున్నాడు. విడ్డూరమేమంటే ఇదంతా అయిన తర్వాత మనకు పింటర్ ఎంత గొప్ప నాటకకారుడో అర్థమవుతుంది.' అని గార్డియన్ నాటక విమర్శకుడు మైకెల్ బిలింగ్టన్ రాశాడు. బ్రిటీష్ సాహిత్యంలోకి వాస్తవికతను ప్రవేశపెట్టిన వ్యక్తిగా హెరోల్డ్ పింటర్ ప్రసిద్ధి చెందారు ◆



Pages_Jan 2009.pmd 29 4/19/2011, 4:53 PM



# కళ, సత్యం, రాజకీయాలు

**2005 నోబెల్ సాహిత్య పురస్కార గ్రహీత హెరాల్డ్ పింటర్ స్టాక్‌హోమ్‌లో వీడియో ద్వారా డిసెంబర్ 7వ తేదీ చేసిన ప్రసంగ భాగాలు.**

'యథార్థము, అవాస్తవమూ మధ్య కానీ, సత్యము, అసత్యము నడుమ కానీ అభేద్యమైన తేడాలేవీ లేవు. ఏదైనా విషయం తప్పనిసరిగా సత్యమో, అసత్యమో కావాలని లేదు. అది యథార్థమూ, మిథ్యా రెండూ కావచ్చు.' ఇది నేను 1958లో రాశాను. ఈ వక్కాణింపు ఇప్పుడూ అర్ధవంతమైనదేనని, కళ ద్వారా వాస్తవాన్వేషణకు ఇప్పటికీ వర్తిస్తుందని నేను విశ్వసిస్తున్నాను. నలభై ఏడు సంవత్సరాల క్రితం చేసిన ఈ ఉద్ఘాటనకు ఒక రచయితగా నేను నిబద్ధమై ఉన్నాను, ఒక పౌరుడుగా మాత్రం కాదు. ఒక పౌరుడుగా నేను అడిగి తీరాలి. ఏది సత్యం? ఏది అసత్యం?

నాటకంలో సత్యం ఎప్పటికీ అంతు చిక్కదు. నీవు దానిని కనుగొనలేవు. అయితే సత్యాన్వేషణ విధిగా చేయాలి. సత్యశోధన నీ కర్తవ్యం. అంధకారంలో అస్తుబిస్తుగా సత్యం నీకు తారస పడుతుంది. నీవు దానిని ఢీకొంటావు లేదా సత్యాన్ని పోలిన ఒక ప్రతి కృతిని, ఒక రూపును కాంచుతావు – నీవు చేసినదేమిటో గ్రహించకుండానే. అయితే అసలు నిజం ఏమిటంటే నాటక కళలో ఒక సత్యంగా కనుగొనబడే విషయమేదీ లేదు. చాలా సత్యాలు ఉన్నాయి. ఆ సత్యాలు పరస్పరం సవాళ్ళు విసురుకుంటాయి, వివర్తనం చెందుతాయి, ప్రతిబింబిస్తాయి. అలక్ష్యానికి పాల్పడుతాయి, వేధించుకుంటాయి. అవి పరస్పరం గుర్తుంచుకోవు. కొన్నిసార్లు ఒక మహత్వపు సత్యం నీ చేతుల్లోకి వచ్చిందని భావిస్తావు. అంతలోనే అది నీ హస్తాల్లోంచి జారిపోతుంది. నీ నుంచి నిష్క్రమిస్తుంది. నా రూపకాలు ఎలా వచ్చాయని నన్ను తరచు అడుగుతుంటారు. నేను చెప్పలేను. నా నాటకాలను సంక్షేపించలేను – జరిగింది ఇది, అదీ వారు (పాత్రలు) చెప్పిందీ, అదీ వారు చేసింది అని చెప్పడం మినహా.

అప్పటి వరకు ఉనికే లేని పాత్రలను సృష్టించిన క్షణం ఒక అసాధారణ భ్రామకం. ఆ తరువాత సంభవించేది ఔచిత్యపూర్వకమే. అనిశ్చితమే. భ్రాంతికరం కూడా. అయినప్పటికీ కొన్నిసార్లు పాత్రల సృష్టి ఆపలేని ప్రవాహ సదృశ్యమే. రచయిత స్థితి విచిత్రమైనది. ఒక విధంగా పాత్రలు అతన్ని హర్షించవు. ఆహ్వానించవు. అవి ప్రతిఘటిస్తాయి. రచయితతో సహ జీవనం చేయలేవు. నిర్వచించడానికి అసాధ్యంగా పాత్రలు పరిణమిస్తాయి. ఖచ్చితంగా నీవు వాటిని ఆదేశించలేవు. కొంతవరకు వాటితో నీవు ఎప్పటికీ పూర్తికాని ఆటకు దిగుతావు. దాగుడు మూతలు ఆడతావు. అంతిమంగా నిలువెత్తు సజీవమూర్తులు – సంకల్పమూ, వ్యక్తిగత అనుభూతులు ఉన్న వ్యక్తులు – నీ ఎదుట ఉన్నట్లు కనుగొంటావు. నీవు మార్చలేని, విరూపం చేయలేని, లొంగదీసుకోలేని మనుష్యులు వారు!

కనుక కళలో భాష పూర్తిగా సందిగ్ధ వ్యవహారంగా మిగిలిపోతుంది. అది ఒక ఊబి. ఘనీభవించిన సరస్సులాంటిది. అది ఏ క్షణమైనా నీ (రచయిత) కాళ్ళ కింద నుంచి తొలగిపోతుంది. అయితే నేను చెప్పినట్టు సత్యాన్వేషణ నిలిచిపోదు. అది ముగియ కూడదు. దాన్ని వాయిదా వేయకూడదు. సత్యంతో తలపడాలి – అక్కడికక్కడే, ఆ క్షణాన్నే.

రాజకీయ యవనిక పూర్తిగా భిన్నమైన సమస్యలను ప్రదర్శిస్తుంది. ఎట్టి పరిస్థితులలోను ధర్మోపదేశాలు చేయకూడదు. నిష్పాక్షికత ముఖ్యం. పాత్రలు స్వంత ఉచ్ఛ్వాసనిశ్వాసలు తీసేలా పాత్రలకు అనుమతి ఇచ్చి తీరాలి. తన సొంత అభిరుచులు, దృక్పథం, దురభిప్రాయాలకు అనుగుణంగా వాటిని పరిమితం చేయడానికి, మలచడానికి రచయిత ప్రయత్నించకూడదు. వివిధ కోణాల నుంచి వాటిని సృజించడానికి అతడు సిద్ధం కావాలి. అవి రూపుదిద్దుకుంటున్న తీరు క్వాచిత్కంగానైనా ఆశ్చర్యపరచవచ్చు. అయినప్పటికీ అవి తమ సంకల్పానుసారం వెళ్ళేలా వాటికి స్వేచ్ఛనివ్వాలి. అన్ని సృజనల లోను ఇలా చేయడం కుదరదు. రాజకీయ ప్రహసనం ఈ సృజన సూత్రాలలో దేనికీ కట్టుబడదు. నిజం చెప్పాలంటే దానిది ఖచ్చితంగా భిన్న దృష్టి. ఏమంటే అదే దాని సరైన విధి.

'ది బర్త్‌డే పార్టీ' అనే నా నాటకంలో పాత్రలను అంతిమంగా లోబరచుకొనే ముందు వాటికి అవకాశాల చిట్టడవిలో అన్ని ప్రత్యామ్నాయ మార్గాలలోను ప్రవర్తించడానికి, స్వేచ్ఛనిచ్చానని భావిస్తున్నాను. 'మౌంటెన్ లాంగ్వేజ్'లో ప్రత్యామ్నాయ కార్యకలాపాలకు అవకాశమివ్వలేదు. దానిలోని పాత్రలు క్రూరంగా వ్యవహరిస్తాయి. ఆ నాటకంలోని సైనికులు తమ ప్రవర్తన ద్వారా వినోదం పొందుతారు. చిత్రవధలు పెట్టడమనేది తేలిగ్గా విసుగుపుట్టిస్తాయని కొన్నిసార్లు మరచి పోతుంటారు. తమ పైశాచికత్వానికి ఉత్తేజం పొందడానికి అవి నవ్వుకోవాల్సిన అవసరమెంతైనా ఉంది. బాగ్దాద్‌లోని అబూ గరీబ్ జైలులోని పరిణామాలు ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. 'మౌంటెన్ లాంగ్వేజ్' 20 నిమిషాల పాటు మాత్రమే కొనసాగే నాటకం. అయితే అది అలా అదే పద్ధతిలో మళ్ళీ మళ్ళీ కొనసాగుతూనే ఉంటుంది.

సద్దాం హుస్సేన్ పెద్ద ఎత్తున భారీ



Pages_Jan 2009.pmd 30 4/19/2011, 4:53 PM

# సూర్యుడు నీ కుడిచేతిలో...

డా॥ మానేపల్లి



వాడిదీ మనిషి పుట్టుకే గద
వాడినీ కలలు కననిద్దాం
ఎవడి కలలమీద వాడికి
కాపీరైటు హక్కులుంటాయి
నిషేధించడానికి నువ్వెవరు నేనెవర్ని
వాడి కలలు వాడిని కననీ

పులి కలలు పులివి
లేడి భయాలు లేడివి
మొసలి కలలు మొసలివి
పాము కలలు పామువి
మన కలలు మనం కన్నప్పుడు
వాటి కలలు వాటివి
ఇందులో తప్పు పట్టడానికేం వుంది

ధృవప్రాంత మంచు పీఠభూములు కరిగి
భూఖండాలు మునిగిపోతాయట
నేల నేలంతా జలమయమైపోతుందట
ఆకాశ కంటి పటలానికి కన్ను పడి
సూర్యుడి మంటలు
మనగుండెల్లో కుంపటి పెడతాయట
స్త్రీబాలవృద్ధులు తారులా ఉడికిపోతారు
ఎవడి ప్రాణం వాడికి తీపి
కలలన్నీ కమ్మగా వుంటాయనుకోవడం కల్ల

నేల కనుచూపుమేర పచ్చగా ఉండాలనీ
నువ్వూ నీ కోడీ నీ కుంపటీ వెచ్చగా వుండాలి
పిల్లా పాప చల్లగా వుండాలనీ
ఆడవాళ్ల పసుపూ కుంకం
నిండు నూరేళ్లు నింపాదిగా వుండాలని-
2
సూర్యుడి నీ తూర్పు గదిలో పొడవాలనీ
పడమటింటి కాపురం చెయ్యాలనీ- నీ కల
జీవితమంత కల

మరి వాడి కలలు వాడికీ వుంటాయి
భూమండలం మొత్తం తన గుప్పెట్లో
వుండాలనీ
సప్తసముద్రాల్లో జలకాలాడాలనీ
కోటికి పడగెత్తాలనీ
డాలరునోటు మీద తన బొమ్మే వుండాలనీ
మొలిచిన మొక్కలన్నీ
తన పెరటి పొలంలోనే పండాలనీ
వాడూ నిరంతరం కలలు కంటూనే వుంటాడు

వాడిని వాడి కలలు కననీ
గోబ్రాహ్మణేభ్యః శుభ వస్తునిత్యం- అని
వాడూ స్వస్తివాచకమే పలుకుతాడు

నువ్వు గోవువీ కాదు, బ్రాహ్మడివీ కాదు
నీ కర్మకి వాడినెందుకు నిందిస్తావు

నీ చెమటని నువ్వు నమ్ముకున్నావు
నీ కల నిజం కావడం
నీ ఒక్కడి చేతిలో ఎలా వుంటుంది
ప్రపంచ చేతుల్లారా పిడికిళ్ళు బిగించండి
ఇప్పుడిక ఎవడి కల నిజమవుతుందో
కాలం చెబుతుంది
ఇల్లు అలకగానే పండగ కాదు
కల కనగానే నిజం అయిపోదు
గడ్డి పరకలన్నీ పేనితేనే
గజరాజు లొంగుతాడు
చూడు- సూర్యుడు ఉదయిస్తున్నాడు
నీ కుడిచేతిలో
పడమట గుంకేలోగా నీ కల నిజంకావాలి!

---

విధ్వంసక మారణాయుధాలను సమకూర్చు కున్నాడనే సాకుతో ఇరాక్‌ను ఆక్రమించు కోవడం జరిగిందన్న విషయం ఈ సమావేశం లోని ప్రతి ఒక్కరికి తెలుసు. సద్దాం వద్ద అణ్వస్త్రాలు, రసాయన, క్రిమి ఆయుధాలున్నా యని మనకు చెప్పారు. అది నిజం కాదు. ఆల్-ఖైదాతో ఇరాక్‌కు సంబంధాలు ఉన్నాయని, సెప్టెంబర్ 11 దాడులకు సహకరించిందని చెప్పారు. ఇది నిజమని మనకు నమ్మబలికారు. కాని ఇది నిజం కాదు. ప్రపంచ భద్రతకు ఇరాక్ ప్రమాదకారిగా పరిణమించిందని చెప్పారు. ఇది నిజం కాదు. సత్యం పూర్తిగా భిన్నమైనది. ప్రపంచ వ్యవహారాలలో తన పాత్రను అమెరికా ఏ విధంగా అర్థం చేసుకొంది. దానినే విధంగా నిర్వర్తించడానికి నిర్ణయించుకుంది అనేదానితో సత్యం ముడిపడి ఉంది.

వర్తమానాన్ని విలోకించే ముందు ఇటీవలి గతం అంటే ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం అమెరికా విదేశాంగ విధానం పోకడలపై నిశిత దృక్కులు సారించదలిచాను. ప్రపంచ యుద్ధానంతరం సోవియట్ యూనియన్ తూర్పు యూరప్‌లలో ఏమి జరిగిందో అందరికీ తెలుసు. వ్యవస్థీకృత క్రూరత్వం, అంతులేని దురాగతాలు, స్వతంత్ర ఆలోచన అణచివేత, ఈ విషాదాలకు సంపూర్ణ సాక్ష్యాధారాలు ఉన్నాయి? అవి ధ్రువీకరింపబడ్డాయి. అయితే నా వాదన ఏమిటంటే ఇదే కాలంలో అమెరికా పాల్పడిన నేరాలు సరిగా రికార్డు కాలేదు. అమెరికా నేరాలు చేసినట్టు అంగీకరించడం కాదు కదా, అసలు వాటిని నేరాలుగా గుర్తించడమే జరగలేదు! ఈ విషయంపై మనం దృష్టి నిలపాల్సిన అవసరమెంతైనా ఉందని నేను విశ్వసిస్తున్నాను. ఏమంటే ప్రపంచం నేడున్న విధంగా ఉండటానికి, ఈ వాస్తవాలకు మధ్య అవినాభావ సంబంధం ఎంతైనా ఉంది.

ఒక సార్వభౌమదేశాన్ని ప్రత్యక్షంగా ఆక్రమించుకోవడం ఎప్పుడూ అమెరికాకు ఏమంత ఇష్టమైన విధానం కాదు. ప్రధానంగా అది తక్కువ స్థాయి ఘర్షణ అనేదాన్ని ఇష్టపడుతుంది. దీని అర్థం ఏమంటే వేలాది మంది చనిపోతారు గాని ఒక్కసారిగా బాంబు వేసిన దానికంటే నెమ్మదిగా చనిపోవడం జరుగుతుంది. అంటే మీరు ఆ దేశాన్ని విషపూరితం చేస్తారు. ఒక కాన్సర్ వ్యాధి క్రిమిని సృష్టించి వదులుతారు. జనం లొంగిపోయాక లేదా చంపివేయబడ్డాక మీ స్నేహితులు అంటే సైనికాధికారులు, బడా కార్పొరేషన్లు రంగ ప్రవేశం చేసి సుఖంగా అధికార పీఠాలపై కూచుని కెమెరాల ముందుకెళ్లి ప్రజాస్వామ్యం పరిఢవిల్లిందంటూ ప్రకటనలు చేస్తారు. ఇది అమెరికా విదేశాంగ విధానంలో సర్వసాధారణమైన విషయం.

నికరాగ్వాలో జరిగిన విషాదం ఈ విషయంలో ప్రత్యేకంగా చెప్పుకోదగినది.. 1980లో లండన్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలో నేను వున్నాను. అక్కడి వామపక్ష



Pages_Jan 2009.pmd 31 4/19/2011, 4:53 PM

ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న కాంట్రా విప్లవ ప్రతీఘాతకులకు మరింత డబ్బు ఇవ్వాలా అనే విషయమై అమెరికా కాంగ్రెస్ ఆలోచిస్తున్నది. నికరాగ్వా తరపున మాట్లాడేందుకు వెళ్లిన ప్రతినిధి వర్గంలో నేనూ వున్నాను. అయితే ఆ ప్రతినిధి వర్గంలో అత్యంత ముఖ్యుడు ఫాదర్ జాన్ మెక్టాఫ్. అమెరికా పక్షానికి నాయకుడు రేమాండ్ సిట్జ్. తాము నిర్వహించే పాఠశాలను, ఆరోగ్య కేంద్రాన్ని కాంట్రాలు ధ్వంసం చేశారని, నర్సులపై అత్యాచారాలు జరిపారని చెబుతూ వారికి మీ సహాయం నిలిపి వేయండి అని ఫాదర్ మనవి చేశారు. చాలా మర్యాదస్తుడుగా, బాధ్యతాయుతమైన ఆధునికుడుగా పేరు పొందిన రేమాండ్ ఏమన్నాడంటే' ఫాదర్, మీకో మాట చెబుతాను. యుద్ధంలో అమాయకులు నష్ట పోవడం ఎప్పుడూ జరుగుతుంటుంది' అని. ఆ మాటలతో అక్కడ ఒక్కసారిగా మౌనం రాజ్యం చేసింది.

నిజమే, అమాయకులు ఎప్పుడూ బలవుతుంటారు.

చివరకు ఎవరో అన్నారు. ఇక్కడ అమాయకులు మీ సహాయం పొందుతున్నవారి వల్ల బలవుతున్నారు అని. మీరు చెప్పిన విషయాలు వాస్తవాలని నేను అంగీకరించడం లేదు అన్నాడు రేమాండ్. మేము ఆ రాయబార కార్యాలయం నుంచి వచ్చేస్తుండగా అక్కడి అధికారి ఒకరు నా నాటకాలు తాను చూసి ఆనందిస్తుంటానని అన్నాడు. నేనేమీ మాట్లాడలేదు. నికరాగ్వాను పాలించిన వామపక్ష శాండినిస్టాలు లోపరహితులని నేను చెప్పడం లేదు. కాని వారు తెలివైన వారు, హేతుబద్ధమైన వారు. నాగరికులు. ఒక స్థిరమైన బహుళత్వం గల, హుందా అయిన వ్యవస్థను నెలకొల్పేందుకు ప్రయత్నించారు. గొప్ప అక్షరాస్యతా ఉద్యమం నడిపారు. లక్ష కుటుంబాలకు భూమిపై హక్కులిచ్చారు. ఇలాటి అనేక మంచి చర్యలు చేపట్టారు. కాని అమెరికా మార్క్సిస్టు లెనినిస్టు కుట్రగా దాన్ని ఖండించింది. వారి ఉద్దేశంలో నికరాగ్వా చూపుతున్న ఆదర్శం ప్రమాదకరమైంది! చుట్టుపక్కల దేశాలు కూడా అదే మార్గం అనుసరించాలని చూస్తాయి. అప్పటికే పక్కనున్న ఎల్‌సాల్వడార్‌లో యధాతథ స్థితి వద్దంటూ తీవ్రమైన ప్రతిఘటన మొదలైంది.

మన చుట్టూ వున్న అబద్ధాలను గురించి నేను చెప్పాను. అధ్యక్షుడు రీగన్ నికరాగ్వా నిరంకుశ కుహరం అని తిట్టిపోశాడు. మీడియా కూడా మొత్తంపైన అదే ప్రచారం చేసింది. బ్రిటిష్ ప్రభుత్వం సరేసరి. కాని అందుకు ఎలాటి ఆధారాలు లేవు. అక్కడ హంతక దళాలు లేవు. చిత్ర హింసల తాలూకూ చిట్టాలు లేవు... నిజంగా చెప్పాలంటే అలాటివి పక్కనే ఎల్‌శాల్వడార్‌లో, గ్వాటిమాలాలో వున్నాయి. గ్వాటిమాలాలో ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని అమెరికా 1954లో కూలదోసింది. ఆ తర్వాత వెంట వెంట వచ్చిన సైనిక నియంతల చేతుల్లో 2 లక్షల మంది బలయ్యారు. ప్రపంచంలో అత్యంత ప్రతిభా వంతులైన ఆరుగులు జెసూట్లను 1989లో అమెరికాలో శిక్షణ పొందిన సాయుధ దళాలు శాన్‌శాల్వడార్ విశ్వ విద్యాలయంలో దారుణంగా కాల్చిచంపారు. సాహసవంతుడైన ఆర్కిబిషప్ రోమిరోను సామూహిక ప్రార్థన చేస్తుండగానే చంపేశారు. వారినెందుకు చంపేశారు? ఎందుకంటే వారు మరింత మెరుగైన జీవితం సాధ్యమేనని, అందుకోసం కృషి చేయాలని చెప్పారు గనక. అలా అనుకున్న మరుక్షణం వారు కమ్యూనిస్టుల్లా కనిపించడం మొదలెట్టారు... చివరకు ఎట్టకేలకు అమెరికా శాండినిస్టా ప్రభుత్వాన్ని గద్దెదించగలిగింది. దానిపై మొదట్లో కొంత ప్రతిఘటన వచ్చినా కొన్నేళ్ల తర్వాత ముప్పైవేల మందిని బలి, ఆర్థిక వేధింపులు సాగిన తర్వాత చివరకు నికరాగ్వా ప్రజల స్థయిర్యం దెబ్బ తినింది... అలసిపోయి మరో సారి దారిద్ర్యం కోరల్లో చిక్కారు. ఆ వెంటనే కాసినోలు వచ్చేశాయి. ఉచిత విద్య వైద్యం అదృశ్యం. బడా వ్యాపారం మరింత కక్షగా పున:ప్రవేశం చేసింది. ప్రజాస్వామ్యం ప్రవర్ధిల్లింది!

అయితే ఈవిధానం మధ్య అమెరికాకే పరిమితమైంది కాదు. ప్రపంచ మంతటా సాగుతున్న ఒక నిరంతర పోకడ.

ద్వితీయ ప్రపంచ యుద్ధమనంతరం ప్రపంచవ్యాప్తంగా మితవాద సైనిక నియంతృత్వాలన్నిటికీ అమెరికా మద్దతు నిచ్చింది. నియంతలు అధికారంలోకి రావడానికి తోడ్పడింది. ఇండోనేషియా, గ్రీస్, ఉరుగ్వే, బ్రెజిల్, పరాగ్వే, హైతీ, టర్కీ, ఫిలిప్పీన్స్, గ్వాటెమాల, ఎల్ సాల్వడార్, చిలీల గురించి నేను ప్రస్తావిస్తున్నాను. 1973లో చిలీ సైనిక నియంతల పాలు కావడంతో అమెరికా పాత్రను చరిత్ర ఎన్నటికీ క్షమించదు. ఈ దేశాలలో వేలాది ప్రజలు హతమారిపోయారు. మరెందరో మటుమాయమయ్యారు. ఇది వాస్తవం కాదా? అమెరికా విదేశాంగ విధానమే ఇందుకు కారణమా? అవును. అయితే ఈ విషయం మీకు తెలియకపోవచ్చు. అది సంభవించదు. ఏదీ ఎన్నడూ సంభవించదు. సంభవించినప్పుడు కూడా అది సంభవించడం జరగదు. ఇది చెప్పుకోదగిన విషయం కాదు. ఆసక్తి కలిగించని విషయం అమెరికా నేరాలు ఉద్దేశపూర్వకమైనవి. నిరంతరాయమైనవి. పశ్చాత్తాపం లేనివి. అయినప్పటికీ కొద్దిమంది మాత్రమే వాస్తవంగా వాటి గురించి మాట్లాడారు. మానవాళి శ్రేయస్సు పేరిట ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలను తన నియంత్రణ లోకి తెచ్చుకొంది. అమెరికా విజయం ప్రతిభావంతమైనది, చమత్కార మైనది, సమ్మోహనపూరితమైనది.

అమెరికన్ అధ్యక్షులు చేసే ప్రసంగాలు వినండి. 'అమెరికన్ ప్రజలు' గురించి వారి ఉద్ఘాటనలను నిశితంగా గమనించండి. 'అమెరికన్ ప్రజల హక్కులను రక్షించు కోవాల్సిన సమయమాసన్నమయిందని అమెరికన్ ప్రజలకు చెబుతున్నారు. మీ అధ్యక్షుడిని విశ్వసించండని అమెరికన్ ప్రజలను అడుగుతున్నాను. అమెరికన్ ప్రజల తరపున ఆయన తీసుకొనే చర్యలను విశ్వసించం డని అమెరికన్ ప్రజలను కోరు తున్నాను.' ఆలోచించే శక్తిని రూపుమాపడానికే వాస్తవంగా ఇటువంటి భాషను ఉపయోగిం చడం జరుగుతుంది. 'అమెరికన్ ప్రజలు' అనే పదాన్ని పదే పదే పునశ్చరణ చేయడం ద్వారా వారికొక భరోసా కల్పిస్తు న్నారు. ఇక ఆలోచించనవసరమే లేదు. ఆ భరోసాతో హాయిగా ఉండవచ్చు. అయితే ఇది దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న నాలుగు కోట్ల మంది ప్రజలకు, అమెరికా వ్యాప్తంగా వివిధ జైళ్లలో ఉన్న ఇరవై లక్షల మంది ఖైదీలకు ఈ భరోసా వర్తించదు.

మనం నైతిక స్పృహను కోల్పోయామా? అసలు మనకు వివేకముందా? అంతరాత్మ అనేది ఉందా? మన స్వంత చర్యల గురించి కాక, ఇతరుల చర్యలలో మన పాలు గురించి కూడా అంతరాత్మ పట్టించుకోదేం? గ్వాంటెనామో బే జైలును చూడండి. వందలాది ఖైదీలు గత మూడేళ్ళుగా ఎటువంటి ఆరోపణలు లేకుండానే



Pages_Jan 2009.pmd 32 4/19/2011, 4:53 PM

ఆ జైలులో మగ్గుతున్నారు. ఆ జైలు జెనీవా ఒప్పందానికి పూర్తిగా విరుద్ధం. అయినా దానిని సహిస్తున్నాము. ‘అంతర్జాతీయ సమాజం’ గురించి అమెరికా ఆలోచిస్తుందా? లేదు. ‘స్వేచ్ఛా ప్రపంచానికి నేత’నని చెప్పుకొంటున్న దేశం పాల్పడుతున్న ఘోరమిది. గ్వాంటనామో బే వాసుల గురించి మనమెప్పుడైనా ఆలోచించామా? మీడియా వారి గురించి చెబుతున్నదేమైనా ఉందా? ఆ ఖైదీలు ఇక తిరిగి రాని వారుగానే పరిగణిం చడం లేదా? ఆ ఖైదీలను చిత్రవధలకు గురిచేస్తున్నారు. వారిలో బ్రిటిష్ పౌరులూ ఉన్నారు. మరి బ్రిటిష్ విదేశాంగ మంత్రి వారి గురించి ఏమి చెప్పారు? ఏమీ చెప్పలేదు. బ్రిటిష్ ప్రధానమంత్రి ఏమి చెప్పారు. ఏమీ చెప్పలేదు. ఎందుకని? గ్వాంటెనామో బేలో తమ వ్యవహారాలను విమర్శించడం స్నేహపూరిత చర్య కాబోదని అమెరికా స్పష్టంగా చెప్పింది. మీరు మాతో ఉండకపోతే మాకు వ్యతిరేకంగా ఉన్నట్లేనని తేల్చివేసింది. కనుకనే టోనీ బ్లెయిర్ నోరు మూసుకున్నారు.

ఇరాక్ ఆక్రమణ ఒక బందిపోటు చర్య. ఉగ్రవాద దాడి. అంతర్జాతీయ న్యాయాన్ని ఎటువంటి మినహాయింపులు లేకుండా ఉల్లంఘించడమే. సంపూర్ణ అబద్ధాలతో మీడియా ద్వారా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసి నిర్హేతుకంగా ప్రదర్శించిన సైనిక ప్రతాపం. పశ్చిమాసియా, అరబ్ దేశాలపై సంపూర్ణ సైనిక, ఆర్థిక నియంత్రణను సాధించే లక్ష్యంతోనే ఇరాక్‌ను ఆక్రమించుకోవడం జరిగింది. అయితే ఒక నియంత పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిస్తున్నామనే సాకు చూపారు. ఈ ‘విముక్తి’లో వేలాది అమాయకులు హతమయ్యారు. లక్షలాది ఇరాకీలు క్షతగ్రాతులయ్యారు. ఇంకెందరో చిత్రవధలకు గురవుతున్నారు. ఇరాక్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించామని, ఆ దేశ ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కల్పించామని చెబుతున్నారు!

ఈ విషయంలో మృత్యువు అన్నదానికి ఏ విలువా లేదు. బుష్, బ్లెయిర్ ఉభయులూ మారణకాండను పట్టించుకోరు. కనీసం లక్ష మంది ఇరాకీలు అమెరికా బాంబులు, క్షిపణుల దాడిలో మరణించారు. వీరి ప్రాణాలకు ఏ విలువా లేదు. వారు చనిపోయినట్టు కూడా నమోదు కాదు.‘మేము శవాల లెక్కలు వేయం’ అన్నాడు అమెరికా జనరల్ టామీ ఫ్రాంక్స్... దాడి తొలిదశలో ఒక బ్రిటిష్ పత్రిక మొదటి పేజీలో టోనీ బ్లెయిర్ ఒక ఇరాకీ బాలుడిని ముద్దాడుతున్న ఫోటో ప్రచురించింది.‘బాలుని కృతజ్ఞత’ అని దానికింద రాసింది. తర్వాత కొన్నాళ్లకు మరో ఫోటో వచ్చింది. ఈ బాలుడికి చేతులు లేవు. వాళ్ల కుటుంబం క్షిపణి దాడిలో సర్వనాశనమై పోగా వాడొక్కడే మిగిలాడన్న కథనం కూడా దానితో పాటు ప్రచురితమైంది. ‘నాకు నా చేతులు తిరిగి ఎప్పుడొస్తాయి’ అని వాడు అడిగాడు. ఈ కథ చల్లగా తొలగింప చేయబడింది. ఔను కదా!టోనీ బ్లెయిర్ వాడిని అక్కున చేర్చుకోలేదు. అసలు క్షతగాత్రుడైన పిల్లాడెవరినీ ఆయన దగ్గరికి రానివ్వడు. దిక్కులేని శవాలను అంటుకోడు. రక్తం ఎంత అసహ్యకరమైంది? అది మీ చొక్కాను మురికి మురికిచేసి మీరు టెలివిజన్‌లో ఎంతో గొప్పగా ఇస్తున్న ప్రసంగాన్ని ఖరాబు చేస్తుంది.

ఇక 2000 అమెరికన్లు చనిపోవడం చికాకైన విషయం. వారిని చీకట్లో సమాధుల వద్దకు చేర్చాలి. చడీ చప్పుడు కాకుండా అంత్యక్రియలు జరిగిపోవాలి. క్షతగాత్రులైన వారు జీవిత పర్యంతం మంచాలపై మగ్గిపోవాలి. చనిపోయిన వారూ, గాయాలపాలైన వారూ మగ్గిపోవలసిందే. పద్ధతులే వేరు.

ఇక్కడ నేను పాబ్లో నెరూడా కవిత ఒకటి పేర్కొంటాను. దాని ద్వారా చాలా విషయాలు తెలుస్తాయి:

**ఒకానొక ఉదయం అంతా తగలబడిపోతోంది**
**అదో మహాగ్ని కీల**
**భూమండలంపై విరుచుకుపడింది**
**మానవాళిని కబళించేయసాగింది**

**ఇక అప్పటి నుంచి మంటలే**
**అప్పటి నుంచి మందుగుండే**
**అప్పటి నుంచి నెత్తుటి ధారలే**

**విమానాలు, నావలు గల బందిపోట్లు**
**ఉంగరాలు, దొరసానులను**
**వెంట పెట్టుకున్న బందిపోట్లు**
**ఆశీర్వదించే సాధుసంతుల**
**వెంటవున్న బందిపోట్లు**
**ఆకాశంలో నుంచి వచ్చారు**
**చిన్నారులను హతమార్చేందుకు**
**పసికందుల నెత్తురు వీధుల్లో ఏరులై పారింది**
**చడీ చప్పుడు లేకుండా పిల్లల నెత్తురు లానే**
**నక్కలు కూడా అసహ్యించుకునే నక్కలు**
**బ్రహ్మ జెముళ్లు కూడా భరించలేని బండరాళ్లు**
**నల్ల తాచులు కూడా చీత్కరించే నల్లతాచులు**

**నీవు తారసపడ్డాకే నేను నెత్తురు**
**స్పెయిన్ శిఖరంలా ఎగిసిపడడం చూశాను**
**అభిమానం, కత్తుల వరదలో ఒక్కసారిగా మీరు మునిగిపోతారు**
**విద్రోహపూరిత**
**సైనాధిపతులు**
**నా భూత గృహాన్ని సందర్శిస్తారు**
**శిథిలమైన స్పెయిన్‌నుచూస్తారు**
**ధగ్ధమైన ప్రతిఇంట్లోంచీ**
**కాలుతున్న లోహపు మంటలు**
**స్పెయిన్‌లోని ప్రతి కుంపటిలోంచీ**
**పూలకు బదులు మంటలు**
**స్పెయిన్ తిరిగి లేస్తుంది**
**ప్రతి మృత శిశువులోంచీ**
**తుపాకీలు కళ్లలో పెట్టుకుని లేస్తుంది**
**నేరస్తుల తూటాలలోంచీ జీవితం ప్రభవిస్తుంది**
**అదే ఒకనాటికి**
**మీ గుండెలు చీలుస్తుంది**
**మీరడుగుతారు: ఆయన కవిత్వం**
**కలలు ఆకుల గురించి గాక**



Pages_Jan 2009.pmd 33 4/19/2011, 4:53 PM

**తన దేశపు మహాగ్ని పర్వతాల గురించి  లేదేం**

**రండి,వీధుల్లో పారే రక్తం చూడండి**
**రండి చూడండి**
**వీధుల్లో రక్తం**
**రండి చూడండి**
**వీధుల్లో  రక్తం**

నేనొక విషయం చెప్పాలి. నెరూడా కవితను చెబుతున్నానంటే సద్దాం ఇరాక్‌ను నాటి స్పెయిన్‌ను పోలుస్తున్నానని కాదు.పౌరులపై బాంబుదాడి భయానకత్వాన్ని అంత శక్తివంతంగా వర్ణించిన పద్యం  నేనెక్కడా చదవలేదు కనకే దాన్ని పేర్కొన్నాను.

అమెరికా ఇప్పుడు తన విధానాన్ని బాహాటంగానే ప్రకటిస్తోంది. సర్వసంపూర్ణ ఆధిపత్యం తన లక్ష్యమంటోంది. సర్వ సంపూర్ణంగా. అది ఇప్పుడు ప్రపంచ వ్యాపితంగా132 దేశాలలో 702 సైనిక స్థావరాలను కలిగివుంది.   స్వీడన్ ఒక్కటే ఇందుకు గౌరవనీయమైన మినహాయింపు. ఇన్ని చోట్లకు వారెలా చేరగలిగారన్నది ఆశ్చర్యమే. ఏమైనా వారు చేరారు. దాని  దగ్గర గట్టిగా పనిచేసేఅణుబాంబులు 8000 వున్నాయి.రెండు వేల బాంబులు పావుగంటలో ప్రయోగించేంత సర్వసిద్ధంగా వున్నాయి. ఇప్పుడది రక్షణ కందకాలను ధ్వంసం చేయగలసరికొత్త అణ్వాస్త్రాల తయారీలో నిమగ్నమై వుంది. వారికి సహాకరించేందుకు సదా సంసిద్ధమనే బ్రిటిష్ వారు తమ అణ్వాస్త్రాలను కూడా మార్చి కొత్తవి పె ట్టమని అడుగుతున్నారు. ఇంతకూ ఇవన్నీ ఎవరిపైకి ఎక్కుపెడుతున్నారని నాకు సందేహం కలుగుతుంటుంది. ఒసామా బిన్‌లాడెన్‌పైనా? మీ పైనా? నా పైనా? చైనాపైనా? పారిస్ పైనా? ఎవరికి తెలుసు? ఇదో బాల్యాంక విపరీతమని మాత్రం మనకు తెలుసు. అణ్వాస్త్రాలు కలిగివుండటం, వాటిని ఉపయోగిస్తా మని బెదిరించడం.. ఇదే ఇప్పటి అమెరికా రాజకీయ తాత్వికతకు మూలసూత్రం... అమెరికాలో లక్షలాది మంది తమ ప్రభుత్వ చర్యల పట్ల ఆగ్రహావేశాలతో వున్నారు. మనస్సు కష్టపెట్టుకుంటున్నారు.కాని వారింకా ఒక రాజకీయ శక్తిగా వున్నట్టు కనిపించదు. అయితే ఈ ఆందోళన, అనిశ్చితి,భయం రోజురోజుకూ పెరుగుతున్నదే గాని తగ్గే సూచనలు లేవు.

ఒక రచయిత జీవితం దుర్భలమైనది. అది దాదాపుగా అనావృత కార్యకలాపం. దాని గురించి మేము రోదించనవసరం లేదు. రచయిత ఒక నిర్ణయం తీసుకుంటాడు. దానికి కట్టుబడి ఉంటాడు. అయితే అన్ని పవనాలు నిన్ను తాకుతాయనడం చెప్పడంలో సత్యం ఉంది. ఆ పవనాలలో కొన్ని శీతవాయువులు సుమా. నీవు నీ సొంతంగా వాటిని తట్టుకోవాలి. ఎలాంటి ఆశ్రయమూ నీకు దొరకదు. రక్షణ ఉండదు – అబద్ధాలాడితే తప్ప. అటువంటి పరిస్థితిలో నీవు నీ రక్షణ చేసుకోవాలి. ఇందుకై నీవు రాజకీయవేత్తవు కావచ్చు. అద్దంలోకి చూసినప్పుడు మన ఎదుట ఉన్న ప్రతిబింబం కచ్చితమైనదని భావిస్తాము. అయితే ఒక మిల్లీమీటరు కదలండి. ప్రతిబింబం మారి పోతుంది. వాస్తవంగా దరీదాపులేని ప్రతిబింబాల వైపు చూస్తున్నాము. అయితే కొన్నిసార్లు రచయిత అద్దాన్ని పగులగొట్టవలసి వస్తుంది. ఏమంటే అద్దానికి ఆవలివైపున ఉన్న సత్యం మనలను తేరిపార చూస్తుంటుంది. మన మేధో కట్టుబాటు ఎంత దృఢమైనదైనా, అచంచల మైనదైనా, నిష్కాపటమైనదైనా, పౌరులుగా మన జీవితాలు, మన సమాజాల నిజమైన సత్యాన్ని నిర్వచించవలసి ఉన్నదని నేను విశ్వసిస్తున్నాను. ఇదెంతో బృహత్తర బాధ్యత. దీనిని నిర్వర్తించడం మన విధి. మన రాజకీయ దార్శనికతలో ఇటువంటి కర్తవ్యానికి తావు లేనప్పుడు, మనం దాదాపుగా కోల్పోయిన మానవ హుందాను పునరుద్ధరించ గలమని ఆశాభావానికి ఆస్కారమూ లేదు. ◆


**'ప్రస్థానం'కు చందా కట్టండి!**
**నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి!!**

సాహిత్య ప్రస్థానం మాసపత్రిక చందా వివరాలు

**సంవత్సర చందా (వ్యక్తులకు) : రు.120/-**   **సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-**

**అయిదేళ్లకు : రు. 500 /-** — **పదేళ్లకు : రు. 900/-** — **విడి ప్రతి : రు. 10/-**

**చందా దారులకు విజ్ఞప్తి**
**చిరునామా పైన  చందా ప్రారంభ  మరియు ముగింపు నెలలు సూచించబడినవి. దయచేసి చందా ముగిసిన వారు తమ ముగింపు నెలను గుర్తించి వెంటనే చందాను పునరుద్ధరించుకోగలరు.**

మేనేజర్
ప్రస్థానం
**1-1-187/1/2, వివేక్‌నగర్,  చిక్కడపల్లి,  హైదరాబాద్-20**
వివరాలకు : **040-27660013**, సెల్: **9490099059** ; ఇ.మెయిల్:Prasthanam_ss@yahoo.co.in





Pages_Jan 2009.pmd 34 4/19/2011, 4:53 PM

# ప్రేమైక జీవనం

కథ



**- వి. వెంకటరావు**

**ఉదయం ఆరుగంటల వేళ విజయవాడ ప్లాట్‌ఫారం, ఉహించినంత రద్దీగా లేదు. విశాఖ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బయలు దేరటానికి సిద్ధంగా ఉంది. వేకువ జామున ప్రయాణం కావడం మూలాన, ప్రయాణికులు ప్రెష్‌గా ఉన్నారు.**

చేతిలో ఏ లగేజి లేకపోవడంతో కాస్త నిదానం గానే ఎక్కాను. కంపార్ట్‌మెంట్లు అన్నీ లింక్ ఉండటం చేత, రెండు మూడు కంపార్ట్‌మెంట్స్ వెతకగానే సీటు దొరికింది. ఇంత వయస్సు వచ్చినా, ఈనాటికీ కిటికీ ప్రక్క సీటంటే మక్కువే. కిటికీ ప్రక్క సీటు దొరికితే ఎంత దూరం అయినా ప్రయాణం చేసెయ్యవచ్చు అనుకుంటాను.

బండి నెమ్మదిగా శబ్దం చేస్తూ కదిలింది. మరికాసేపటికే వేగం పుంజు కుంది. కిటికీ ప్రక్కనే ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ కూర్చున్నాను. చల్లటి గాలి శరీరాన్ని తాకుతుంది. బండి వేగం పెరుగుతున్న కొద్దీ, గాలి వేగం పెరుగుతుంది. కానీ నా ఆలోచనలన్ని కార్తీక్ మీదే ఉన్నాయి. ఎలా ఉన్నాడో పదకొండు రోజుల ముందే వెళ్లవలసింది ఇక అప్పుడు అయ్యింది కాదు. అప్పటికప్పుడు శెలవు అనగానే దొరికే పరిస్థితి లేదు ఆఫీసులో. వెళ్లినా ప్రయోజనం లేదు. ముఖం చూస్తామన్న ఆశలేదు. అందుకే మరి ఆరోజు వెళ్లలేదు. ఇక ఈరోజు తప్పదు. అసలు తప్పదు అని అనుకోకూడదు. అది మన బాధ్యత. స్నేహితులుగా మన అండా, మాటలూ దుఃఖంలో ఉన్నవారికి ఎంతో ఊరటని ఇస్తాయి. ఆత్మీయమైన కరస్పర్శ, అవతలి వ్యక్తులకు తెలియని, అనిర్వచనీయమైన ధైర్యాన్ని ఇస్తుంది. ఆ కరస్పర్శ ఆ మనసు నుండి ఈ మనసుకి ఒక విద్యుత్ ప్రవాహంలాగా ప్రవహించి 'నీకు, నేనున్నాను' అనే భాష లేని భావాన్ని తెలియ జేస్తుంది. కార్తీక్ తండ్రి చనిపోయారంటే నమ్మశక్యం లేదు. అతని రూపం ఇంకా కళ్ళలో కనిపిస్తూనే ఉంది.

ఆలోచనలన్నీ గతంలోకి వెళ్లాయి.

మూడేళ్ళ క్రితం విశాఖలో ఉండేవాడు సురేంద్ర. అదే ఆఫీసులో పనిచేసేవాడు కార్తీక్. ఇద్దరివీ ప్రక్క ప్రక్క సీట్లు. దానికి తోడు ఇద్దరి ఇళ్ళు ఒకే ప్రాంతం కావడం మూలాన, తరచు కలుస్తుండేవాళ్ళము. అక్కడ పనిచేసిన మూడేళ్ళూ, ఆఫీసులో ఎక్కువగా ఇతర ఉద్యోగస్తులతో లేని చనువూ, పరిచయం కార్తీక్‌తో ఏర్పడ్డాయి.

నిజానికి కార్తీక్‌తో చనువు నేనే ఎక్కువ చేస్తున్నాని చెప్పాలి. ఎందుకంటే అతని పద్దతులూ, అలవాట్లు నాకెంతో నచ్చేవి.

ఎందుకో తెలియదు గానీ, కార్తీక్ ఎక్కువగా ఎవరితోనూ కలిసేవాడు కాదు. ఎప్పుడూ ముభావంగా ఉండేవాడు. ఎవరైనా పలకరించినా, ఏమైనా అడిగినా, ముక్తసరిగా సమాధానం ఇచ్చేవాడు. అందరికీ ఎందుకో అతను బాధపడు తున్నాడని తెలిసేది. ఎందుకని ఏనాడు నేను అడగలేదు.



Pages_Jan 2009.pmd 35 4/19/2011, 4:53 PM

అక్కడకు వెళ్లిన కొత్తలో కార్తీక్ తో ఎక్కు వగా మాట్లాడక పోయినా, ఒకే ప్రాంతంలో ఇల్లు ఉండటంమూలాన, ఆఫీసుకు వెళ్ళే టప్పుడో, వచ్చేటపుడో ఇద్దరం అప్పుడప్పుడు కలిసే వాళ్ళం. నాకు బైక్ ఉండటం మూలాన నేనే వెనుక కూర్చోమనేవాడిని. కూర్చోవడానికి ఇష్టపడే వాడు కాదు. నేనే బలవంతంగా కూర్చో మనే వాడిని. అయిష్టంగానే కూర్చోనేవాడు.

నేను జాయిన్ అయిన కొత్తలో ఆఫీసులో అందరం అరకు పిక్నిక్‌కి వెళదాం అని అనుకున్నాం. మా బ్లాక్‌లో ఉన్నవాళ్ళం ముప్పయిమంది, మనిషికి రెండొందలు. అందరూ కుటుంబాలతోనే బయలు దేరు తున్నారు. నాకెలాగూ పెళ్లి కాలేదు. నేను మాత్రం ఒంటిగాడిని. కార్తీక్‌ని అడిగితే "నేను రానన్నాడు" "ఏం రావని" అడిగితే "ఏంలేదులే" అన్నాడు. పిసినారోడు అనుకున్నాను.

కార్తీక్ "రానన్నాడని" మా కొలీగ్స్‌తో చెప్పాను.

"పిసినారి కొడుకు తాగడానికి మాత్రం డబ్బులొస్తాయి. పెళ్లాం పిల్లలతో సరదాగా అందరం వెళ్దాం రారా బాబు అంటే మనసొప్పదు. ఒక్కసారి కూడా కుటుంబం అంతా కలిసి సినిమాకైనా వెళ్తారో లేదో, ఎప్పుడూ చూడలేదు" అన్నాడు సహోద్యోగి కిరణ్.

"ఏమోరా బాబు నేనూ ఎప్పుడూ చూడలేదు. వారానికి మూడు నాలుగు రోజులు మాత్రం తప్పనిసరిగా బ్రాంది షాపు దగ్గర మాత్రం దర్శన మిస్తాడు." అన్నాడు ఇంకో వ్యక్తి. కార్తీక్‌కి మందు అలవాటు కూడా ఉందా అను కున్నాను కానీ మనిషి మాత్రం అలాలేడే. అందుకేనేమో నా బైక్ కూడా ఎక్కడానికి ఇష్టపడడు. అయితే కొన్నాళ్ళకు గానీ అతని ఇంటి సంగతులు తెలియలేదు.

కార్తీక్‌కు భార్యా, ఇద్దరు పిల్లలు. ఇంట్లో వృద్ధ తల్లిదండ్రులు. మొత్తం ఇంటి భారం అంతా కార్తీక్‌దే. వచ్చే జీతంలోనే అన్ని సమకూర్చుకోవాలి. చాలా ఇబ్బందులు పడుతుండేవాడు.

పిల్లల చదువులూ, ఇంటి ఖర్చు, ఇంటి అద్దె, అన్నిటి కన్నా ముఖ్యం తండ్రి మందులూ ఇలా ఇంటి బడ్జెట్ అంతా నాకు చాలా ఆశ్చర్యకరంగా ఉండేది. ఇంతటి ఖర్చుని ఆ జీతం రాళ్ళ మీద ఎలా నెట్టుకొస్తున్నాడో ఓ పజిల్ లాగా ఉండేది.

ఇక కార్తీక్ సంగతి. బయట ఒక్క 'టీ' తప్ప, అదీ రోజుకి ఒకటే, అంతకు మించి మరే ఖర్చు ఉండేది కాదు. అలా ఉంటే అతను ఏదో ఇంటి ఖర్చుని మానెయ్యాలి. మానెయ్యడానికి సాధ్యంకాని, తప్పని సరి ఖర్చులే అవన్నీ. ఒక పద్ధతిగా ఉండేది ఇంటి బడ్జెట్. అంత పొదుపుగా లేకపోతే అప్పులు చెయ్యాలి. అప్పులు చెయ్యడానికి పెద్దగా ఇష్టపడేవాడు కాదు. చాలా గుప్తంగా, పొదుపుగా ఉన్న మనిషిని దాదాపు వెయ్యి రూపాయిలు ఖర్చుతో పిక్నిక్ రాలేదని, నింద వెయ్యడం భావ్యం కాదు. ఆ విషయాలేవి మా కొలీగ్స్‌తో చెప్పలేదు కానీ అతని మందు ఖర్చు సంగతి తెలలేదు. అను కోకుండా ఆ రహస్యం కూడా బయటపడింది.



ఒక ఆదివారం ఆఫీసు విషయమై చిన్న కబురు చెప్పడానికి ఇంటికి వెళ్ళాను. ఇంత వరకూ ఇంటి లోపలకు ఒక్కసారి కూడా వెళ్ళింది లేదు. చిన్న, చిన్నవి రెండు గదులు. "కార్తీక్"! అంటూ బయటనుండే పిలిచాను.

నా పిలుపు విని బయటకు వచ్చాడు. "లోపలికి రా!" అంటూ తను లోనికి నడిచాడు. అక్కడే ఫైబర్ కుర్చీ చూపించి తను ఇంకో కుర్చీలో కూర్చు న్నాడు. గది అంతా పరిశీలనగా చూసాను. ఎక్కువ సామాన్లు లేవు. ఇంతలో కార్తీక్ భార్య కాఫీ కలిపి తెచ్చింది. తన భార్యను పరిచయం చేసాడు. పిల్లల్ని పిలిచి వాళ్ళను కూడా పరిచయం చేసాడు. "ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికి వెళ్లాడు.

కాఫీ తాగి, గ్లాసు కింద పెట్టాను. ఏమీ తోచడం లేదు. వచ్చిన విషయం, ఆఫీసు విషయమై తనతో కాసేపు మాట్లాడాలి. లోపలికి వెళ్లిన మనిషి ఇంకా రాలేదు. ఏం చేస్తున్నాడా అని లోపల గదిలోనికి తొంగి చూసాను. పక్కగదికి అటాచ్‌డ్ బాత్‌రూం. కార్తీక్ బాత్‌రూం తలుపు దగ్గరే నిలబడ్డాడు. ఇంతలో బాత్‌రూం తలుపు తెరుచుకొని ఓ ముసలి వ్యక్తి నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ బయటకు వస్తున్నాడు.

ఇంతలో దగ్గరే ఉన్న కార్తీక్ ఆ వ్యక్తి కుడి చెయ్యిని తన మెడ చుట్టూ వేసు కున్నాడు. తన చెయ్యిని అతని నడుం చుట్టూ వేసి నెమ్మదిగా మంచం వరకు వచ్చారు.

ఎదురుగా టి.విలో వార్తలు వస్తున్నాయి. మంచం మీద తెల్లని లుంగీ ఇస్త్రీ మడతలో ఉంది. కార్తీక్ సహాయంతో నడుం మీద ఉన్న టవల్ తీసి, లుంగీ కట్టుకున్నాడు. అతను కట్టుకున్నాడు అనే కన్నా కార్తీక్ కట్టాడు అంటే బాగుంటుంది. ఎందుకంటే ఉండీలేనట్లే. నెమ్మదిగా మంచంలో చేగిరబడి కుడిచేత్తో రిమోట్ అందు కుని ఛానెల్స్ మారుస్తున్నాడు. అతని ప్రక్కనే మంచం కింద బ్రాంది బాటిల్ ఉంది.

అప్పుడు అర్థం అయ్యింది కార్తీక్ అప్పుడప్పుడు ఎందుకు బ్రాంది షాపు దగ్గర కనిపిస్తున్నాడో ఆఫీసులో అందరూ అనుకున్నట్లు అతను తాగుబోతు కాదు. ఆ విషయం అలా ఉంచితే, అతనికి వచ్చే జీతానికి, అతని ఇంటి ఖర్చే అంతంత మాత్రంగా ఉంటే, అందులో ఈ మందు ఖర్చు కూడా.

కార్తీక్ దగ్గర చాలా నేర్చు కోవాలి. సంసారంలో ఏది అవసరమైన ఖర్చు, ఏది అనవసరమైన ఖర్చు అనే స్పష్టమైన విభజన ఉండేది. అనవసరమైన ఆడంబరాలకీ, భేషజాలకీ దూరంగా ఉండేవాడు. అతని భార్య ఒంటిమీద అణా ఎత్తు



Pages_Jan 2009.pmd 36 4/19/2011, 4:53 PM



బంగారం కూడా చూడలేదు. పిల్లల చదువుల విషయంలో, అవసరమైన ఖర్చుల విషయంలో డబ్బు ఖర్చు పెట్టడానికి వెనకాడేవాడు కాదు.

"టీ, కాఫీ" అనే మాటలు వినిపించేసరికి ఒకసారిగా వర్తమానంలోకి వచ్చాను. అప్పటికే బండి అనకాపల్లి దాటేసింది. ఇంకో గంటా, గంటన్నరలో విశాఖ చేరుకోవచ్చు. అప్పటికే దగ్గరగా వచ్చిన టీ కుర్రవాడి దగ్గర టీ తీసుకు త్రాగాను. కాస్త రిలీఫ్‌గా ఉంది.

ఆ తరువాత కొద్ది నెలలకే నాకు విజయవాడ ట్రాన్స్‌ఫర్ కావడం మూలానా కార్తీక్ దూరం అయిపోయాడు. అప్పుడప్పుడు నేనే ఫోన్ చేసేవాడిని. క్షేమ సమాచారాలూ, ఆఫీసు విషయాల అనం తరం "మీ నాన్నగారికి ఎలా ఉంది?" అనడం మామూలయి పోయింది.

ఆ తర్వాత ఈ మధ్యనే కార్తీక్ నాన్నగారు చని పోయారని ఈ కబురు. కార్తీక్ ఎలా ఉన్నాడో అన్నదే నా ఆలోచనంతా. తండ్రికి అన్నీ సమకూర్చాడు తండ్రిని అమితంగా ప్రేమిం చాడు. బాధని ఎలా దిగమింగు కున్నాడో.

బండి విశాఖకు చేరుకునే సరికి సరిగ్గా పన్నెండు గంటలయ్యింది. చేతిలో లగేజీ ఏమీలేనందున త్వరగా బయటపడ్డాను. కార్తీక్ ఉండేది ఆనందాపురం దగ్గర ఓ మూడు కిలోమీటర్ల దూరంలో సత్తెనపల్లి అనే చిన్న గ్రామం. అది వాళ్ల స్వంత ఊరు. ఉద్యోగరీత్యా విశాఖలో ఉంటున్నాడు. ప్రస్తుత కార్యక్రమం ఆ చిన్న గ్రామంలోనే. బస్సులు దొరకడం పెద్ద కష్టం కాలేదు. ఆనందపురం దగ్గర దిగి, ఆటోలో సత్తెనపల్లి చేరుకున్నాను.

చిన్న ఊరు కావడం మూలాన అడ్రస్ కనుక్కోవడం పెద్ద కష్టం కాలేదు. కాస్తంత నడక దూరంలోనే ఉంది ఇల్లు. బయట షామియానా వేసి ఉంది. ఫైబర్ కుర్చీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఇంట్లో అందరూ బంధు జనం ఉన్నారు. అందులో ఎవరితోనూ పరిచయం లేదు. షామియానాలో ఒక ప్రక్కగా టేబుల్‌పై, తెల్లటి గుడ్డపరచి, దానిపై కార్తీక్ నాన్నగారి ఫోటో ఉంచారు. ప్రక్కనే అగరొత్తులు వెలుగుతున్నాయి. ఇత్తడి కుందులలో దీపం వెలుగుతుంది. అగరొత్తుల వాసన చుట్టు అలముకుంటుంది.

ఒక ప్రక్కగా కుర్చీలో కూర్చు న్నాను. నేను ఎవరికీ పరిచయం లేకపోవడం వలన, వచ్చింది ఎవరా, అని చూసి వెళిపోతున్నారు. ఇంట్లోకి వెళ్ళి చెప్పారేమో, కార్తీక్ భార్య తొందర నడకతో వచ్చింది. ఆమె ఒక్కరే నాకు పరిచయం.

"అన్నయ్యగారు బాగున్నారా"? అంది.

బాగానే ఉన్నాను అన్నట్లుగా చిన్న చిరునవ్వు నవ్వి "కార్తీక్ ఏదమ్మా" అన్నాను.

"వచ్చేస్తారు అక్కడ కార్యక్రమాలు ఏవో ఉంటాయిగా అందరూ వెళ్లారు"

"సరేనమ్మా నీ పనులేవో నీకు ఉంటాయిగా. వెళ్లి చూసుకో నేనుం టానులే" అంటూ ఆమె ఉంటుండగానే తెచ్చిన స్వీట్ ప్యాకెట్ ఫోటో దగ్గర పెట్టి నమస్కరించి వచ్చి కూర్చున్నాను.

వేసవి మూలాన ఎండ ఎక్కువగా ఉన్నా, షామియానా చల్లగానే ఉంది. పట్టణపు రణగొణ ధ్వనులేమీ లేవు. చల్లని గాలి సేదతీరుస్తుంది. కార్తీక్ పిల్లలిద్దరూ ఆడుకుంటున్నారు. ఈ మూడేళ్ళకే కాస్త పొడుగు అయినట్లు న్నారు. మరికాస్త దూరంలో చిన్న షామియానాలో భోజనాలు తయారవుతున్నాయి.

కాసేపటికి కార్తీక్ దూరంగా కనిపించాడు. వెనుక నలుగురైదుగురు ఉన్నారు. తలకిస్నానం చేసినట్లున్నాడు. తెల్లటి లుంగీ, పైన తెల్లటి తువ్వాలు కప్పుకుని నెమ్మదిగా వస్తున్నాడు.

దూరంగా నన్ను చూస్తూనే పలకరింపుగా నవ్వాడు. వెనక వచ్చిన వాళ్ళతో ఏదో మాట్లాడుతున్నాడు.

'పాపం కార్తీక్. కొండంత బాధను గుండెల్లో దాచుకున్నాడు. అమితంగా ప్రేమించిన తండ్రి దూరం అయ్యాడు. బహుశా తల్లిదండ్రులపట్ల ఇంత ప్రేమగా ఎవరూ ఉండలేరేమో. నేనూ ఉండలేనేమో. ఇలాంటి వాటికి ఇంట్లో భార్య సహకారం కూడా ఉండాలిగా. కార్తీక్ భార్య చాలా మంచిది. లేకపోతే ఈ రోజుల్లో ఇంత చేసేవాళ్లేరి. ఆమె సహకారమే లేకపోతే ఇంతటి బరువుని ఎలా మొయ్యగలడు. మనసులో తండ్రిపట్ల ఎంత అభిమానం ఉంటే మాత్రం ఒక్కడే ఏం చెయ్యగలడు. ఇలా పరిపరి విధాలుగా ఆలోచనలు వస్తున్నాయి'.

కార్యక్రమానికి వచ్చిన వాళ్ళతో, వంటవాళ్ళతో ఏదో మాట్లాడుతున్నాడు కానీ... ఏదో ఆశ్చర్యకరమైన విషయం జరుగుతోందా అనిపిస్తుంది. కార్తీక్ మాటల్లో ముఖకవళికల్లో ఏదో తేడాను గమనించాను. మూడేళ్ల క్రితం కార్తీక్‌కీ, ఇప్పటి కార్తీక్‌కీ ఏదో తేడా ఉంది అనిపిస్తుంది. అదేంటో తెలియడం లేదు. అతన్ని చూసిన ఆ కొద్దిపాటి సమయానికే, మాటల్లో... చేతల్లో... చెప్పలేక పోతున్నాను. అర్థం చేసుకోలేక పోతున్నాను.

'మనసులోని భావాలకు ముఖం ప్రతినిధి' అంటారు, అంతర్గతంగా ఏదో ఉంది. కార్తీక్ ప్రవర్తనలో గతం ఉన్న ముభావం ఇప్పుడు లేదు. తెలియని ఆనందం బయట పడుతోంది. అది ఆనందం అని చెప్పటానికి కూడా లేదు. ఇంకా ఏదో ఉంది. స్పష్టత లేదు. చెప్పలేకపోతున్నాను. ఏదో... ఏదో...

భోజనాల కార్యక్రమం ప్రారంభం అయింది. ఊర్లోవాళ్ళు, బంధువులు అందరూ వచ్చి భోజనం చేసి వెళు తున్నారు. విశాఖ పట్నం నుండి కార్తీక్ కొలిగ్స్ కూడా వచ్చారు. అందులో ఒకతను నేను పనిచేసే టైమ్‌లో ఉన్న రామకృష్ణ. అతని రాకతో కాస్త వేరే మాటల్లో పడ్డాను. అక్కడి ఆఫీసు విశేషాలు,



Pages_Jan 2009.pmd 37 4/19/2011, 4:53 PM

ఇతర భోగట్టాలతో కాస్త కాలక్షేపం అయిపోతుంది. కాసేపటికే రామకృష్ణ, నేనూ కలిసి భోజనాలు చేసాము. నేను భోజనం చేస్తున్నా, రామకృష్ణతో మాట్లాడు తున్నా నా దృష్టి అంతా కార్తీక్‌మీదే ఉంది.

'ఎంత టైమ్ అయినా కార్తీక్‌తో కాసేపు మాట్లాడాలి' అని నిశ్చయించు కున్నాను.

మరి కాసేపటికే రామకృష్ణ వెళ్ళిపోయాడు. నన్ను రమ్మనమన్నాడు. "తరువాత వస్తాలే" అని అతన్ని పంపించే సాను. ఒక్కొక్కరు వెళ్లి పోతున్నారు. అప్పటికే సాయంత్రం నాలుగు గంటలు దాటిపోయింది.

మరీ ముఖ్యమైన బంధువులు తప్ప చాలామంది వెళ్లిపోయారు. నాతో మనసు విప్పి మాట్లాడాలని కార్తీక్కి కూడా ఉన్నట్లుంది. ఇద్దరం బయటకు నడచి ఊరి చివర వరకూ వచ్చాం.

అది వేసవికాలం సాయంత్రం కాస్త చల్లబడింది వాతావరణం. చెరువు మీద నుండి వచ్చే చల్లనిగాలి శరీరాన్ని చల్లబరుస్తుంది. నెమ్మదిగా వస్తున్న గాలికి, చెరువులోని చిన్న అలలు ఒడ్డుకు చేరే ప్రయత్నాన్ని చేస్తూ, మధ్యలోనే అదృశ్యమవుతున్నాయి. పడమటన సూర్యుడు లోకానికి సింధూరం రంగు పులుముతూ, కొండల్లో నిష్క్రమించడానికి సిద్ధంగా ఉన్నాడు. చెరువు మధ్యలో చిన్న పక్షుల గుంపు ఏమి పట్టించుకోకుండా, ముక్కుతో నీటిలో ఏదో ఏరుకుంటూ ఆహారాన్వేషణలో ఉన్నాయి.

చెరువు ఒడ్డున ఉన్న రెండు బండరాళ్ళపై కార్తీక్, సురేంద్రలు కూర్చొని ఉన్నారు.

కార్తీక్ ఏమీ మాట్లాడటం లేదు. తదేకంగా చెరువులోని పక్షుల వైపే చూస్తున్నాడు. నాకు ఏం మాట్లాడాలో తెలుసు. కానీ ఎలా ప్రారంభించాలో తెలియదు. అడగాల్సిన ప్రశ్న అడిగేయాలి. మనసుని దొలిచేస్తుంది. ఆ ప్రశ్నని తనతో వెంట తీసుకువెళ్లిపోతే, అది తనను వెంటాడుతుంది. దానికి అతను సమాధానం చెప్పలేడు. చెప్పగలిగిన కార్తీక్ తన వెంటరాడు. ఎట్టకేలకు...

"కార్తీక్! మీ నాన్నగారు చాలా అదృష్టవంతులు. చివరి రోజులు ఏ ఇబ్బంది లేకుండా అతనికి గడిచాయి. రత్నం లాంటి కొడుకును కన్నందుకు జన్మ ధన్యమయింది. ఎంత అదృష్టవంతులు అని అనుకున్నా, నిన్నటి వరకూ మనతో మెసలిన వ్యక్తి, నిన్నటి వరకూ మనతో మాట్లాడిన వ్యక్తి, ఈ రోజు మన మధ్యలేడు అంటే అది ఏమిటి? ఆ వ్యక్తి ఎక్కడికి వెళ్లిపోయాడు. ఇత్యాది ప్రశ్నలన్నీ అనేక వేల సంవత్సరాల నుండి జవాబు దొరకని, జవాబు లేని ప్రశ్నలు. అవన్నీ పక్కన పెడితే ఏ మనిషికైనా చివరి రోజులు ఎలా గడిచాయి అన్నదే ముఖ్యం. ఒక మనిషి ఎలా బ్రతికాడన్నది "జీవిత సంధ్యా సమయంలో గానీ చెప్పలేం" అన్నట్లు. మీ నాన్నగారి సంధ్యా సమయం హాయిగానే గడిచిపోయింది నీ సంరక్షణలో. నీలాంటి కొడుకు అరుదు"

"ఎందుకు సురేంద్ర అనవసర పొగడ్తలు. సాధారణంగా మనం చెయ్యవలసిన పనులు చేస్తాం. అంతే అందులో మనం గొప్పయిపోవలసింది ఏముంది?"



"లేదా?" అందరు కొడుకులు నీలా ఉంటున్నారా? నీ అంత బాధ్యతగా, ప్రేమగా తల్లిదండ్రులను చూసుకునే వారేరి?

"నువ్వు లోకంలో అలా చూడని వాళ్లనే ఎక్కువ మందిని చూసావు. చూడని వాళ్ళు ఎక్కువ శాతం ఉండబట్టి, ఒకటి అరా నాలా సాధారణంగా ప్రవర్తించే వారు, చూసేవాళ్ళకు ఆదర్శవంతంగా కనిపిస్తు న్నారు. కానీ అందులో నా ప్రత్యేకత ఏముంది? కానీ అది నిజం కాదు. అది చాలా మాములు విషయం. అంత మాములు విషయాన్ని పట్టుకొని, అంత పనిగా పొగడ్తలు గుప్పించెయ్యకు. ఇకపోతే ప్రేమగా, బాధ్యతగా చేసానంటున్నావు. బాధ్యతగా చేసిన మాట నిజమే కావచ్చు. అది నేను చెప్పాల్సిన విషయం కాదు. ఇతరులు అనుకోవాల్సిన విషయం."

"అంటే ప్రేమగా చెయ్య లేదంటావా?" తను సందేహిస్తున్న ప్రశ్నకి సమాధానం దొరుకుతున్నట్లని పిస్తుంది.

"ఏమో?"

"ఏమో! ఏంటి కార్తీక్, చేసిన సేవలన్నీ ఏమిటి? అవన్నీ నువ్వు చేసినవి కావా? అందులో ప్రేమలేదా?" అన్నాడు చాలా ఆశ్చర్యపోతూ.

"భౌతికంగా ఒక పని చెయ్యా లంటే ప్రేమ ఉండాలా? సురేంద్రా? అన్నం ఉడకెయ్యాలంటే అది ప్రేమతో ఉడకబెట్టినా, ప్రేమ లేకుండా ఉడకబెట్టినా అన్నం ఉడుకుతుంది. అందులో తేడా ఏమీ ఉండదు. నేను చేసిన సేవలూ అంతే అయి ఉంటాయి."

"అదేమిటి? అలా మాట్లాడు తున్నావు. నాకు చాలా ఆశ్చర్యంగా ఉన్నాయి నీ మాటలు బాధ్యతగా చేసానని ఒప్పుకుంటున్నావు కానీ ప్రేమగా కాదంటున్నావు. రెండిటికీ తేడా ఉందా?"

"ఖచ్చితంగా ఉంది సురేంద్రా, రెండింటికీ చాలా స్పష్టమైన తేడా వుంది. అతని విషయంలో నాకున్నది బాధ్యతే. అదేమిటో చెప్పాలీ అంటే మరికొంత వెనక్కి వెళ్లి చెప్పాలి. తల్లిదండ్రుల, పిల్లల మధ్య సంబంధాలలో ప్రేమ అంశం కొరవడినపుడు ఇక మిగిలిందేమిటి? ఏం మిగులుతుందో ఏం మిగలదో నాకు తెలీదు. ఆ మిగిలిన అంశానికి 'బాధ్యత' అని పేరు పెడదాం. పోనీ జాలి అందాం. ఎందుకంటే ప్రేమ లేదని ఆ వయసులో వ్యక్తుల్ని విడిచిపెట్టలేం కదా! విడచిపెట్టి ఎక్కడికి వెళతాం. ఎక్కడికి వెళ్లినా " ఆ పెద్ద వయసులో వదిలి వెళ్లాం" అనే మానవాంశ వెన్నాడుతుంది. ఈ మానవాంశ ఉందే దాన్ని



Pages_Jan 2009.pmd 38 4/19/2011, 4:53 PM



వదిలి వెళ్ళలేని మూర్ఖలం కాదు కాబట్టి. నిస్సహాయంగా ఏం చేయాలో అది చేయాలి.

చాలా ఆశ్చర్యంగా ఉన్నాయి కార్తీక్ మాటలు. నా ప్రశ్నకి సమాధానం దొరికి నట్లవుతుంది గానీ దొరకడం లేదు. దగ్గరకే వస్తున్నాడు. నా ప్రశ్నకు అడగకుండానే జవాబు చెబుతున్నట్లుగా అనిపిస్తుంది.

"కాస్త అర్థం అయ్యేటట్లు చెప్పు."

"ఏం ఉంది, ప్రేమను ఇచ్చిన వాళ్లకే ప్రేమను ఇవ్వగలం. ప్రేమను ఇవ్వనివాళ్లకి ప్రేమను మనం ఇద్దామన్నా అది మనవల్ల కాదు. అది పుట్టాలంటే అంతర్గతంగా లోనుండి ఉబికి రావాలి. దాన్ని బయటకు తీసుకురాగల శక్తి మళ్ళీ ప్రేమకే ఉంది. అది మన మనసులో నుండి పుట్టి, ఎదుటి వ్యక్తికి ఇవ్వా లంటే, ఎక్కడ నుండి తేవాలి? ఎక్కడి నుండి కాదు. ఆ ఎదుటి వ్యక్తి నుండే, పుచ్చుకున్నపుడు మాత్రమే ఇవ్వగలం. ఏ వ్యక్తి విషయం అయినా అంతే ప్రేమను ఇవ్వలేని వాళ్లకు ప్రేమను ఇవ్వలేం. ఒకవేళ మనం ఇద్దాం అని ప్రయత్నించినా అది సాధ్యం కాదు.

ప్రేమను ఇచ్చి, ప్రేమను పుచ్చుకుంటే – అది అద్భుతమైన, అనిర్వచనీయమైన అనుభూతి.

ప్రేమను ఇచ్చినవాళ్లకు, ప్రేమను ఇవ్వకపోతే అది అమానుషత్వం.

ప్రేమని ఇవ్వని వాళ్లకు, ప్రేమను ఇస్తే – అది సిగ్గు మాలినతనం. ఆ సిగ్గుమాలినతనాన్ని నేను చేయలేకపోయాను.

"అంటే మీ నాన్నగారి నుండి నీకు తగినంత ప్రేమ లభించలేదా?"

"తగినంత, మరింతలాంటి కొలతలు ఏమీలేవు ప్రేమకు. నిజానికి అసలు ఏ మాత్రం లేదు. నా చిన్నతనం అంతా, ఆ తరువాత మరికొంత వయసు వరకూ అంతే చాలా కాలం భయం. తరువాత కాలం ఉదాసీనత. ఆ తరువాత కాలం జాలి. ఇవన్నీ అతని మాటకు ఎదురు లేకుండా చేసాయి. తను చెప్పిందే శాసనం అయింది"

అప్పటికే చుట్టు చీకట్లు అలముకున్నాయి. మసక వెలుతురు నలు దిశలా పరచుకుంది. ఎంత సమయం అయింది అన్న గమనింపే లేదు. ఆస్తకికరంగా ఉన్న మాటలు ఆలకిస్తూ, ఆశ్చర్యపోతున్నాను. ఆ మాటే అన్నాను.

"ఇందులో ఆశ్చర్యమేముంది నీకు తెలియదు నా చిన్నతనం ఎలా గడిచిందో, నీకూ, నాకూ పరిచయం అంతా అయిదారేళ్ళు,. ఆ ఏళ్ళకి ముందు సంగతి నువ్వు విశాఖలో పనిచేసే రోజుల్లో, మా ఇంటికి వచ్చే సమయానికి అతను పక్షవాతంతో మంచాన ఉన్నాడు. అప్పటికి అతని అహాన్ని పక్షవాతం జయించేసింది. వృద్ధాప్యం అనేది చాలా దయనీయమైన స్థితి. అలాంటి స్థితిలో ఉన్న వాళ్ళకు మనకు చేతనై నంత చేయా ల్సిందే. కానీ కొందరి కళ్ళలో గతించిన గతంలో జరిగిన సంఘటనలూ, అప్పటి తన ప్రవర్తన విషయాల్లో కొంత పచ్చాత్తాపం ఉంటుంది. కొందరిలో ఆ పచ్చాత్తాపం కూడా ఉండదు." అని కాసేపు ఆగాడు.

"ఆగావేం చెప్పు"

చెప్పానుగా ప్రేమను ఇవ్వలేని వాళ్ళకు ప్రేమను ఇవ్వలేమని, జీవిత కాలంలో అంటే నా చిన్నతనం నుండి నా గురించి ఏనాడు పట్టించుకున్నది లేదు. ప్రేమగా దగ్గరికి తీసుకున్నది లేదు. ప్రేమగా మాట్లాడింది లేదు. ఆప్యాయంగా తలనిమిరిందీ లేదు. చదువులోనూ, ఇంకెందులోనూ ప్రోత్సహించలేదు. నా అవసరాలు గ్రహించింది లేదు. అతని గొంతు వింటే భయం. గుండెల్లో ఏదో గుబులు. అసలు పిల్లలూ, భార్యా తనకి సేవలు చెయ్యడానికి ఉన్నారన్నట్లు మాట్లాడేవాడు. ఒకసారి బాగా గుర్తు మా అమ్మమ్మ, ఇంటి ప్రక్కన కొందరు ఆడవాళ్ళుతో కలసి, ఓ పదేళ్ళు ఉంటాయోమో, మా ఇంటి దగ్గర్లో సాయిబుల గోళీ ఉంది. అక్కడకు అందరం వెళుతున్నాం. దారిలో నన్ను స్కూటర్ గుద్దేసింది. ముక్కు నుండి రక్తం. అందరం ఇంటికి వచ్చేసాం. డాక్టరు వచ్చి ఏవేవో మందులు ఇచ్చాడు. ఆ సమయంలో మా నాన్న ఇంట్లో లేడు. ఎవరో కబురు చెప్పినట్లున్నారు. ఏమీ కంగారు పడకుండా, తరువాత చాలా సేపటికి వచ్చాడు. ఏ మాత్రం ఆందోళన పడలేదు సరికదా! పైగా తిట్లు "రోడ్డు మీద తిన్నగా వెళ్ళడు. దారిలో సైకిళ్ళూ, స్కూటర్లు తిరుగుతుంటాయి. చూసుకుని వెళ్ళకపోతే ఏం అవుద్ది. సస్తే పీడ వదిలిపోను" ఇంకా ఇలాంటి తిట్లే సరిగ్గా గుర్తులేవు. మా అమ్మ నన్ను దగ్గరకు తీసుకుని టేబుల్ ఫ్యాన్ దగ్గరపెట్టి, ఎంత ఏడుపో, ఇలాంటివే అనేక వందల సంఘటనలు, జీవితకాలంలో జ్ఞాపకం ఉన్నవి కొన్ని, లేనివి కొన్ని. ఆ సంఘటనలు జ్ఞాపకం ఉన్నా, లేకపోయినా, ఆయా సందర్భాలలో గుండెకు తగిలిన గాయాలు మాత్రం అదేపనిగా బాధ పెడుతుంటాయి. సలుపూ, పోటుతో చెప్పనలవి కానీ బాధను పెడుతుంటాయి. దానికి మందు లేదు. ఏం చేయాలి? ఎవరితో చెప్పుకోవాలి? అనే మీమాంస ప్రారంభమవుతుంది. ఏమి చెయ్యలేని నిస్సహాయత, ముందే చెప్పానుగా, ఆ వయసులో వదిలి వెళ్ళిపోతే మానవాంశ వెన్నాడుతుందని.

నేను పడిన బాధలు మా అమ్మ కూడా పడింది. ఆమె మూగగా రోదించటం తప్ప ఏమి చేసేది కాదు. పదేళ్ళ క్రితం జబ్బు చేసి ఆమె చనిపోయింది.

మా అమ్మ చనిపోవడానికి కొద్ది నెలల ముందే నాకు విశాఖలో ఉద్యోగం రావడంతో నేను విశాఖలో ఉండే వాడిని.



Pages_Jan 2009.pmd 39 4/19/2011, 4:53 PM

నాకు ఉద్యోగం వచ్చిన సంవత్సరానికి నాకు పెళ్ళయిపోయింది.

ఆ తరువాత కాలంలో మా నాన్నకు జబ్బు చేయడం, ఉన్న కొద్దిపాటి పొలం కౌలుకి ఇచ్చేసి, నా దగ్గరకు వచ్చేశాడు. ఇక అప్పటి నుండి నా దగ్గరే ఉంటున్నాడు. అతనికి పొలం మీద వచ్చే కొద్ది ఆదాయం తన దగ్గరే ఉంచుకునే వాడు. ఇంట్లో మేం ఎంత ఇబ్బంది పడుతున్నా తన డబ్బులు మాత్రం కదిపేవాడు కాదు. ఇప్పుడు చెప్పు. అలాంటి మనిషి మీద ప్రేమ కలుగుతుందా?" ఒక్కసారిగా చెప్పడం ఆపి బండమీద నుండి లేచాడు.

అప్పటికే చాలా సమయం అయింది. కాబట్టి అనుకోకుండా ఇద్దరం బయటకు నడుచుకుంటూ వస్తున్నాము. నేను వెళ్ళవలసిన రోడ్డువైపే మా నడక.

కార్తీక్‌లో మార్పుకు కారణం అర్థం అయింది. మనిషి లోపలి భావాలను దాచుకోలేడు. తండ్రి మరణంతో అతని జీవితం తెరిపినపడినట్లయింది. అయితే ఇంత నరకం అనుభవించడానికి ఇందులో కార్తీక్ పొరపాటు కూడా ఉంది అనిపించింది. ఆ మాటే అన్నాను.

"ఇందులో నీ తప్పు ఎంత వరకూ ఉంది"

"నా తప్పు ఉందా?" అని అనలేదు. "మొత్తం విషయం నీకు చెప్పానుగా నువ్వే చెప్పు"

''ఏ వ్యక్తి అయినా మన మీద అధిపత్యం తీసుకున్నాడంటే అది ఒక రోజులోనో, ఒక గంటలోనో జరగదు. నీ విషయంలో, నీ కుటుంబ సభ్యుల విషయంలో మీ నాన్న ప్రవర్తన అమానుషమైనదే. ఒక రకంగా అతను హెడోనిష్టు అంటే స్వసుఖావాది. కానీ ఏ వ్యక్తులైనా ఇలా మారడానికి కూడా సంబంధిత వ్యక్తుల ప్రవర్తన కూడా చాలా వరకు కారణం అవుతుంది.

వ్యక్తులకీ, వ్యక్తులకీ మధ్య చాలా సున్నితమైన గీత ఉంటుంది. ఆ హద్దు దాటి నీ వ్యవహారంలోనికి చాలా స్వల్పంగా ఆక్రమించుకునే ప్రయత్నం ప్రారంభిస్తారు.

అలాంటి ఆధిపత్యం నెరిపి, గీతదాటి నీ హద్దుల్లోకి వస్తున్నపుడు, ఆ చిన్న మోతాదులో, స్వల్పమైన ప్రతిఘటన ఎదురైతే, ఇకపై జాగ్రత్తగా మెసలు కుంటారు. అలాంటి వ్యక్తులు ఎప్పటి కప్పుడు గీత దాటే ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు.

ఏ మాత్రం అలుసు ఇచ్చినా క్రమక్రమంగా తన సామ్రాజ్యాన్ని విస్తరించు కుంటారు. ఆ చిన్నగీత బలమైన గోడగా మారిపోతుంది. ఇక అప్పుడు చెయ్యగలిగింది ఏమిలేదు. తను చెప్పిందే శాసనం అయిపోతుంది.

ఒక మనిషి భయమే – రెండో వ్యక్తి అధికృత

ఒక మనిషి ఉదాసీనతే – రెండో వ్యక్తి అధికృత

ఒక మనిషి జాలే – రెండో వ్యక్తి అధికృత. కాబట్టి ఇందులో నీ తప్పు, మీ అమ్మగారి తప్పు కూడా ఉంది."



"అంటే ఈ పెద్ద వయసులో వదిలి వెళ్లిపోవాలా?"

"నా ఉద్దేశ్యం అది కాదు. ప్రతిఘటన అనేది చాలాకాలం క్రితమే మొదలు అయితే మీ నాన్న ప్రవర్తన ఇలా ఉండేది కాదు అని అంటున్నాను. కానీ ఇవేవి కానీ ఇంకో విషయం కూడా ఉంది. ఇందాక నువ్వు అన్నావే కుటుంబ సంబంధాలలో ప్రేమా, అభిమానం, ఆప్యాయతా ఇలాంటివి కనుమరుగై నపుడు ఇక మిగిలిందేమిటి? అని ఆ మిగిలింది కూడా ఉంది. అనే ఆర్థికపరమైన లావాదేవీలు."

"లావాదేవీలా"

"అవును. తల్లిదండ్రులు, పిల్లల మధ్య రాకూడని మాటలు ఇవి. ప్రేమ లేనప్పుడు ఇంకేం ఉంటుంది. ఎంత ప్రేమలు లేకపోయినా, అతని పోషణలో పెంపకంలో నువ్వు ఉన్నావు కదా! దానిని గాను కొంత డబ్బు ఖర్చు అయి ఉంటుంది కదా? ఆ డబ్బు మాటేమిటి? ఆ బాకీ నువ్వు తీర్చవద్దా? అతని చివరి రోజులలో ఆ బాకీ తీరుస్తున్నావని అనుకో. ఎవరో ముక్కూ మొగం తెలియని మనిషి దగ్గర కొంత డబ్బు అప్పు తీసుకుని, కొన్నాళ్ళ తరువాత ఆ అప్పు తీర్చేస్తామే, అలాంటిదే ఇది. చూసావా ఎంత చౌకబారుగా ఉన్నాయో ఈ మాటలు. అవును కుటుంబాల్లో ప్రేమలూ, అభిమానాలూ మృగ్యం అయినపుడు ఇలాంటి మాటలే వస్తాయి. అయితే చాలా కుటుంబాల్లో అటునుండి ఇటవుతుంది. తల్లిదండ్రులు పిల్లల్ని ఎంత ప్రేమగా పెంచినా, ఎంత బాధ్యతగా పెంచిన, చివరి రోజుల్లో సరైన ఆదరణ పిల్లల నుండి లభించదు.

అనుబంధాలూ, ఆప్యాయతలూ మరచి పోయి కొత్త ప్రపంచంలో కొత్త కాలంలో పడిపోయి గతకాలాన్ని మరచి పోయి, వర్తమానంలో జీవిస్తారు. వర్తమానమే శాశ్వతం అనుకుంటారు. కాని మీలాంటి కుటుంబాలు అరుదు. నిజం నువ్వన్నది నిజమే. వృద్ధాప్యంలో కూడా పశ్చాత్తాపపడని వాళ్ళకు ప్రేమను ఇవ్వలేం. ప్రేమను ఇచ్చిన వాళ్ళకే, ప్రేమను పుచ్చుకునే అర్హత ఉంటుంది. ఇద్దరి ప్రేమికుల మధ్య ప్రేమ ఏక కాలంలో జనించినట్లుగా తల్లి దండ్రుల, పిల్లల మధ్య ప్రేమ ఏక కాలంలో రాదు. మొదటి తరానిదే మొదటి బాధ్యత. అది సక్రమంగా నిర్వహించి నపుడు, ప్రేమను డిమాండ్ చేసే హక్కు కూడా ఉంటుంది. కాబట్టి మొదటి తరానిదే మొదటికాలం."

దూరంగా ఆనందపురం వైపు వెళ్ళే ఆటో లైట్ వెలుతురు చిన్నగా కనిపించింది. కాసేపటికి ఇద్దర్నీ చూసి, దగ్గరగా వచ్చి ఆగింది. "వస్తా" అంటూ సురేంద్ర ఆటో ఎక్కాడు. చీకటిలో కలిసి పోయిన కార్తీక్ ముఖకవళికలు మరి కనిపించ లేదు. కార్తీక్ గురించే ఆలోచిస్తూ తిరుగు పయనమయ్యాడు సురేంద్ర. ◆



Pages_Jan 2009.pmd 40 4/19/2011, 4:53 PM

## మీడియా

# ప్రసారమాధ్యమం ఆత్మపరిశీలన ఆవశ్యం

**జయతిఘోష్**



**ముంబయ్‌లో సంభవించిన భయంకరమైన దాడుల వివరాలను చూస్తున్నపుడు, వాటిని వర్ణించడానికి సాధారణంగా వినియోగించే దిగ్భ్రాంతి, ఆగ్రహం, ఆందోళన, ఆదుర్థావంటి' పదాలు సరిపోవని అనిపించింది. ముంబయ్ విషాద దృశ్యాలను టీవీలో చూస్తున్న తరుణంలోనే అనివార్యంగానే వార్తలను అందించే వారిపై కూడా దృష్టి మరలుతుంది.**

సమాజానికి ప్రసారమాధ్యమం అద్దం పడుతుందని చెపుతూ ఉంటారు. పత్రికల విషయంలోకన్నా టెలివిజన్ ఛానెల్స్ విషయంలో ఇది మరింత యథార్థం. ఏదైనా సంఘటన చోటుచేసుకున్నపుడు టెలివిజన్ ఛానెల్స్ అప్పటికప్పుడు స్పందించవలసి ఉంటుంది. ఆ సంఘటన యొక్క లోతుపాతుల గురించి ఆలోచించటానికి గానీ, సర్దుబాట్లకుగానీ తగినంత సమయం వాటికి ఉండదు. అటువంటి సమయంలో సమాజంలో ఉన్న బలహీనతలు ప్రసారమాధ్యమంలో ప్రతిబింబించటమేకాక, తిరిగి సమాజంపై ప్రభావాన్ని చూపుతూ కొన్ని సందర్భాలలో వక్రీకరణకు గురి అవుతుంటాయి. గత వారం ముంబయ్‌ని అల్లకల్లోలం చేసిన దుర్మార్గమైన ఉగ్రవాద దాడులకు సంబంధించిన ప్రసారాలను బుల్లితెరపై చూస్తున్నపుడు పైవిధమైన ఆలోచనలు కలిగాయి.

ఈ మొత్తం వ్యవహారమంతా మరలా ఇక్కడ వల్లెవేయవలసిన అవసరం లేదు. ముంబయ్‌లో సంభవించిన భయంకరమైన దాడుల వివరాలను చూస్తున్నపుడు, వాటిని వర్ణించడానికి సాధారణంగా వినియోగించే దిగ్భ్రాంతి, ఆగ్రహం, ఆందోళన, ఆదుర్థావంటి' పదాలు సరిపోవని అనిపించింది. ముంబయ్ విషాద దృశ్యాలను టీవీలో చూస్తున్న తరుణంలోనే అనివార్యంగానే వార్తలను అందించే వారిపై కూడా దృష్టి మరలుతుంది. విచారకరమైన విషయమేమిటంటే ఎలక్ట్రానిక్ ప్రసారమాధ్యమం ఈ సందర్భానికి తగినట్లుగా వ్యవహరించలేదని చెప్పక తప్పదు.

పలు వార్తా ఛానెల్స్ ఈ విషాద ఘటనలను సంచలనాత్మకంగా చూపటానికి తాపత్రయ పడ్డాయి. ఇదెంతైనా బాధాకరం. ఈ విషాద దృశ్యాలను ప్రసారం చేయటంలో బాధ్యతకన్నా ఇతర ఛానెల్స్‌ను అధిగమించాలనే తపన ఎక్కువగా కనిపించింది. ఎదురు కాల్పుల సమయంలో శత్రువుకు (ప్రస్తుత సమయంలో భయంకరమైన మారణాయుధాలు ధరించిన ఉగ్రవాదులు) ఎలాంటి సమాచారం అందినా అది వారికి ఉపయోగకరంగానూ, అధికారులకు ఇబ్బందిగానూ ఉంటుందని తెలుసుకోవటానికి పెద్ద తెలివితేటలు ఏమీ అవసరం లేదు. పట్టణ ప్రాంతాలలో సుదీర్ఘమైన ఎదురు కాల్పుల ఘటన సంభవించినపుడు పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంటుంది. సాధారణ ప్రజల ప్రాణాలకు హాని కలగకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై అమితంగా ఉంటుంది.

ఇలాంటి సందర్భాలలో ప్రసారాలను చేసేటపుడు ఉగ్రవాదులకు ఉపయోగపడే సమాచారం అందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బుల్లితెరపై ప్రసారమయ్యే దృశ్యాలు వారికేమాత్రం సహాయకారి కాగూడదు. కాని, ప్రస్తుతం అలా జరగలేదు. ముంబయ్‌లో మూడుచోట్ల వ్యూహాత్మకమైన సైనిక చర్యలు సాగుతున్నపుడు వివిధ ఛానెల్స్ ఒకదానిని మరొకటి అధిగమించాలని పోటీపడ్డాయే గాని అవసరమైన జాగ్రత్తలు తీసుకోలేదు. పైగా ఉగ్రవాదుల వద్ద ఉపగ్రహ టెలిఫోన్‌లు ఉన్నాయని చెపుతున్నారు. కనుక టెలివిజన్ ప్రసారాలను తమకు అనుకూలంగా ఉపయోగించుకోవటం వారికి తేలిక అవుతుంది.

సహాయ చర్యలకు సంబంధించి అధికారుల నుంచి సంపాదించిన ప్రత్యేక సమాచారాన్ని ఒక ఛానెల్ ప్రసారం చేసింది. కొన్ని ఛానెల్స్ అయితే ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు సంబంధించిన సున్నితమైన వివరాలను ప్రసారం చేసాయి. ఏ హోటల్లో, ఎన్నో అంతస్తులో, ఎన్నో గదిలోకి ఎస్ఎస్‌జీ కమెండోలు ప్రవేశించారన్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రసారం చేశాయి. అలానే



Pages_Jan 2009.pmd 41 4/19/2011, 4:53 PM

# ఆగిన చిరుదరహాసం



ప్రముఖ కవి, కథారచయిత స్మైల్ 2008 డిసెంబర్ 5 న మృతిచెందారు. తెలుగు సాహిత్య లోకంలో కొద్దిపాటి రచనలు చేసి ప్రసిద్ధులైన వారు చాలా అరుదు. అటువంటి వారిలో స్మైల్ కూడా ఒకరు. ఖాళీ సీసాలు కథతో కథాభిమానులను సంపాదించుకున్నారు. కవితలు, కొన్ని కథలు, మరికొన్ని నాటికలు రాసినా పరిమితంగా రచనలు చేసారు. స్మైల్ మంచి స్నేహశీలిగా పేరు సంపాదించారు. అనేక మంది సాహితీవేత్తలతో స్మైల్‌కు సన్నిహిత పరిచయాలు ఉన్నాయి. ప్రగతిశీల సాహిత్యవేత్తలకు అనుక్షణం ప్రోత్సహాన్ని అందించేవారు.

కృష్ణాజిల్లా త్రేలపోలులో జన్మించిన స్మైల్ పదోతరగతి వరకు అక్కడే చదువుకున్నారు. ఇంటర్, డిగ్రీలను ఏలూరులో పూర్తిచేసారు. విజయవాడ ఆంధ్రా లయోలా కళాశాలలో కొంతకాలం ఇంగ్లీష్ ట్యూటర్‌గా పనిచేసారు. ఆ తర్వాత వాణిజ్య పన్నుల శాఖలో అధికారి అయ్యారు. స్మైల్ తన చివరిరోజులలో తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రిలో నివాసమున్నారు. అత్యున్నత అధికారిగా పనిచేసినప్పటికీ సౌమ్యంగా ఉండేవారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. స్మైల్ అసలు పేరు ఇస్మాయిల్.

# తప్పు నీదే

**మాధవీ సనారా**

చీకటితో చేయికలిపి
గాలి
వెలుగుతున్న కొవ్వొత్తిని ఆర్పేస్తే

చీకటితో
కొవ్వొత్తి జట్టుకట్టిందనకు
నిందించకు

వీస్తున్నది
పెనుగాలని తెలిసికూడా
కొవ్వొత్తిని వెలిగించడం
నీ తప్పే కదా!

---

సంక్లిష్టమైన పరిస్థితి ఉందనుకున్న వైపు అవి తమ కెమెరాలను తిప్పాయి.

ఉగ్రవాదులు దాగి వున్నట్లుగా అనుమానిస్తున్న వైపుకు కూడా టివీ కెమెరాలు తిరిగాయి. కమెండోల కదలికను, పోలీసుల చర్యలను కెమెరాలలో బంధించటానికి పాత్రికేయులు ఉరుకులు పరుగులు పెట్టారు. ఉగ్రవాదులను ఏరివేసేటందుకు గాను రంగంలోకి దిగిన కమెండోల కదలికలు టివీ తెరపై కనిపిస్తే ఎవరికి లాభం, ఎవరికి నష్టం? ఇలాంటి దృశ్యాల ప్రసారాల వల్ల ఉగ్రవాదులకే ప్రయోజనం చేకూరుతుంది. భయంకరమైన శత్రువుపై దాడి చేస్తున్న కమెండోలకు ఇలాంటి ప్రసారాలు ప్రమాదంగా పరిణమిస్తాయి.

ఆయా ప్రాంతాలలో మూగిన ప్రజలు పలుసార్లు గందరగోళానికి గురయ్యారు. త్రొక్కిసలాటలు చోటు చేసుకున్నాయి. పాత్రికేయులు సృష్టించిన అయోమయమే ఇందుకు కారణం. కొన్ని సందర్భాలలో ప్రజలను అదుపు చేయటానికి పోలీసులు రంగంలో దిగవలసి వచ్చింది. ఉగ్రవాదులకు, కమెండోలకు మధ్య కాల్పులు ముమ్మరమైనప్పుడు ప్రాణ రక్షణ కోసం వెనక్కు వెళ్ళవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేసినప్పటికి వారు దానిని పట్టించుకోకపోవటమో మరో దారిలో గుండా ముందుకు రావటమో చేశారు. దీనివల్ల సైనిక చర్యలకు ఇబ్బంది ఎదురైంది. హోటల్ భవనంలోనుంచి బయటపడిన వారు ఆక్షణంలో విపరీతమైన భయాందోళనలకు గురైవుంటారు. కాని టివీ విలేకరులు మాత్రం వారిని వదలకుండా ఆ సమయంలో పలు ప్రశ్నలతో వేధించారు. ఈ వైఖరి ఆ పాత్రికేయుల అవిచక్షణకు అద్దం పడుతుంది. వారు తమను కాసేపు విడచిపెట్టవలసిందిగా వేడుకున్నప్పటికీ మైక్రోఫోన్‌లను వారి ముందు పెట్టి మీ అనుభవాలు చెప్పడంటూ అడగటం తటస్థించింది. పాత్రికేయులను తప్పించుకుని తమ కోసం వేచి వున్న వాహనాలలోకి వెళ్ళటం వారికి చాలా కష్టమైంది. కొంతమంది తమ కుటుంబ సభ్యులనో, లేదా సన్నిహిత మిత్రులనో పోగొట్టుకున్న బాధతో నోటమాటరాక దిగ్భ్రాంతికి గురైనవారిని సైతం ప్రసారమాధ్యమానికి చెందిన వారు విడచిపెట్టలేదు. పైగా వారి కళ్ళవెంటకారే కన్నీటివైపుకు తమ కెమెరాలను తిప్పారు.

ఇలాంటి సందర్భాలలో మనం ఆత్మపరిశీలన చేసుకోవలసి ఉంది. ఇదొక్కటే చాలదు. హృదయ పరివర్తన కూడా అవసరం. పరివర్తన లేని ఆత్మపరిశీలన వ్యర్థమే అవుతుంది. ఎట్టకేలకు సుదీర్ఘమైన ఎదురుకాల్పులు ముగిశాయి. రాజకీయాలలోనూ, సమాజంలోనూ,పరిపాలనా విధానంలోనూ రావలసిన మార్పుల గురించి ఆంగ్లభాషా ఛానెల్స్ పెద్ద యెత్తున చర్చలు జరిపాయి. 'అయిందేదో అయింది', ఇకనైనా పౌరులు ఏ మాత్రం ఇలాంటి వాటిని సహించరాదంటూ ముక్తాయింపు ఇచ్చాయి. కాని తన ప్రవర్తన కారణంగా సంభవించిన సమస్యలను ప్రసారమాధ్యమం గుర్తించినట్లు కన్పించలేదు. ప్రసారమాధ్యమం తనను తాను గుర్తెరిగేలా దాని ముందు నిలువుటద్దాన్ని ఉంచటం సమాజానికి సాధ్యపడుతుందా? ◆



Pages_Jan 2009.pmd 42 4/19/2011, 4:53 PM

# బుష్‌పై బూట్లు బేష్ బేష్ చప్పట్లు



**ఎం.కోటేశ్వరరావు**

చెప్పుదినెడి కుక్క చెరకు తీపెరగదు. దురాక్రమణలే అలవాటుగా ఉన్న పెద్దమనిషి అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ లాంటి వారు జనంలో స్వేచ్ఛగా సంచరించలేరు. ఆ పెద్ద మనిషి తన పదవీ కాలపు చివరి రోజుల్లో కూడా ప్రపంచం కన్నుగప్పి ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రవేశించాడు. ఇరాక్ యువ జర్నలిస్టు చేతిలో చెప్పుదెబ్బతిని అభాసుపాలయ్యాడు. సామ్రాజ్యవాదులను వ్యతిరేకించే శక్తులకు ఈ ఉదంతం ఎంతో ఉత్తేజాన్ని కలిగించిందనటంలో అతిశయోక్తి కాదు. అరే తామాపని చేయలేకపోయామని అనుకున్నవారు అనేక దేశాలలో జరిగిన ప్రదర్శనల్లో బూట్లను ప్రదర్శించి తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. ఇంటర్నెట్ గేమ్‌లో బుష్‌ను చెప్పుతో కొట్టటం ద్వారా తమ కసిని ప్రదర్శించిన వారెందరో, ఈ ఆటలో బుష్‌ను బూటుతో కొట్టిన ప్రతిసారీ మీరూ బూటుతో కొట్టగలరు అన్న అభినందన సందేశం కంప్యూటర్ తెరపై కనిపిస్తుంది. గతవారంలో ఈ ఉదంతం ప్రపంచ వ్యాపితంగా సంచలనం కలిగించింది. బుష్‌పై విసిరిన ఇరాకీ జర్నలిస్టు ముతంజర్ ఆల్ జైదీని ఇరాక్‌లోని అమెరికా తొత్తు ప్రభుత్వం మంగళవారం నాడు కోర్టులో ప్రవేశపెట్టింది. అతనిపై 31 నుంచి విచారణ జరపనున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు బుష్‌పై దాడి చేసిన వెంటనే అజ్ఞాత ప్రదేశానికి తరలించిన ఇరాకీ పోలీసులు అతనిని చిత్రహింసలు పెట్టినట్లు ఆదివారం నాడు జైలులో అల్ జైదీని కలిసిన సోదరుడు వెల్లడించారు. బూటు విసరటం తాను చేసిన తప్పిదమని ఒక ఉగ్రవాది ప్రేరేపణతో తానాపని చేసినందున తనను క్షమించాలని ఆల్‌జైదీ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని, బలవంతంగా ఆ విధంగా రాయించారని పేర్కొన్నారు. తనకు అవకాశం వస్తే మరోమారు బుష్‌పై బూట్లు విసురుతానని ఆల్‌జైదీ చెప్పినట్లు తెలిపారు. మరోవైపు అతనిని బేషరతుగా విడుదల చేయాలని అరబ్బు ప్రపంచమంతటా ప్రదర్శనలు జరుగుతున్నాయి. అల్‌జైదీ విసిరిన బూట్లను తాను కోటి డాలర్లకు కొంటానని ఒకరు ముందుకు వస్తే, వాటిని మ్యూజియంలో పెట్టి ముందుతరాల వారికి ప్రదర్శించాలని మరి కొందరు ప్రతిపాదించారు. అతని తరపున తాము వాదిస్తామని రెండు వందల మందికి పైగా న్యాయవాదులు ముందుకొచ్చారు. ఆ సాహస యువకుడికి తమ పిల్లనిచ్చి పెళ్లి చేస్తామని కొందరు ముందుకు వచ్చారు. అలాంటి సాహసవీరునికి అర్ధాంగిగా ఉండటం తమకెంతో సంతోషదాయకమని ఆ యువతులు ప్రకటించడం మరింత ఉత్తేజం కలిగించే అంశం. అల్‌జైదీ విసిరిన బూట్ల వంటివి తమకు 30 వేల జతలు కావాలని ఇరాక్ నుంచి ఆర్డర్లు అందినట్లు టర్కీలోని తయారీ కంపెనీ వెల్లడించింది. ఇంతకీ బుష్ ఇరాక్ ఎందుకు వచ్చాడు? ఎందుకు చెప్పుదెబ్బలు తిన్నాడు? ఆ సత్కారం బుస్ ఒక్కడికేనా?

తన పాలనా కాలంలో చేసిన దురంతాల పట్ల ఎలాంటి విచారం కూడా వెలిబుచ్చని అబద్దాల కోరు బుష్ ఇరాక్ నుంచి అమెరికా, దాని దుష్ట మిత్ర సైన్యాలను ఉపసంహరించేందుకు చేసుకున్న ఒప్పందంపై నెత్తుటి సంతకం చేసేందుకు ఆకస్మికంగా, గుట్టుగా వచ్చాడు. దాని ప్రకారం వచ్చే ఏడాది జూన్ ఆఖరుకు అమెరికా సైన్యం ఇరాక్ నగరాలు, పట్టణాల నుంచి వెనక్కు తగ్గుతుంది. సైనికులు ఖాళీ చేసిన స్థావరాలు అమెరికన్‌మిలిటరీ సలహాదారులు, శిక్షకులకు అందుబాటులో ఉంటాయి. దేశం నుంచి పూర్తిగా 2012 జనవరి ఒకటి నాటికి ఉపసంహరించుకుంటుంది. ఇరాక్ దురాక్రమణకు వ్యతిరేకంగా ఇరాకీల్లో వెల్లువెత్తిన నిరసన, ప్రపంచవ్యాపితంగా వెల్లడైన వ్యతిరేకతను తగ్గించుకొనేందుకు బుష్ అనేకసార్లు ప్రయత్నించాడు. అదే సమయంలో ఇరాక్‌లో తన సైనికులు జరిపిన అన్ని దుశ్చర్యలను నిస్సిగ్గుగా సమర్థించాడు. అందుకే బుష్ ఇరాక్ వచ్చిన ప్రతిసారీ రహస్యంగానే పర్యటించాడు. చెప్పుదెబ్బలు తిన్న పర్యటనలో కూడా బుష్ ఉత్తర ఇరాక్‌లోని అమెరికా సైనికుల 'విజయ శిబిరం' వద్ద వారికి అభినందనలు తెలియజేశాడు. ఇరాక్‌లో సద్దాంహుస్సేన్, ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్లు లేకపోతే అమెరికా మరింత సురక్షితంగా ఉండి ఉండేదని చెప్పుకున్నాడు. ఒకవైపు సైన్య ఉపసంహరణ గురించి చెబుతూనే మరోవైపు యుద్ధం ఇంకా సంపూర్ణం కాలేదని కూడా ప్రకటించాడు. ఎందుకంటే నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బరాక్ ఒబమా ఇరాక్ నుంచి త్వరగా సైన్యాన్ని ఉపసంహరిస్తానని, వారిని ఆఫ్ఘనిస్తాన్‌కు తరలించాల్సి ఉందని చెప్పాడు.

ఇరాకీల హంతకుడా, ఇరాకీ పిల్లలను మట్టుబెట్టిన కుక్కా నీకిదే వీడ్కోలు ముద్దు అంటూ బుష్‌పై తొలిబూటు విసిరిన యువకుడు రెండో బూటు విసురుతూ ఇది భర్తలను కోల్పోయినవారు, ఇరాక్‌లో నీ హత్యాకాండతో అనాథలైనవారి నుంచి వస్తోందంటూ రెండో బూటు విసిరిన ఇరాకీ జర్నలిస్టుఅల్ జైదీ వామపక్ష భావాలు కలిగిన యువకుడు. చేగువేరా వీరాభిమాని. అతను విసిరిన బూట్లు తగలకుండా బుష్ తప్పించుకున్నాడు గానీ ఇరాక్‌లోని బుష్ తొత్తుల పునాదులు అదిరాయి అరబ్బుల మానమర్యాదల్లో ఎవరికైనా చెప్పులు చూపటం ఎదుటివారికి పెద్ద అవమానం. విసరటం అంటే తలతీసేసినట్లే. అందుకే అరబ్బులు ఈ చర్యకు నీరాజనాలు పట్టారు. అమెరికన్లు ఇరాక్‌ను అక్రమించిన తరువాత బాగ్దాద్ విశ్వవిద్యాలయంలో జర్నలిజం కోర్సు చేసిన అల్‌జైదీ కుటుంబం సద్దాం హుస్సేన్ పాలనలో ఇబ్బందుల పాలైంది. అనాథగా



Pages_Jan 2009.pmd 43 4/19/2011, 4:53 PM

# అభాగ్యజీవి



**ఎ. అన్నపూర్ణ**

పదహారేళ్ళ అమ్మాయికి
ప్రపంచమంతా రంగుల హరివిల్లు
టీనేజి అబ్బాయి కలలో తేలుతూ
జతకోరి చెలిమి చేస్తాడు
నాగరికత వుచ్చులో చిక్కి
ప్రేమ అనే భ్రమలో పడిపోతారు
ఒక్కరు లేక ఇద్దరు అనే నియంత్రణతో
అమ్మానాన్నలకు గారాబు బిడ్డలు
స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రతీకలు
విశృంఖల శృంగారానికి బానిసలు
అన్నెంపున్నెం ఎరుగని వయసును
 మోహం కాటేస్తుంది
పసిపాప రూపాన అమ్మాయి
అమ్మ అవుతుంది
మోయలేని భారమై లోకానికి వెరచి
పేగుబంధాన్ని చెత్తకుండీ కి అంకితమిస్తుంది
అభాగ్యజీవి నడిరోడ్డుమీద
గుక్కపట్టి రోదించి కక్కటిల్లిపోతుంది
అక్కున చేర్చి
ఆకలిని తీర్చేవారు లేక అల్లాడిపోతుంది
ఎవరుచేసిన పాపమో ఇది
విలువ తెలియని ప్రేమమైకమో ఇది
ప్రేమకు అర్థం తెలియని యువత
మమకారాన్ని కలుషితం చేసింది
ప్రేమంటే క్షణికావేశపు ఆనందమనుకుని
పదిమందిలో నగుబాటు అయ్యింది
నేరం చేసేది మీరైతే
గర్భాన వూపిరి పోసుకున్న బిడ్డకేనా శిక్ష?
కన్నుమిన్ను కానరాక
కన్నపేగు తెంచుకుంటోంది బండరాయిగా మారి
ప్రేమంటే పవిత్రమైన బంధానికి ప్రతీక
స్త్రీపురుషుల నూరేళ్ళ అనుబంధం
యువతా మేలుకో వివేకంతో
నీ భవితకు పూలబాటలు వేసుకో
విజ్ఞత కలిగి సుఖసంతోషాలతో
జీవిత గమ్యానికి చేరుకో
పసిపాపలు ప్రేమబంధానికి తీపిగుర్తులు
గుండెల్లో దాచుకునే నిధులు
భావితరానికి ప్రతినిధులు
అమ్మానాన్నలకు అపురూపమైన వరాలు

---

మారిన ఆల్‌జైదీ పిన్ని సంరక్షణలో పెరిగాడు. అయితే జర్నలిస్టుగా మారిన తరువాత ఎక్కడ సైనికులు దుర్మార్గాలు జరిపితే అక్కడకు ఎక్కడ జనం ఇబ్బందులు పడితే అక్కడకు చేరి వార్తలు పంపేవాడు. తాను త్వరలో బుష్‌కు బుద్ధి చెబుతానని గత కొద్దినెలలలగా సన్నిహితుల వద్ద చేసిన వ్యాఖ్యలను వారు నవ్వులాటగా తీసుకున్నారు. ఇరాక్‌లో అమెరికా జరిపిన దుర్మార్గంతో కుతకుతలాడుతున్న ఆల్‌జైదీకి విల్లేకర్ల సమావేశంలో బుష్ ప్రారంభ వ్యాఖ్యలు మరింత ఆగ్రహం తెప్పించి ఉండాలి. 'ఇరాక్‌ను ఇప్పుడున్న స్థితికి తీసుకురావటానికి అమెరికన్లు ఎన్నో త్యాగాలు చేశారు. ఇరాక్‌లో యుద్ధానికి ఎన్నో వనరులు, ఎంతో సమయం కావాలి.' అన్న మాటలు విన్న తరువాత ఆత్మాభిమానం కలిగిన వారైవరైనా చెప్పుతీయకుండా ఉంటారా? బూటు దెబ్బతో దిమ్మతిరిగిపోయిన బుష్‌కు ముందు వరుసలో ఉన్న అమెరికా అనుకూల అరబ్బు జర్నలిస్టులు కొందరు క్షమాపణచెప్పారు. అవమానాన్ని తట్టుకోలేని బుష్ ఏడ్వలేక నవ్వినట్లుగా 'ఓ కుర్రాడు బూటు విసిరితే ఏమైంది.. దాన్ని నేనేం పట్టించుకోను... మీరు ఏదైనా తెలుసుకోవాలనుకుంటే విసిరిన బూటు సైజు పదవనంబరు, దాన్ని గురించి ఆందోళన పడకండి అని చెబుతుండగా రెండో బూటు పడింది. 'స్వేచ్ఛా సమాజాల్లో ఇలాంటివి జరగటం మామూలే. తామున్నామని వెల్లడించుకొనేందుకు కొందరిలాంటివి చేస్తారు. అందువలన అతను మీకు ఏదో చెప్పాలని అనుకుంటున్నట్లు నేను గ్రహించాను.' అని చెప్పిన బుష్ తన కళ్ళ ముందే భద్రతా సిబ్బంది ఆ జర్నలిస్టును చావగొడుతుంటే మాత్రం అదేమనలేదంటే అతగాడి నిజస్వరూపం అర్థం చేసుకోవచ్చు. ఆ జర్నలిస్టుపై చర్య తీసుకోవాలని తాము డిమాండ్ చేయం అని అమెరికా అధికారులు ప్రకటించారు. అయితే ఇరాక్ ప్రభుత్వం ఏదైనా చర్య తీసుకుంటే తమకు సంబంధం లేదని చెప్పటం పరోక్షంగా చర్య తీసుకోవాలని డిమాండ్ చేయటమే.

నిజానికి ఆల్‌జైదీ చేసిన బూట్ల సత్కారం ఒక్క బుష్‌కే కాదు. ప్రపంచ మానవాళిపైనే దుర్మార్గాలకు పాల్పడుతున్న బుష్ అండ్‌కో, ప్రపంచవ్యాపితంగా ఉన్న మద్దతుదార్లందరినీ కొట్టిన దెబ్బలుగా పరిగణించాల్సి ఉంటుంది. సద్దాంహుస్సేన్‌పై ఎవరికైనా కొన్ని మినహాయింపులు ఉండవచ్చుగాని ఈ చర్య మొత్తం ఇరాకీలను, అరబ్బులను ఐక్యం చేసిందంటే అతిశయోక్తి కాదు. ఇరాకీలు తమ ప్రతిఘటనలో తమకు దొరికిన ఆయుధాలను ఉపయోగించి అమెరికన్లను అనేకమందిని హతమార్చినపుడు మనకివి మామూలే అన్నట్లుగా నిబ్బరంగా ఉన్న అమెరికన్లు బూట్లతో జనం చేస్తున్న ప్రదర్శనలను చూసి హడలిపోతున్నారు. విసిరిన బూటు బుష్‌కు తగలాలన్న జర్నలిస్టు లక్ష్యం నెరవేరకపోవచ్చుగాని సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా జనాభిప్రాయాన్ని తెలియజేయాలన్న లక్ష్యం మాత్రం సంపూర్ణంగా నెరవేరింది. బూటు సామ్రాజ్యవాద వ్యతిరేక నూతన చిహ్నంగా అరబ్బు ప్రపంచంలో తయారైంది. నూతన అధ్యక్షుడు బరాక్‌ఒబమాకు ఇది పరోక్ష హెచ్చరిక. బుష్‌పై విసిరిన బూట్లను దగ్ధం చేసి ఇరాకీ ప్రభుత్వం హమ్మయ్య అని ఊపిరిపీల్చుకుంది గానీ ఒక జత బూట్లను కాల్చివేస్తే మరింక బూట్లే దొరకవా? ◆



Pages_Jan 2009.pmd 44 4/19/2011, 4:53 PM

# సమయోచిత సమాలోచన



తెలుగుకు ప్రాచీనభాషా హోదా లభించిన నేపథ్యంలో విజయవాడలో ఇటీవల జరిగిన సమాలోచన భాషాభిమానులను ఎంతగానో ఆలోచింపచేసింది. తెలుగును ఆధునిక భాషగా అన్ని విధాలా ఉపయోగించుకోవడానికీ, అభివృద్ధి పరుచుకోవడానికీ ఏ విధంగా కృషిచేయాలనే అంశంపై చర్చించేందుకు 'సాహితీ స్రవంతి' విజయవాడ శాఖ ఈ నెల ఐదో తేదీన 'తెలుగుభాషా సమాలోచన' నిర్వహించింది. 'ప్రాచీన హోదాతో ఆధునిక దిశగా' పేరిట మహాకవి శ్రీశ్రీ సభామందిరంలో నిర్వహించిన ఈ సమాలోచనలో సాహితీ పత్రికల సంపాదకులూ, కవులూ, రచయితలూ, భాషా పండితులూ, అధ్యాపకులూ, కళాకారులూ పాల్గొన్నారు. ప్రాచీన హోదాతో తెలుగు భాషను అభివృద్ధి చేయడానికి సాహితీ ప్రపంచాన్నీ, భాషాభిమానులనూ భాగస్వాములను చేస్తూ ప్రభుత్వమే ఈ బృహత్తర కార్యాన్ని తలకెత్తుకోవాలని సమాలోచన అభిప్రాయపడింది.

తొలుత సాహితీ స్రవంతి రాష్ట్ర కన్వీనర్ తెలకపల్లి రవి మాట్లాడుతూ తెలుగుకు ప్రాచీన హోదా లభించడం సంతోషాన్ని కలిగించినా అంతటితో సంతృప్తి చెందకూడదని అన్నారు. సాహితీ, సాంస్కృతిక సంస్థలు ముందుచూపుతో కలిసి వెళ్ళాల్సి ఉందన్నారు. తమిళులు తమ మాతృభాషను రక్షించుకొనేందుకు ప్రజా వాఙ్మయాన్ని సృష్టించుకొన్నారనీ, తెలుగువారు ఆ దిశగా కృషి చేయాల్సి ఉందనీ అన్నారు. నిరక్షరాస్యులూ, తెలుగు మాట్లాడే ప్రజలూ ఎక్కువగా నివసించే మన రాష్ట్రంలో పరిపాలన కూడా తెలుగులోనే జరగాలని అన్నారు. ప్రాచీన హోదాతో లభించే రూ.100 కోట్లు సద్వినియోగమయ్యేలా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. సమగ్ర దృష్టితో ఆధునిక సమాజానికి అనుగుణమైన భాషను వినియోగించాలని కోరారు.

కృష్ణాజిల్లా రచయితల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ జి.వి. పూర్ణచంద్ తెలుగు భాషకు ప్రాచీన హోదా కల్పించిన తీరుపై తీవ్ర విచారం వ్యక్తం చేసారు. 'ప్రాచీన హోదా కల్పించే విషయంలో మీనమేషాలు లెక్కించారు. ఏర్పడిన కమిటీకి క్యాబినెట్ హోదా కల్పించకుండా తూతూమంత్రంగా వ్యవహరించారు.' అని విమర్శించారు. ప్రాచీన హోదాతో లభించిన గౌరవాన్ని నిలబెట్టుకుంటూ మాతృభాషా పరిరక్షణ ఉద్యమాన్ని కొనసాగించాలని సూచించారు. ప్రజాసాహితి సంపాదకులు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన వంద కోట్లతో సన్మానాలు సత్కారాల పేరిట ఖర్చు చేయకుండా మాతృభాషను అభివృద్ధి చేసేందుకు తగు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. చినుకు మాసపత్రిక సంపాదకులు నండూరి రాజగోపాల్ మాట్లాడుతూ 'తెలుగు భాషను అభివృద్ధి జేసే క్రమంలో విద్యాసంస్థలు తగు పాత్ర నిర్వహించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నడుస్తున్న చరిత్ర సంపాదకులు డాక్టర్ సామల రమేష్‌బాబు మాట్లాడుతూ, పదో తరగతి వరకూ మాతృభాషలోనే విద్యాబోధన తప్పనిసరి చేయాలని సూచించారు. అయితే, ప్రభుత్వానికి భాషాభివృద్ధిపై తగిన శ్రద్ధలేదని విమర్శించారు.

సాహితీ స్రవంతి కోస్తా జిల్లాల కన్వీనర్ ఎస్. వెంకట్రావు మాట్లాడుతూ, అన్ని రంగాలకు చెందినవారినీ, సాహితీసంస్థలకు ప్రాతినిధ్యం వహించేవారినీ తెలుగు భాషోద్యమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. తెలుగు భాషను సుసంపన్నం చేయటానికి, వాడుకభాషగా మనగలగటానికి ఏంజేస్తే బాగుంటుందో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత చర్చ జరగాలన్నారు. సిద్ధార్థ కళాశాల అధ్యాపకులు డాక్టర్ తాటి శ్రీకృష్ణ మాట్లాడుతూ ప్రజల భాష వేరుగానూ, పుస్తక భాష వేరుగానూ



Pages_Jan 2009.pmd 45 4/19/2011, 4:53 PM

ఉందన్నారు. అనేక ప్రాంతాల్లోనూ మాండలికాలు స్థిరపడి వున్నాయని చెప్పారు. ప్రజలు మాట్లాడే భాషలోనే పాలన జరగాలన్నారు. లయోల కళాశాల అధ్యాపకులు తుమ్మల శ్రీకుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో వేల ఎకరాలు పొందుతూ వ్యాపారాలు చేస్తున్న బహుళజాతి కంపెనీలు తెలుగు మాట్లాడే వారికి ఉద్యోగాలు నిరాకరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. శ్రీశ్రీ సాహిత్య నిధి కార్యదర్శి సింగంపల్లి అశోక్‌కుమార్ మాట్లాడుతూ, విద్యారంగం బహుళజాతి కంపెనీల పరమైనపుడు తెలుగు భాషాభివృద్ధికి ఆటంకం కలుగుతోందన్నారు.

తెలుగు భాషా సమితి నాయకులు కోకా విమల కుమారి మాట్లాడుతూ, తెలుగు భాషాభివృద్ధికోసం కృషి చేస్తోన్న సంస్థలన్నీ సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. కవి చలపాక ప్రకాశ్ మాట్లాడుతూ తెలుగు భాషలోనే విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు ఉద్యోగావకాశాల్లోనూ రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని సూచించారు. నవలా రచయిత స్వరజిత్ మాట్లాడుతూ ఇతర దేశాల నుంచి వచ్చే అనేక మంది అతిథిలు తమ మాతృభాషలోనే మాట్లాడటం దుబాసీలు వాటిని ఆయా భాషలకు అన్వయించి చెప్పటం భాష పట్ల వారికున్న మమకారాన్ని తెలియజేస్తోందన్నారు. కవి అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ, తెలుగు భాషను రక్షించుకునేందుకు జరిపే ఉద్యమం ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమంతో మమేకం కావాల్సి ఉందన్నారు. మనయుగం సంపాదకులు మహ్మద్ కలీముల్లా మాట్లాడుతూ, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం ద్వారానే తెలుగుభాషను గానీ, మరో ప్రాంతీయ భాషను గానీ రక్షించుకోగలమని అన్నారు.

**ముదిగొండ సాంబశివరావు**

---

## నల్గొండ జిల్లా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో భాషా సమాలోచన




తెలుగు భాషకు ప్రాచీనహోదా లభించినందుకు సంతోషిస్తూనే దాన్ని ఆధునిక భాషగా అన్ని విధాలుగా వినియోగించడానికి, అభివృద్ధి పరుచుకోవడానికి ఇతోధిక కృషి జరగాలని పలువురు అభిప్రాయపడ్డారు. 23.11.2008 న నల్గొండ పట్టణంలోని జిల్లాపరిషత్ అతిథిగృహంలో సాహితీ స్రవంతి ఆధ్యర్యంలో భాషా సమాలోచన సదస్సు జరిగింది.

ప్రముఖ సాహిత్య విమర్శకులు నోముల సత్యనారాయణ మాట్లాడుతూ 'పాలకుల నిర్లక్ష్యం, ప్రపంచీకరణ నేపథ్యం, ప్రాచీన భాషా చర్చ నేపథ్యంలో తెలుగు సమగ్రాభివృద్ధి గురించి ఆలోచించాలని అన్నారు. పాలనా విద్య, ప్రసార సాంస్కృతిక రంగాలలోనూ, తెలుగు భాషను అభివృద్ధి పరచాలని అన్నారు. కథా రచయిత ఎన్.కె. రామారావు మాట్లాడుతూ 'రాష్ట్రంలో మాతృభాషను ప్రథమ భాషగా గుర్తించేలా నిబంధనలు చేయాలన్నారు. తెలుగు భాష పరిపాలనా భాషగా ఉండాలని, అది ఉల్లంఘించిన వారిని శిక్షార్హులుగా పేర్కొంటూ చట్టం తీసుకురావాలని' అన్నారు. కవి వేముల ఎల్లయ్య 'ఎక్కువ మంది మాట్లాడే భాషను ప్రామాణిక భాషగా గుర్తించాలని, అట్టడుగు వర్గాలవారి భాషల అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. కవి వేణు సంకోజు 'నేడు స్త్రీలు మన భాషను కాపాడుతున్నారని, ప్రాచీనభాష హోదాతో మన భాషకు ప్రాధాన్యత పెరిగిందని' అన్నారు. సభకు అధ్యక్షత వహించిన నల్గొండ జిల్లా సాహితీ స్రవంతి కన్వీనర్ భూపతి వేంకటేశ్వర్లు మాట్లాడుతూ 'అర్థంకాని చట్టాలు, అన్ని జి.వోలు, సర్క్యులర్స్ తెలుగులో రావాలని' అన్నారు. సాహితీ స్రవంతి నల్గొండ జిల్లా కో-కన్వీనర్ ఎస్. భీమార్జున రెడ్డి, భాషావేత్తలు అలుగుబెల్లి రామచంద్రారెడ్డి, డా॥ కృష్ణకౌండిన్య, ఎలికట్టె శంకర్‌రావు, సుంకరి రమేష్, మల్లు నాగార్జున రెడ్డి, యం.డి. నజీరుద్దీన్, కె. సతీష్, వై. శ్యాంసుందర్ రెడ్డి, మేరెడ్డి యాదగిరి రెడ్డి, డోకూరి శ్రీనివాస రెడ్డి, పాదర్ కె. అలెగ్జాండర్, సమత శ్రీవల్లాల, ఈసం వినోద్ కుమార్, బండారు శంకర్, బి. రవిరాజు, బాసరాజు యాదగిరి తదితరులు మాట్లాడారు.

---

## భాషను ఆధునీకరించాలి

ఖమ్మం జిల్లా సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో తెలుగుభాష-అధునికత అంశంతో సమాలోచన సమావేశం జరిగింది. ఖమ్మం పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన ఈ సమావేశంలో పలువురు విద్యావేత్తలు, సాహితీవేత్తలు, పలువురు భాషాభిమానులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ శ్రీమతి మాధురి మాట్లాడుతూ 'తెలుగు భాషను ప్రాచీనభాషగా గుర్తించి, పురాతత్వ వస్తువుగా ఉంచితే సరిపోదన్నారు. భాషను ఆధునీకిరంచే దిశగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. వంజాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కోర్టుల్లో తీర్పులు తెలుగులో చెప్పి భాషను ప్రజాస్వామికంగా అమలుచేయాలన్నారు. ప్రాచీన భాషగా గుర్తించిన సందర్భాన్ని ఉపయోగించుకుని తెలుగుభాషను పటిష్టీకరించే చర్యలు చేపట్టాలని పలువురు సభలో అభిప్రాయపడ్డారు. ఈ దిశగా సాహితీవేత్తలు, విద్యావేత్తలు, రచయితలు, కళాకారులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో కవి, కథా రచయిత జీవన్, కవి సాధనాల వెంకటస్వామి నాయుడు, సాహితీ స్రవంతి ఖమ్మం జిల్లా అధ్యక్షులు కె. ఆనందాచారి, కార్యదర్శి రౌతురవి, సభ్యులు పోతగాని సత్యనారాయణ, శేషగిరి, లెనిన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



Pages_Jan 2009.pmd 46 4/19/2011, 4:53 PM

# కొత్త పుస్తకాలు

## పెన్నాతీరం

**ఈతకోట సుబ్బారావు**

**వెల : 100 పేజీలు : 200**




"పెన్నాతీరం" సహృదయులు ఈతకోట సుబ్బారావు నెల్లూరు నగరాన్ని గురించి ధారావాహికంగా "ఆంధ్రజ్యోతి" దినపత్రికలో వారవారం నిర్వహిస్తున్న శీర్షిక పేరు. అందులో వారు నెల్లూరు నగరంలో, నెల్లూరు పరిసరాల్లో చారిత్రకంగా గాని, అలాగ అచ్చు అయిన వాటిలో కొన్నింటిని వారిప్పుడు పుస్తక రూపంలో వెలువరిస్తున్నారు. సుబ్బారావు జర్నలిస్టే కాదు. కవి, భావుకుడు కూడా. అయితే వారి వ్యక్తిత్వంలో జర్నలిజం పాలు కంటే కవిత్వం పాలే ఎక్కువని నా నిశ్చితాభిప్రాయం. వారి "**హృదయలిపి**" చదివిన వారికిది చాలా స్పష్టంగా అవగతమవుతుంది. "

**- వి.యస్. రామచంద్రరావు**

## ఇసుక తుఫానూ ఇనుప డేగా

**హిమజ్వాల**

**వెల : 75 పేజీలు : 176**




"ఇది శక్తిమంతమయిన కవిత్వం, సునిశిత సౌందర్యంతో, తడికళ్ళతో అలరారే కవిత్వం. చరిత్ర గమనంలో కవి తన్ను తాను position చేసుకుని గొంతెత్తిన సందర్భం. ఎక్కడా చచ్చుదనం లేని కవిత్వం - సంశయాలున్నా నిరాశలు లేని కవిత్వం. అనువాదం చేసిన కవితలూ, సందర్భశుద్ధీ, తననుకున్న దానికి దగ్గరగా వున్నవే తన Theme song పాడేవే. ప్రతి కవితా ఒక కత్తివాదర. ముట్టుకుంటే రక్తం కారాల్సిందే. ఈ కవితలన్నీ.

"Poetry has always been one of the few means to assure one another that we exist-that we are alive aware of the real human values, beauty and truth"

**- శివారెడ్డి**

## తెలంగాణ కవిత -2007

**సుంకర రమేశ్**

**వెల : 25 పేజీలు : 135**




"ఈ సంకలనంలో కవితలు తెలంగాణ జీవితంలోని భిన్న పార్శ్వాలను చెబుతాయి. తెలంగాణ నేలలో వస్తున్న మార్పుల్ని పసిగడుతున్నాయి. ఇక్కడి సామాజిక చలనాన్ని కవిత్వంలోకి దింపుతున్నాయి. ఇదంతా సాంఘిక చరిత్రకు కొనసాగింపుగా వుంటున్నది.

నడిగూడెం గట్లయిందేంది? అని జూలూరి గౌరీశంకర్ ప్రశ్నిస్తున్నాడు. మా నడిగూడెం నవిసినట్లయింది అంటాడు జూకంటి

గతులుండీ వసతలుండీ

బొండిగె పిసక్కుంటున్న ఊరు తెలంగాణ.

జూకంటి కవిత్వశైలి ప్రత్యేకమైనది. తెలంగాణ జీవద్భాషను. కొత్తగా పలికిస్తాడు తనకంటూ డిక్షన్‌ను సృష్టించాడు. విలక్షణమైన ధ్వనిని కలిగి ఉంటాయి. కలవరపెడతాయి.

**- సుంకర రమేశ్**

## మెఱుపు శబ్దం

**పి. లక్ష్మణ్‌రావ్**

**వెల : 15 పేజీలు : 65**




"పి. లక్ష్మణరావు మంచి కవి. అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ ప్రవేశించినవాడు. వచన కవితలు రాశాడు, మినీ కవితలు రాశాడు, హైకూలు రాశాడు. ఇలాంటివే ఏ కొత్త ప్రక్రియలున్నా రాస్తాడు. ప్రక్రియ ఏదైనా, అందులో కవిత్వం ముఖ్యం. పాత వచన కవితా సంపుటాల్ని దగ్గర పెట్టుకొని వాటిని అనుకరిస్తూ, అనుసరిస్తూ ఎన్ని లఘు కవితల సంపుటాలు ప్రచురించినా వ్యర్థమే. తనదైన భావుకత, వ్యక్తీకరణ ఉన్నప్పుడే ఏ ప్రక్రియయైనా రాణిస్తుంది. ఈ విషయం నమ్ముతున్నవాడు లక్ష్మణరావు. అందుకే లక్ష్మణరావు కు శుభాభినందనలు.

**-రావి రంగారావు**

## ముందడుగు

**ఇ.సి.ఐ.ఎల్& ఉద్యోగుల రచనల సంకలనం**

**వెల : 50 పేజీలు : 124**




హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఇ.సి.ఐ.ఎల్ ఉద్యోగస్థుల వివిధ రచనల సంకలనం. ముందడుగు. ఈ పుస్తకంలో పదిహేనుగురు రాసిన వివిధ రచనలు ఉన్నాయి. ఎక్కువ భాగం కవితలు. తెలుగు భాష మీద రెండు వ్యాసాలు ఉన్నాయి. చివరగా ఒక నాటిక చేర్చారు. ప్రధానంగా ఈ పుస్తకంలో ఔత్సాహిక రచయితల సాహిత్యాభిలాష కనిపిస్తుంది. అయితే రాసిన వాక్యాలన్నీ సామాజిక స్పృహతో రాయటం అభినందనీయం. ఒక ప్రభుత్వ రంగ సంస్థలో ఈ విధమైన సాహిత్య కృషి జరగడం, దానికి వారి అధికారులు కూడా ప్రోత్సహాన్ని అందించడం ఇతర సంస్థలకు కూడా స్ఫూర్తిని కలిగిస్తుంది.

**- వీరప్రసాద్**

## విశ్వశాంతి - క్రీస్తుక్రాంతి

**ఝాన్సీ .కె.వి. కుమారి**

**వెల : 50 పేజీలు : 133**




"ఈ కవితా సంకలనాన్ని చూడగానే నాకు ముద్దుకృష్ణ సంకలించిన 'వైతాళికులు' గుర్తు కొచ్చింది. ఆయన అప్పటి ఎంపిక క్రైటీరియా ఏమిటో తెలియదు గానీ, ఈ సంకలనానికి మాత్రం క్రీస్తు క్రాంతిలో విశ్వశాంతి పునాది. దీనికి ఈ సంకలన కర్త మనసా వాచా కర్మణా విశ్వసించిన మానవ ప్రేమ ఆధారం. ఈ ఎంపిక విధానానికి కూడా ఆవె అనుసరించిన పద్ధతి పరమ ప్రజాస్వామికమైనది. పత్రికా ప్రకటన ఇచ్చి దానికి స్వచ్ఛందంగా స్పందించిన వారి నుండి కవితలందుకొని, వాటిలో తన ఫిలాసఫీకి అనుగుణమైన వాటిని ఎంపికచేసి, ఎంతో శ్రమకోర్చి ప్రచురిస్తున్న అపురూపమైన గ్రంథమిది."!!

**- డా॥ ఎన్.గోపి**

# కొత్త పుస్తకాలు



## మౌన ఘోష

**యస్.ఆర్. పృథ్వి**

**వెల : 30 పేజీలు :26**

"శ్రీ ఎస్.ఆర్. పృథ్వి రచించిన రుబాయిల సంపుటి 'మౌనఘోష' పృథ్వి ఈ సంపుటిలో చాలావరకు అంత్యప్రాస నియమాన్ని పాటించారు. అయితే లయాత్మకతలో కొంత వెసులుబాటు ఈ రుబాయిల్లో అగుపిస్తున్నది. ఎన్నెన్నో ఉదాహరణ యోగ్య పంక్తులు ఈ సంపుటిలో ఉన్నాయి. ఉదాహరణకు 'ఉత్తుత్తి మాటలకు'-'రాయలసీమ యెద నిండ'-'వెన్నెల్లో గోదావరి', 'అమాయకులపై' లాంటి రుబాయిలు పృథ్వి రచనా చమత్కృతికి నిలువుటద్దాల్లా నిలుస్తాయి.

తెలుగులో రుబాయిలు రూపొందించిన కొద్దిమంది కవుల పంక్తిలో తగిన పీట వేసుకున్నందుకు ఎస్.ఆర్. పృథ్విని మనసారా అభినందిస్తున్నాను"

**- సినారె**

## తాతోలు హైకూలు



**తాతోలు దుర్గాచారి**

**వెల : 50 పేజీలు : 28**

"బాల్యం ఇప్పుడు బండబారి పోతుంది. ర్యాంకుల గదిలో మసిబారి పోతుందని కవి ఆవేదన చెందుతూ... 'పుస్తక శిలువల్ని మోసే బాలయేసులు బడిపిల్లలు...'- కన్నతల్లి, ఉన్న ఊరు అంటే ఏ మనిషికి మక్కువ ఉండదు. అందునా కవికయితే కవిత్వం కమనీయ గోదావరిగా ప్రవహిస్తుంది, పరిమళిస్తుంది. 'భద్రాచలా'ధీశునిపై భక్తి పోటెత్తే తరంగితమౌతుంది

'రామయ్య నాతిని చేశాడు నాకవితను కూడా...' -

'...హీనంగా చూడకు దేన్నీ, అన్నీ కవితామయమేనోయి...!' అన్న మహాకవి కవితా పంక్తులు గుర్తుకొచ్చేటట్లు, కవి దుర్గాచారి ఈ క్రింది హైకూను ఎంత ధ్వనిగా చెప్పారో చూడండి.

'చెప్పులే పద్మాలుగేళ్ళు రాజ్యమేలాయి' - హైకూకవి అంతర్ముఖుడై ఉండాలి. ప్రకృతిపట్ల ప్రేమ కలిగి ఉండాలి. పైగా, రెంటినీ ఏకకాలంలో కలిగి ఉండాలి. అప్పుడే అతనిలో హైకూతత్వం సిద్ధిస్తుంది అటువంటి అద్భుతమైన హైకూతత్వం అణువణువూ అందుకొన్న హైకూ కవి తాతోలు దుర్గాచారి"

**- ఎస్.ఆర్.భల్లం**



## నల్లమల రత్నాలు (నానీలు)

**ఎం.ఏ. గఫార్**

**వెల : 30/- పేజీలు : 44**

'శతాధిక నానీకవుల నానీలను అవలోకించిన తరువాత శ్రీ ఎం.ఎ.గపార్ రచించిన 'నల్లమల రత్నాలు' చూసే అవకాశం నాకు లభించింది. గేయ, వచన కవితా రచనా కుశలుడైన గఫార్ నానీలను పేణీలుగా రుచిచూపించడంలోనూ దిట్ట.

మా పాలమూరు జిల్లాలో నిరుపేదలైన కూలీలే కాదు, సుప్రసిద్ధ కవిపండితులూ ఉన్నారు. అయితే వారి ప్రోత్సాహం లభిస్తే ఇంకా రత్నాల్లాంటి కవులు రంగస్థలం మీదికి వస్తారు. ఉప్పునూతల వాస్తవ్యుడైన గఫార్ రచించిన నానీలు ఉద్వేగభరితంగా సహృదయవేద్యంగాను అలరారుతున్నాయి.'

**- డా॥ మసన చెన్నప్ప**



## గ్రంథావలోకనమ్

**కోడిహళ్ళి మురళీమోహన్**

**వెల : 75 పేజీలు : 136**

"కోడీహళ్ళి మురళీమోహన్ వివిధ పత్రికలలో చేసిన వివిధ గ్రంథాలపై సమీక్షల సంకలనం ఇది. సమీక్షా వ్యాసాల సంకలనం అన్నాడు కాని చాలావరకు గ్రంథ పరిచయాల పరిధిని మించినవి ఎక్కువ లేవు. అయితే ఇవి సూక్ష్మంలో మోక్షం అన్నట్టుగా గ్రంథాలను సవిశేషంగా విశ్లేషించినట్టు కనిపిస్తాయి. ఇతను సమీక్షించిన కథల పుస్తకాలలో రచయితల ప్రతిభను, నాడిని పట్టుకున్నట్టు తెలుసుకోవచ్చు. ఉదాహరణకు సుంకోజి దేవేంద్రాచారి కథలను సమీక్షిస్తూ 'ఇతని కథలలో ఉపోద్ఘాతాలూ, ఉపసంహారాలూ ఉండవు. ఉపమానాలూ, వర్ణనలూ అస్సలుండవు. చాలా సులభమైన శైలిలో తను చెప్పదలచిన విషయాన్ని నేరుగా, స్పష్టంగా చెప్పడం ఇతని పద్ధతి' అంటాడు.

## 1980 తర్వాత తెలుగు స్త్రీవాద నవల



**సంపాదకులు: కె. లక్ష్మీనారాయణ**

**రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి**

**వెల : 60/- పేజీలు : 162**

"కానీ 1980 తర్వాత వచ్చిన నవలల పట్ల జరగవలసినంతగా చర్చలు జరిగిన దాఖలాలు లేవు. ఈ కాలంలో బతుకు పోరు - బి.ఎన్. రాములు; సుప్తభుజంగాలు-సి. సుజాత; స్వేచ్ఛ, కన్నీటికెరటాల వెన్నెల, సహజ, మానవి-ఓల్గా; ఎల్లి-అరుణ; ఎండమావులు, మనసున మనసై-డి. కామేశ్వరి; అహల్య-కుప్పిలి పద్మ; ఆమె అడివిని జయించింది-గీతాంజలి; ఉమెన్స్ కాలేజ్-అంపశయ్య నవీన్; మళ్ళీ వచ్చిన వసంతం-ముక్తేవి భారతి; ఆమె జీవితాన్ని జయించింది- శారదా అశోకవర్ధన్; ప్రథమస్థానంశ-మానం పద్మజ; వెండిమేఘం-సలీం లాంటి నవలలు వెలువడ్డాయి.

**- కె. లక్ష్మీనారాయణ, రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి**

## రేకు విచ్చిన మొగ్గ



**తాతోలు దుర్గాచారి**

**వెల : 50 పేజీలు : 48**

"ఏమి చెప్పాలని, ఎవరిని కదిలించాలని, ఎవరు ఆనందించాలని కవి అనుకుంటాడో వాళ్ళనది కదిలించడమో, ఆనందించడమో పరామర్శించడమో జరిగేలా చెప్పగలగడంలో కవి ప్రతిభ ఆధారపడి వుంటుంది. అది సాధించేందుకు నిత్య తపస్వియై సాధన కొనసాగించాలి. ఆ ప్రతిభ జన్మతః వస్తుందంటారు, కానీ కవితా పంటకై పరితపించే ప్రతివారూ సాధనలో సాధిస్తారని నా నమ్మకం.

**- చేరా**

మిత్రుడు సాహిత్యరంగంలో నా సహచరుడు. ప్రథమంగా కవితా సంకలనం తీస్తూ ముందుమాటల్లో ఒకమాట రాయమని ముందెప్పుడో కోరితే ఇప్పటికి గానీ కుదరలే. సమతా భావన నిండుగా వున్న మిత్రుని కవిత్వం దినదినం మరింత పదునెక్కాలని కోరుకుంటున్నాను.

**- కె. ఆనందాచారి**

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

Pages_Jan 2009.pmd 48 4/19/2011, 4:53 PM